


ఆంధ్రపత్రిక


సచిత్ర వారపత్రిక

వెల 4 అణాలు ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY 30-8-19

★ వార్తాచిత్రాలు ★



9 ఆగస్టునుండి, వరంగల్ జాతీయ యువజన కాంగ్రెస్ అధ్వర్యమునజరిగిన జాతీయ సప్తాహసందర్భంలో, సరఫరా శాఖామంత్రులు శ్రీ వినాయకరావు విద్యాలంకార్ గారు, హనుమకొండలోని గాంధీపార్కులో, మృతవీరుల స్మారక స్తూపమునకు శంకుస్థాపన చేశారు



నెల్లూరువద్ద, రైలువంతెనప్రక్కనే పెన్నానదిమీద నిర్మించుచున్న రహదారి వంతెన

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0

విడిప్రతిక
4 అణాలు

ప్రతిబుధవారము ప్రకటింపబడును


ఒరులేయవి యొనరించిన నరవర, యప్రియము తనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్.
(మహాభారతము)

Founder : K. NAGESWARA RAO

సంపుటము 42

సంచిక 52

వికృతి సంవత్సర శ్రావణ బహుళ తదియ బుధవారము



కాశ్మీర్ సమస్య: మరొక బలి

పరిష్కారసాధనకై తాను చేసిన ప్రయత్నంకూడా విఫలమైందని మధ్యవర్తి సర్ ఓవెన్ డిక్సన్ ప్రకటించాడు.

—నేషనల్ హెరాల్డ్



ఆంధ్రపత్రిక

1950-వ సం॥ ఆగస్టు నెల 30-వ తేది బుధవారము

నెహ్రూ హెచ్చరిక

కాశ్మీరు సమస్యాపరిష్కారమునకు ఐక్య రాజ్యసమితి ఆధ్వర్యమున ప్రయత్నములు ప్రారంభమై రెండు సంవత్సరములైనను, పండిట్ నెహ్రూ మొన్నటి దినము పత్రికావిలేఖరులతో ముచ్చటించుచు ప్రకటించినట్లు, సమితిప్రయత్నారంభమునకు పూర్వము పరిస్థితి ఎట్లున్నదో నేడు అట్లే యున్నది.

1948 ఆగస్టు తీర్మానము ప్రకారము 1949 జనవరి 1 నుండి సంస్థానములో యుద్ధచర్యలు విరమింపబడెను. తరువాత ఈ ఇరువది మాసములలో కాశ్మీరు మధ్యవర్తిసంఘము, ఆ సంఘము "ఆత్మహత్య" చేసుకొనిన తరువాత సమితి మధ్యవర్తి సర్ ఓవెన్ డిక్సన్ కాశ్మీరు సమస్యపై భారత-పాకిస్థాన్ ప్రభుత్వములకు ఒడంబడిక కుదుర్చుటకు చేసిన ప్రయత్నము లన్నియు విఫలమైనవి. రాజీప్రయత్నముల వైఫల్యమునకు భారతప్రభుత్వముదే పూర్తి బాధ్యత యని నిరూపించుటకు పాకిస్థాన్ప్రధానమంత్రి ఎన్ని ప్రయత్నములు చేసినను సత్యమును మరుగుపరచుట సాధ్యము గాదు. సర్ ఓవెన్ తన ప్రయత్నములు విఫలమైనవని వెల్లడించిన తరువాత, పాకిస్థాన్ ప్రధానమంత్రి లియాఖత్ ఆలీఖాన్ జనవాక్యనిర్ధారణకు భారతదేశము సమ్మతింపనందున తిరిగి ప్రతిష్టంభన మేర్పడినదని కరాచీ పత్రికా విలేఖరుల సమావేశములో ప్రపంచమునకు చాటెను.

యథార్థస్థితిని, కాశ్మీర్ సమస్య పూర్వాపరములను తెలుసుకొనుటకు ఓపిక, సామర్థ్యము లేనివారు పాకిస్తాన్ ప్రధానమంత్రి భారతదేశముపై చేసిన ఆరోపణలలో కొంత సత్యముండవచ్చునని భావింపవచ్చును. అట్టివారు అదే దృక్పథముతో, అదే మనస్తత్వముతో పండిట్ నెహ్రూ వెల్లడించిన విషయములను గూడ పరిశీలించినచో లియాఖత్ ఆలీఖాన్‌గారి ప్రకటనయందలి సత్యాసత్యములు బట్టబయలు కాగలవు.

కాశ్మీరుపై భారతీయసేనలు దురాక్రమణ జరిపినట్లు పాకిస్తాన్ ప్రపంచమును మోసముజేయ యత్నించి, ఇదివరలో విఫలమైనది. కాశ్మీర్ యుద్ధముతో తమకు సంబంధము లేదని, సరిహద్దు కొండజాతులవారే సంస్థానమున ముస్లింలను భారతదేశ దురాక్రమణనుండి రక్షించుటకు యుద్ధము చేయుచుండిరని ప్రపంచమును నమ్మింపజూచెను. తుదకు సమితి కాశ్మీరు కమిషన్ విషయసేకరణకు యుద్ధరంగమునకు వెళ్ళనున్న సమయము జూచి పూర్వపు ప్రకటనల నన్నింటిని ఉపసంహరించుకొనెను. తమ దేశరక్షణకు తమసేనలు కాశ్మీర్‌లోయలో ప్రవేశించినవని సమర్థించుకొనజూచెను. భారత ప్రధాన మంత్రి పత్రికాప్రకటనలో పాకిస్తాన్ వాదము ఎంత నిర్హేతుకమైనదో, కరాచీ అధికారుల ప్రకటనలు ఎంత సత్యదూరములైనవో సహేతుకముగ వివరించిరి.

కాశ్మీరుపై దురాక్రమణ జరిపినది పాకిస్తానే నని సమితి కాశ్మీరుకమిషన్ తొలినివేదికే సూచించెను. ఆ విధముగ రెండున్నర సంవత్సరముల క్రితము భద్రతామండలి భారతదేశము పాకిస్తాన్‌పై చేసిన ఫిర్యాదుఅంశములు ధ్రువపడినవి. అయినను భారత ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ ప్రకటించినట్లు, భద్రతామండలి తన విధ్యుక్తధర్మమును నిర్వర్తింపక దురాక్రమణదారుని, ఆ దురాక్రమణను ప్రతిఘటించువారిని సమస్థాయిలో నుంచెను. ఎందరు ఎన్ని ప్రయత్నములు చేసినను కాశ్మీర్ సమస్య పరిష్కారము గాకపోవుటకు భద్రతామండలి ఆదిలో చేసిన ఈ తప్పిదమే కారణము. కనుకనే పండిట్ నెహ్రూ భద్రతామండలి కాశ్మీరు సమస్యను తిరిగి మొదటినుండి విచారింపవలసి యుండు

నని సూచించిరి. అయితే ఏ పరిష్కారవిధానము లోను పాకిస్తాన్‌కు ప్రమేయము ఉండరాదు. పండిట్ నెహ్రూ విస్పష్టము చేసినట్లు కాశ్మీరులో ప్రజాభిప్రాయసేకరణతో పాకిస్తాన్‌కు సంబంధము లేదు. కాశ్మీరు మహారాజా ఆర్తనాదమును ఆలించి, దురాక్రమణదారులను ఎదుర్కొనుటకు సేనలను పంపుటకు ముందు, సంస్థానభవిష్యత్తును ప్రజలే నిర్ణయించుకొనవలెనని భారతప్రభుత్వము స్పష్టముచేసెను. అంతేగాక కాశ్మీరులో ప్రజాస్వామికపరిపాలనను ఏర్పాటు చేయవలసినదిగ ఆందోళన చేసిన అబ్దుల్లా ప్రభృతుల విడుదల జరిగినగాని, జాతీయ మహాసభ నాయకులతో ప్రభుత్వపునర్నిర్మాణము జరిగినగాని, భారతీయ ప్రభుత్వము సంస్థానమున శాంతి, భద్రతల స్థాపింపజాలదని స్పష్టము చేసెను. ఆవిధముగ కాశ్మీరులో భారత ప్రభుత్వము ఏర్పాటుచేసిన ప్రజాప్రభుత్వమును తొలగించుటకు పాకిస్తాన్ ఎంత ప్రయత్నించినను, అట్టి ప్రయత్నము ఫలింపదు. 1947 ఆగస్టుకు పూర్వము కాశ్మీరు సంస్థాన ముస్లింసభవారు మహారాజాతో లాలూచీపడి, జాతీయమహాసభను అణచి

వేసి, నిరంకుశప్రభుత్వమును నెలకొల్పుటకు
త్నించిరి. వారి ప్రయత్నములకు అప్పటి భ
ముస్లింలీగ్ పూర్తిగ తోడ్పడెను. అప్పు డా ప్ర
ములు విఫలమైనట్లే, నేడును తిరిగి అబ్దుల్లా ప్ర
మును పదభ్రష్టము చేయుటకు పాకిస్తాన్ ఎన్ని
త్నములు చేసినను ప్రయోజనము ఉండదు. ఈ
ములో భారత ప్రధానమంత్రి చేసిన స్ప
సంస్థానప్రజ లందరికి సంతృప్తికరముగ నుండు
ఎట్టి సందేహము లేదు.

భద్రతామండలి మధ్యవర్తి సర్ ఓవెన్
నివేదికను పరిశీలించు సందర్భమున భారత
మంత్రి చేసిన హెచ్చరికను గుర్తింపక తప్పదు.
చేయక పూర్వమువలెనే వ్యవహరించిన,
సమస్య ఎప్పటికి ఇట్లే యుండునని చెప్పుటకు
లేదు. అబ్దుల్లాప్రభుత్వము ఇప్పటికి తమ
ములో నున్న సంస్థానములో ఎన్నికలు జరిపి,
సంస్థానశాసనసభను ఏర్పరచి, భద్రతావ
త్రోసిరాజనక తప్పదు. ఆ పరిణామమును ఐక్య
సమితి మధ్యవర్తితో పాకిస్తాన్ కూడ నివారింపజాల

విషయానుక్రమణిక
30 ఆగస్టు 1950

మనదేశం

కోపతాపాలు *

వానదేవుడికీ, భూదేవికీ కోపం, ప్రజలకి తాపం; రాజకీయ నాయకులకి కోపద్వేషాలు, మళ్ళీ ప్రజలకే తాపం— ఇదే పరిపాటయిపోయింది మన దేశానికి. మన దేశమే కాదు, దాదాపు అన్ని దేశాలకీ, మానవకోటికంతకీ ఈనాడు ఇదే పరిపాటయిపోయింది. అధికారంలో పాలులేని ప్రజలందరికీ యాతనలే నిత్యజీవితమైనాయి. ఈ కోపతాపాలను మించిన వార్తలే లేవు లేదు. ఎంత అద్దె ఇచ్చినా, ఎంతెంత మడుపులు చెల్లించినా సదుపాయమైన నివాసం లభించడం, జీవనోపాధి ఆర్జనకంటె కష్టతరమైన ఈ రోజుల్లో ఇండోర్‌లో ఒక అద్దెఇంట్లోనుంచి వెళ్ళగొట్టబడిన ఒక గృహస్థు దుర్భర వేదన సహించలేక చేజేతులా తన బిడ్డను మేడపైనుంచి క్రింద పారవేసి చంపుకొన్నాడంటే, అతన్ని కూడా నిందించడానికి వీల్లేని పరిస్థితి ఏర్పడింది.

తామింత తిని, ఇతరుల కింత పెట్టగలిగిన కృష్ణా, గోదావరీ ప్రాంతసీమ ప్రజలుకూడా ఆకలితో అలమటిస్తున్నారంటే ఈ పరిస్థితులే కారణం. ఎన్ని తుఫాన్లు వచ్చినా ప్రజలకు కడుపునిండా కూడివ్వగలిగిన సర్కార్లలో ఈయేడు శ్రావణమాసంలో వానలు కరువైనాయి. మాగాణిపంటలూ, మెట్టపంటలు కూడా ధ్వంసమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. సుభిక్షమైన ప్రాంతాలు పశ్చిమబెంగాల్, ఒరిస్సా, బీహార్ రాష్ట్రాలు వరదలకూ, కరువులకూ ఆలవాలమైనాయి. ఉత్తరప్రదేశ్‌లోకూడా విపరీతమైన వరదలు వచ్చాయి. నాలుగు రాష్ట్రాల్లోనూ విపరీతంగా పంటలకు నష్టం సంభవించింది. తనకు చాలినంత పండించుకు తినే అస్సాం రాష్ట్రాన్ని పధ్నాలుగు రోజులుగా నిత్యభూకంపాలు బీభత్సం తాండవింపచేశాయి. ఈ నాటికీ భూకంపాలు దినదినం సంభవిస్తూనే ఉన్నాయి. ఎగువ అస్సాం ప్రాంతమంతా పోలికైనా లేకుండా పూర్తిగా మారిపోయింది. రోడ్లున్న చోట అఖాతాలు, నదులు ప్రవహించే ప్రాంతాల పెద్ద మడుగులు ఏర్పడిపోయాయి. ఎత్తైన ప్రాంతాలు కుంగిపోయాయి. నగరాలు, గ్రామాలు నేలమట్టమైపోయినాయి. అన్నదానం, జలదానం, ప్రాణదానం చేసే నదులు ప్రజలకు క్షోభ తెచ్చిపెట్టాయి.

ఈ భూకంపం ఎక్కడో కనుచాటునున్న అగ్నిపర్వతం బ్రద్దలై సంభవించిందని కొందరన్నారు. కొందరు పెద్ద ప్రేలుడు ధ్వనులు విన్నారన్నారు. కొందరు దూరాన ఎర్రని మంటల కాంతులు చూశారన్నారు. శాస్త్రజ్ఞులు అసలీ ప్రాంతాల బ్రద్దలవగల అగ్నిపర్వతం లేదన్నారు. ప్రపంచంలోకల్ల అత్యున్నత శిఖరాలనందుకున్న హిమాలయాల బరువుకి తట్టుకోలేక గంగావర్తప్రాంతం జరుగుతున్నదనీ, ఆ మోపు ఆగ్నేయదిశగా అస్సాంపై తగులుతున్నదనీ, అందువల్లనే అస్సాంలోనే నిత్యం భూకంపాలు సంభవిస్తున్నాయనీ అన్నారు. టిబెట్‌లో తూర్పవ ఒక మూలను పర్వతాలు ఆగస్టు 15వ తేదీని ఒక్క ఊగు ఊగాయనీ, దాంతో భూమి చలించి, ఆపైన క్రమక్రమంగా సర్దుకోవడంలో ఈనాటికీ భూకంపాలు జనిస్తున్నాయనీ వీరు చెప్పారు. అంటే ఆ ఊపు తరవాత ఆ ప్రాంతంలో భూమి నెమ్మదిగా కుదురుకుంటోందన్నమాట— అరవైమంది ఎక్కిన బస్సులోనుంచి మధ్య కూచున్న ప్రయాణీకుడు మధ్యదోవలో బస్సు దిగితే తిరిగి ఏభైతొమ్మిదిమందీ సర్దుకోడానికి అరగంటసేపు పట్టినట్టు.

కార్మికుల సమ్మె *

దేశాని కివి చాలనట్టు, లేక బాదరాయణసంబంధంలాగా వీటివల్లనే అవసరమైనట్టు కార్మికుల సమ్మెలు సిద్ధమైనాయి. బొంబాయిలో నూలుమిల్లులు, బట్టలమిల్లులు దాదాపు అన్నీ (62 లో 59) మూసివెయ్యబడినాయి. పారిశ్రామిక వివాద పరిష్కర్త చేసిన నిర్ణయంప్రకారం మూడు మాసాల బోనస్ యజమానులివ్వకుండా, పైకి అప్పీల్ చేసి జాప్యం చేస్తున్నారనే కారణంపైన ఆ మిల్లుల్లోని కార్మికులు సోషలిస్టుల ఆధ్వర్యంకింద సమ్మెకట్టారు. మీతోబాటే మేమూ నని కమ్యూనిస్టు పార్టీలోని కార్మికులూ (గిర్నీ కామ్‌గార్ యూనియన్) సమ్మెకి దిగారు. సమ్మెచేస్తున్నవారిపట్ల సానుభూతి సూచకంగా బొంబాయిలోని ఇతర పరిశ్రమల్లోని కార్మికు లందరిచేతా కూడా ఒక రోజు సమ్మె కట్టించడానికి సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ సన్నాహాలు చేస్తున్నారు.

అప్పీల్‌లో ఉన్న సమస్యపైన సమ్మె కట్టటం సక్రమంకాదని బొంబాయి ముఖ్యమంత్రి బి.జి.ఖేర్ అన్నారు. సర్వకార్మికుల సమ్మె న్యాయశాసనాలరీత్యా అక్రమంగా పరిగణింపబడుతుందని కార్మికుల్ని వారు హెచ్చరించారు. కాని సోషలిస్టులు లెక్క్యపెట్టడంలేదు. ఈ సమ్మెవల్ల అసలే హీనంగా ఉన్న వస్త్రోత్పత్తి వారం పదిరోజులుగా పడిపోయింది. దీనివల్ల ప్రజలు పడే పాట్లు ముందున్నాయి.

సోషలిస్టుల అరెస్టు *

అసలు సోషలిస్టులు సమయంచూసి, ఏ సాకు దొరికినాసరే చెప్పి సమ్మెలుచేయించి, తద్వారా పార్టీకి పరపతి నార్జించుకోవాలని తలపెట్టినట్లు కనపడుతుంది. సరీగా బొంబాయిలో సమ్మెచేస్తున్న సమయంలోనే, హైదరాబాదులో ఇదివరకు లేని కరువు ఇప్పుడే వచ్చినట్లు, ఆహారసమస్యను సాకుగా తీసుకొన్న "ఆకలి యాత్రలు" ఆందోళన ప్రారంభించారు. ఊరేగింపులు జరపకూడదని హైదరాబాదు ప్రభుత్వం విధించిన ఆజ్ఞనుల్లంఘించడం కార్యక్రమంగా పెట్టుకున్నారు. కమ్యూనిస్టు దౌర్జన్యాల ఉధృతి తగ్గి, కుదుటపడుతున్న హైదరాబాద్‌లో మళ్ళీ కార్మికుల అశాంతి రెచ్చగలదనే భయంతో ప్రభుత్వం హైదరాబాద్ సోషలిస్టు నాయకుల్ని అరెస్టుచేసింది. అరెస్టులూ, కారాగారవాసాలే రాజకీయబలాభివృద్ధికి దోహదమిచ్చే మన దేశంలో, ఈ అరెస్టులతో హైదరాబాద్‌లోని కార్మిక కర్షక వర్గాలలో ప్రాబల్యానికి, కమ్యూనిస్టులతో పోటీకి సోషలిస్టులు రంగంలోకి గట్టిగా దిగారన్నమాట.

అయితే బ్లాక్‌మార్కెటీర్ల షాపులవద్ద పికెటింగ్ ఆరంభించి, ప్రజల్లో పలుకుబడి సంపాదించుకోవాలనే సోషలిస్టుల కార్య

(36-వ పేజీ చూడుడు)

భూదేవతకి ప్రజలభారం దుర్భరంగా ఉన్నదా?

(49-వ సంచిక తరువాయి)

[యం. ఇల్యిన్ వ్యాసం ఆధారం]

ప్రపంచమంతటినీ జాగ్రత్తగా పరిశీలించి మానవుడు సంపదుత్పత్తికి సముగ్రమైన కార్యవిధానం నిర్ణయించవలసిన అగత్యం ఉంది. ఆరోజు కూడా త్వరలో రావచ్చును. సహజసంపద ఎంత ఉన్నదో, సహజశక్తి ఎంత ఉన్నదో, నీరు, బొగ్గు, ఇనుము మొదలైనవెంతెంత ఉన్నాయో పరిశీలించి, వానిని మానవుల ప్రయోజనానికే విధంగా తేవాలో నిర్ణయించడం అవసరం

మొట్టమొదట భూమిపై ప్రసరిస్తున్నప్పటికీ మానవులకు వినియోగం కాకుండా వ్యర్థమౌతున్న సూర్యరశ్మి నేవిధంగా వినియోగించవచ్చునో చూడవచ్చును. భూమి సూర్యరశ్మిని అపారంగా గ్రహిస్తున్నది. భూమిపై పెరిగే ప్రతి పచ్చి మొక్కా సూర్యరశ్మిని స్వీకరించి, రాసాయనికశక్తిగా పరివర్తింపచేస్తున్నది. సూర్యరశ్మి సహాయంతోనే ఆకులు, కొమ్మలు, రెమ్మలు, మొదళ్లు, గింజలు, ఫలాలు వృద్ధి అవుతున్నాయి.

సూర్యరశ్మివల్ల నేల వేడెక్కుతున్నది. వాయుతరంగాలు లేస్తున్నవి మహాసముద్రంలో ఉపరివాహినులూ, అంతర్వాహినులూ సూర్యుని వేడిమివల్ల ఉద్భవిస్తున్నాయి.

నీటిని ఆవిరిగామార్చి, సాలీనా 3 లక్షల 80 వేల ఘనపు కిలోమీటర్ల నీటిని ఆకాశంలోకి తీసుకుపోతున్నది అంటే బైకాల్ సరస్సులో ఎంత నీరుందో అంత నీటి నన్నమాట.

మానవుడు ఉత్పత్తిచేస్తున్న విద్యుచ్ఛక్తి కంటె లక్షరెట్లు శక్తిని భూమి సూర్యరశ్మివల్ల గ్రహిస్తున్నది. ఇందులో ఎన్నోవంతు వాస్తవంగా ఈనాడు మానవులకు వినియోగపడుతున్నది ?

ఆకులపై పడే సూర్యరశ్మిలో నూరింట ఒకటి రెండు వంతుల్ని మాత్రమే మొక్కలు రాసాయనిక పరివర్తనానికి వినియోగిస్తాయి. సేద్యపు మొక్కలు భూతలంలో పదోవంతు మాత్రమే విస్తరించి ఉన్నాయి.

అంటే భూమిపై పడుతున్న సూర్యరశ్మిలో వెయ్యింట ఒకటి లేక రెండు వంతులే మనకు లభ్యమౌతున్నదన్నమాట.

సేద్యభూమిని విస్తరింపచేసి సేద్యఫలాన్ని అభివృద్ధిచేయగలిగినట్లయితే సూర్యరశ్మిలో అధికభాగాన్ని మానవుడు వినియోగపరుచుకోగలడు.

సూర్యరశ్మిని ఆకర్షించేవానిలో నీరు కూడా ముఖ్యమైనదే

జలభ్రమణం *

సూర్యుడు నీటిని సముద్రంలోనుంచి భూమికి తీసుకుపోతాడు. అక్కడనుంచి తిరిగి సముద్రంలోకి పోతుంది.

శక్తి నిరుపయోగంగా పోకుండా ఉండాలంటే ఈ జలభ్రమణాన్ని వినియోగపర్చుకోవాలి.

మానవునికి పూర్తిగా సేవచేసేవరకూ నీటిని సముద్రంలో పడిపోనివ్వకూడదు.

ఆఫ్రికాలో నదీగమనాన్ని మార్చగలిగినట్లయితే భూమధ్యరేఖ ప్రాంతంలోని తేమవల్ల సహారా, కలహారీ ఎడారుల్ని సేద్యం చెయ్యవచ్చును.

ఆస్ట్రేలియాలో అనావృష్టిబాధ అధికం. కాని ఆ ఖండంలో భూగర్భంలో అపార జలవాహినులున్నాయి. అక్కడ కావలసినది లోతు బావులు.

భారతదేశంలో పంటలు చాలావరకూ వర్షాలపైనా, ఋతుపవనాలపైనా ఆధారపడి ఉంటాయి వర్షాలు కొరవైతే కరవులు తప్పవు కాని చంచలగతితో అతివేగంగా హిమాలయాలనుంచి ప్రవహించే నదులలోని నీటిని వినియోగపరచగలిగినట్లయితే పరిస్థితిని పూర్తిగా మార్చి వెయ్యవచ్చును.

నీటిని ఇప్పటికంటె అధికంగా మానవుని ప్రయోజనానికి వినియోగపరచవచ్చును.

భారతదేశంలో వస్తూత్పత్తి కృషిలో నూరింట 70 వంతులు ప్రజల, పశువుల కాయకష్టం. జలవాహినులశక్తి బొత్తిగా ఉపయోగపడ్డంలేదు.

నయాగరాజలపాతంవల్ల ఇప్పుడు మానవులకు 15 లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి మాత్రం లభిస్తోంది. వాస్తవంగా 50 లక్షల కిలోవాట్లు ఉత్పత్తిచేయవచ్చును.

ఆఫ్రికాలో విశాలమైన పీఠభూముల గుండా నదులు ప్రవహిస్తున్నాయి. జలపాతాలు అతివేగంతో ప్రవహించే నదీనదాలు ఉన్నాయి. వీని నన్నిటినీ ఇంకా మానవుడు వినియోగించడంలేదు.

నదులవల్ల విద్యుచ్ఛక్తి, ఉత్పత్తి సేద్య సదుపాయంమాత్రమే కాదు, రవాణా సదుపాయం కూడా ఏర్పాటు చేసుకోవచ్చును. ఇప్పుడు బరువులు మొయ్యడానికింకా మనుషులు, పశువులే ఆధారం.

ఆఫ్రికాలో ఉత్తరఅమెరికాలో కంటె రెట్టింపు నీటిసదుపాయం ఉంది. యూరప్ కంటె ఒకటిన్నరరెట్లు వైశాల్యం కల భూమి సేద్యయోగ్యమైనదున్నప్పటికీ, మానవుడు దాన్ని వినియోగించడంలేదు. భూగర్భంలో చెప్పలేని అపార ఖనిజ సంపద ఉంది. కాని ఈనాడు ఆఫ్రికా హీన దరిద్ర ఖండంగానే ఉండిపోయింది. లోకంలో జనాభా మరీ అధికంగా ఉందని పాశ్చాత్య విజ్ఞానశాస్త్రజ్ఞులు కొందరు రవగలుగుతున్నారు. భారతదేశంలో మలేరియానీ, ఆఫ్రికాలో విషపు ఈగల్నీ నిర్మూలించడమంటే అందువల్లనే కొందరికిభయం. అవి ఎప్పటికప్పుడు జనాభాని తగ్గిస్తూ ఉంటే మంచిదని వారి అభిప్రాయం

కాని నిరుపయోగంగా పడి ఉన్న లక్షలాది ఎకరాల భూమిని సేద్యం చేసి, ప్రవాహపు నీటిని సక్రమంగా వినియోగించినట్లయితే, ఉన్నజనంకాక ఇంకా అనేకోట్లమందికి ఆహారాదికాలు సమృద్ధిగా లభిస్తాయి.

జలభ్రమణాన్ని మానవుడు సక్రమమైన విధిలో నడిపించగలిగినట్లయితే భూమిపైన అనావృష్టి బాధ అనేది ఉండదు. జనావాసాలకి చల్లదనం లభిస్తుంది. దీనికి నదుల్ని కొంచెం మళ్లించాలి. అంతే. భాస్వరం, పొటాసియం, కాల్సియం మొద

తైనవి కేలివిడిచి సముద్రం చేరకుండా కాపాడాలి

ప్రతిఏడూ కోటానుకోట్ల టన్నుల మన్ను సముద్రంలోకి కొట్టుకుపోతోంది ఆ మట్టిలోని సారమంతా మానవుడికి దక్కకుండా పోతోంది. వర్షంవల్ల తిరిగి నీరు భూమికి వస్తుంది కాని, ఆ సారవంతమైన మన్ను, ఉప్పులు తిరిగిరావు నదీగమనాన్ని సక్రమంగా నిర్బంధిస్తే ఇదంతా కాపాడుకోవచ్చును..

వాయుతరంగాల్లో సూర్యరశ్మి ఎంతో ఖర్చవుతోంది భూమధ్యరేఖాప్రాంతంలో వాయువులు వేడెక్కి, పల్చబడి, పైకిలేచి, ధ్రువప్రాంతాల దిక్కుగా వీస్తున్నాయి. ధ్రువప్రాంతంనుంచి చలిగాలులు బరువుగా కింది పొరలలో భూమికి సమీపంగా వీస్తూ భూమధ్యరేఖ ప్రాంతానికి పయనిస్తున్నాయి ఈ వాయుతరంగాలలోని శక్తి వృథా అయిపోతోంది. నిజానికి ఈ తరంగాలవల్ల అపారంగా శక్తిని ఉత్పత్తి చేయవచ్చును.

భూగర్భంలో సంపద *

భూమి సూర్యరశ్మిని గ్రహించి, అందులోని శక్తిని నిలవచేసుకుంటుంది. పీట్ (భూగర్భంలో పడి నిలవ ఉండి, కుళ్లిపోయిన చెట్లు ఆకు అలం), బొగ్గు, నూనెలు మొదలైనవన్నీ దీనికి సంబంధించినవే మానవులు ఈ సరుకుల్ని తవ్వి తీసి వాడుకుంటున్నారు

పాతికేళ్లుగా 150 కోట్ల టన్నుల బొగ్గు, 80 కోట్ల టన్నుల నూని తీసి ఖర్చు పెడుతున్నారు. వీటివల్ల 500 కోట్ల టన్నుల బొగ్గుగాలి పుడుతోంది ఇదంతా ఎక్కడికి పోతోంది? అందులో కొంత ఆకుల్లోకీ, మొక్కల్లోకీ ఎక్కుతుంది దానిని మొక్కలు సూర్యరశ్మి సహాయంతో విడగొడుతున్నాయి

అడవుల్ని బొగ్గు ఫాక్టరీ లనవచ్చును. చదరపు మైలు అడవి గంటకి దాదాపు 200 టన్నుల బొగ్గు నిస్తుంది

కాని, బొగ్గుపులుసుగాలి చాలా నష్టమైపోతోంది అది నీటిలో కరుగుతుంది. సుద్ద రాయిని తీస్తుంది కాల్షియం కార్బొనేటుగా సముద్రం పాలు చేస్తుంది

కొత్తగా భూముల్ని సాగులోకి తెచ్చి, కొత్తగా విశాలమైన అడవులు పెంచి, అధికంగా సూర్యరశ్మినీ, బొగ్గుపులుసుగాలినీ వినియోగంలోకి తెచ్చినట్లయితే, కోట్ల టన్నుల కొద్దీ బొగ్గు నిలవ చేసుకోవచ్చును అదంతా ఇప్పుడు సముద్రంపాలవుతోంది.

కృత్రిమంగా ఫొటోసింథసిస్ ఏర్పాట్లు చెయ్యగలిగినట్లయితే బోలెడు బొగ్గుపులుసు గాలిని పంచదారరూపంలో తెచ్చుకోవచ్చును ఈ ఏర్పాట్లు వ్యవసాయానికి వీలులేని ధ్రువప్రాంతాలలో చెయ్యవచ్చును

భూమధ్యరేఖాప్రాంతంలోకంటె ధ్రువప్రాంతంలో చాలా తక్కువ వేడిమినీ, సూర్యరశ్మినీ నేల గ్రహిస్తుందనే అపోహ ఉంది కాని వేసవిలో పగలెక్కువ వున్న కాలంలో ధ్రువప్రాంతంలో నేల భూమధ్యరేఖ ప్రాంతంలోకంటె సూరింట 25 వంతులు అధికంగా వేడిమి తీసుకుంటుంది అయినా ఇంకా అక్కడ గాలి అధికంగా ఉంటోందంటే ఆ తప్పు మంచుది మంచు సూర్యకిరణాల్నీ, వేడిమినీ ప్రతిఫలింపచేసి, చాలావరకు తిరిగి గాలిలోకి పంపేస్తుంది ఉష్ణమండలాల్లో అయితే దాన్ని మొక్కలు, ఆకులు, నేల, నీరు పీల్చేస్తాయి


ధ్రువప్రాంతంలో కృత్రిమంగా ఫొటోసింథసిస్ ఏర్పాట్లు చేసినట్లయితే, ఆ ప్రాంతాన్ని మొక్కలు లేకుండా సేద్యభూమిగా మార్చవచ్చును

అక్కడ అపారంగా ఆహారపదార్థాల్ని ఉత్పత్తి చెయ్యవచ్చును రబ్బరు, ప్లాస్టిక్స్, రకరకాల నేతవస్తువులు, ముడిపదార్థాల్ని ఉత్పత్తి చెయ్యవచ్చును నిర్జనప్రాంతాల్ని జనావాసాలుగా మార్చవచ్చును

భూమి శక్తిని ఆకర్షించడమే గాదు. స్వతహాగా భూమిలోనే శక్తిఉత్పత్తి ఉంది భూమి లోపొరలోనుంచి లభించే వేడిమి సూర్యరశ్మివల్ల లభించే వేడిమిలో 5 వేల వంతుకూడా ఉండదు కాని ఈ విధంగా లభించే శక్తికూడా ఇప్పటికి మానవుడు నిర్మించిన ఏ పెద్దయంత్రంకంటె కూడా 50 వేల రెట్లు అధికంగా శక్తి నివ్వగలదు

పది పదిహేను మైళ్ల లోతుకి భూమిలో తవ్వగలిగినట్లయితే 500 డిగ్రీలు (సెంటిగ్రేడ్) వేడిమి తగల్తుంది అటువంటి నూతిలోకి నీటిని పంపేసినట్లయితే గ్రాహ్యంకమైన ఆవిరికొట్టం తయారవుతుంది ఆ వేడి భూమి పైకి వచ్చినట్లయితే గ్రీన్‌లాండ్ మంచుకొండల్ని, అంటార్కిటిక్ మంచు ద్వీపాల్ని కరిగించి వెయ్యవచ్చును

కాని ఇదంతా అనవసరం, అసాధ్యం



భారతదేశానికి కమ్యూనిస్టు చైనా రాయబారిగావస్తున్న యీ ఆంగ్ చంగ్ షియాన్ గౌరవార్థం, పెకింగ్‌లోని భారత రాయబారి సర్దార్ కె యం పాణిక్కర్, ఆయన సతీమణి విందుచేశారు విందుకు చైనా ప్రజాప్రభుత్వ ప్రధాని జనరల్ చౌఎన్‌లే సతీసమేతంగా హాజరైనారు

అణుశక్తితో పోలిస్తే ఇదేమంత ఎక్కువ కాదు

అణుశక్తి

యురేనియమ్ (235) ఒక్క గ్రాముతో మూడు టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసేటంత శక్తిని ఉత్పత్తి చెయ్యవచ్చును. ఒక కారు నిండా అణుశక్తిని ఉత్పత్తిచేసే వస్తుసామగ్రి ఉంటే, ఫ్రాన్సులో సాలీనా తయారవుతున్న విద్యుచ్ఛక్తికి రెట్టింపు శక్తి ఉత్పత్తి చెయ్యవచ్చని ప్రొఫెసర్ జోలియట్ క్యూరీ అన్నారు

అయితే అణుశక్తిని వినియోగపరచగలిగే ముందు బోలెడు చిక్కుల్ని పరిశోధనల ద్వారా తొలగించాలి అణుశక్తి కిరణాల నుంచి మనుష్యుల్ని, యంత్రాల్ని కాపాడాలంటే డజన్ల కొద్దీ టన్నుల కాంక్రీట్‌తో అడ్డం కట్టాలి బొగ్గు నీరు తక్కువగా ఉన్న ప్రాంతాల ఎటానిక్ యంత్రాలు వీర్పరాలి అణుశక్తిని వినియోగపరచడం వీలుపడినప్పుడు బీడుమైదానాలు, పచ్చికబయళ్లు, ఎడార్లు వినియోగంలోకి వస్తాయి

ఇది వీలుపడాలంటే ఇంకా దీర్ఘ పరిశోధన జరగవలసిఉంది ఇంత అపారమైన శక్తిపరికరం లభించినప్పుడు భూమి ఉపరిభాగంలో కొన్ని మార్పులు తేవలసిన అవసరం తీరవచ్చును ఆర్కిటిక్‌లో చల్లదనం కావాలి నదుల గతిని మార్చాలి, అంత విశాల ఖండంలో నదీజలాల్ని బంధించి మానవులకు వినియోగపరచడానికి వీలుంది విమానాలెగిరే ఎత్తున, రైళ్లు నడిచే దక్షిణమెరికా ఏండీస్ పర్వతాల్లో కొన్ని ఏటం బాంబులు ప్రయోగించి, దారి చెయ్యవచ్చును ఇప్పుడు బొత్తిగా పర్వతాలు దక్షిణమెరికన్లని సముద్రతీరంనుంచి దూరం చేస్తున్నాయి సముద్రపుగాలుల చల్లదనం ప్రజలకు లభించడం లేదు

వాస్తవానికి లభించిన అపారశక్తి సాధనాలతో మానవుడు శిల్పివలె భూమి ఉపరితలాన్ని కోరిన రీతిని మల్చుకోవచ్చును జలసంధులవద్ద కుడ్యాలు నిలిపి విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చెయ్యవచ్చును భూసంధులలో కాలువలు త్రవ్వవచ్చును నదులగమనాన్ని మార్చి, భూమిని తడపవచ్చును అణుశక్తి సహాయంతో ధ్రువప్రాంతాలలో కృత్రిమంగా ఉష్ణం పుట్టించి, సముద్రపునీటిని ఆవిరిగా మార్చి తెచ్చి, అతిశీతలవాతావరణాన్ని జనావాసయోగ్యంగా మార్చవచ్చును

ఉన్న సహజసంపదను, సాధించిన శక్తిసంపదను వినియోగించ గలిగితే, మానవున కెందులోను లోటనేది ఉండదు అనేక కోట్లమంది కాయకష్టాన్ని తగ్గించి, యంత్రపరికరాల్ని ఉపయోగించవచ్చును ఈనాటికి అనేక శతాబ్దాలకు పూర్వంలో వలెనే ప్రజలు ఆఫ్రికా, దక్షిణమెరికా, ఆసియాలలో బరువులు మోస్తున్నారు పలుగులు, గొడ్డళ్లు చేత పట్టి, చెమటోడ్చుతున్నారు ఈ పని యంత్రాల కొప్పగించి మనుష్యులభారం తగ్గించడానికి వీలుంది


ఈనాడు మానవుల పరిశ్రమ దుర్వినియోగపరచబడుతోంది. ప్రొఫెసర్ జోలియట్ క్యూరీ ఈ మధ్య బొంబాయిలో కార్మికులకు ఇలా చెప్పాడు —

"మీరు ప్రతిదినం ఫాక్టరీల్లోనూ, చేలల్లోనూ, తోటల్లోనూ పనిచేసే ఎనిమిది గంటల్లోనూ నాలుగు గంటలు ఆయుధపరికరాల నిర్మాణానికే, సైన్యాలపోషణకే వినియోగపడుతున్నదని గ్రహిస్తున్నారా? మీరు నాలుగు గంటల్లో ఉత్పత్తిచేస్తున్న వస్తుసామగ్రిని ధ్వంసం చెయ్యడానికిగాను మిగతా నాలుగుగంటల్లోనూ విధ్వంసక సామగ్రిని తయారు చేస్తున్నారు" ఈ విధంగా కష్టజీవుల కాయకష్టం వృథా అవుతున్నదే కాని వారికి ఆహారాదికాలు సమకూర్చడం లేదు ఈనాడు అణుశక్తి అంతా విధ్వంసక పరికరాల నిర్మాణానికేగాని మానవ ప్రయోజనాలకి వినియోగపడ్డంలేదు

ఈ మధ్య ఒక అమెరికన్ ప్రొఫెసర్ అణుశక్తి వినియోగం గురించి అంచనాలు వేసి, ఆ శక్తిని అన్య కార్యాలకంటె బాంబులనిర్మాణాని కుపయోగిస్తేనే ఆ ఖర్చుకి అధికంగా ప్రతిఫలం వస్తుందన్నాడు ఈవాదం ఎలా గుందంటే ఒక్క అగ్గిపుల్లతో పొయ్యి వెలిగించేకంటె ఒక పూరిగుడిసె నంటిస్తే ఫలితంఅధికంగాఉంటుందన్నట్లుంది.

ఇందులో ఇంకో కిటుకుంది అణుశక్తి గాని శాంతి ప్రయోజనాలకు వినియోగంలో కొచ్చిందంటే, విద్యుచ్ఛక్తి, పెట్రోల్, బొగ్గు, భాస్వరం మొదలైన శక్తి ఉత్పత్తి సాధనాల విలువ పడిపోతుంది అణుశక్తి వల్ల లభించేశక్తి బొత్తిగా చవకయిపోతుంది దాంతో పాతఫాక్టరీలు, గనులు, పవర్ హౌస్‌లూ పడుకుంటాయి ఇదివరకు పెట్టిన పెట్టుబడి అంతా వ్యర్థమైపోతుంది. అందువల్ల చాలమందికి అణుశక్తివృద్ధి ఇష్టంలేదు.

మానవులకు పూర్తి అవకాశా లిస్తే, భూమి పైగల సహజ సంపదను వినియోగపరుచుకోనిస్తే, భూమికి ప్రజలుభారంకాక ఇంతకు కొన్నిరెట్లు జనాభాకు సమృద్ధిగా ఆహార పానీయ నివాసాది సకల సదుపాయాలు చేకూర్చవచ్చును [సంపూర్తి]



ఎలిజబెత్ రాజకుమారి స్త్రీ శిశువును కన్నది. ప్రసవానికి పూర్వమే చార్లెస్ రాకుమారుణ్ణి క్లారెన్సుభవనంనుంచి మరొక చోటికి తీసుకువెళ్లారు.

నేటి ప్రపంచం

కాశ్మీర్ సమస్య *

రోగలక్షణం కనిపెట్టనంతవరకూ రోగికి ఎన్ని మందు లిచ్చినా "పెనిసిలిన్ సంజీవి" ఇచ్చినా, కుదరడం అసంభవం. అలాగే కాశ్మీర్ సమస్యని పరిష్కరించడానికి ఎంతమంది వైద్యులు, ఘనవైద్యులు వచ్చినా నయం కావడం లేదు. ఇంక ఆపరేషన్ ప్రయత్నం కూడా జరిగింది. చివరికి రెండు పక్షాలవారూ ఒద్దు మొర్రో అన్నాసరే ఆపరేషన్ చెయ్యడానికే భద్రతామండలి ఖాయం చేసినా ఆశ్చర్య పడనక్కరలేదు.

న్యాయవిచక్షణాదక్షతకు కథలు చెప్పుకునేవరకూ వచ్చిన ఆస్ట్రేలియన్ జడ్జి సర్ ఓవెన్ డిక్సన్ మధ్యవర్తిత్వం విఫలమయింది. పాకిస్తాన్ ప్రధాని లియాఖత్ ఆలీఖాన్ అమెరికా పర్యటన చేస్తున్న సమయంలో డిక్సన్ భరతఖండానికి వచ్చారు. పండిట్ నెహ్రూ ఇండోనీషియా సంచారానికి బయలుదేరేముందు వారితో మాట్లాడారు. తరవాత కాశ్మీరంలో ఉభయప్రాంతాలా సావధానంగా సంచారం చేశారు. సైనికస్థావరాల్నీ, మధ్యసరిహద్దునీ జాగ్రత్తగా పరిశీలించారు. అయితే వివాదగ్రస్తమైన ఉత్తరపర్వతమయప్రాంతంలో పీరాట్టే చూడవలసింది లేకపోయింది. ముందే లేక్‌సక్సెస్‌లో పత్రాలన్నీ పరిశీలించి, ఇక్కడ పరిస్థితుల్ని పోల్చి చూసుకున్నారు. పండిట్ నెహ్రూ, లియాఖత్ ఆలీఖాన్ లిద్దరూ స్వదేశానికి వచ్చేవరకూ కాశ్మీరసంచారంతో గడిపారు.

ఈలోగా తూర్పు బెంగాల్ మతకలహాలు సంభవించడం, లియాఖత్ ఆలీఖాన్ అమెరికాకు బయలుదేరేముందు ఢిల్లీ వచ్చి, అల్పసంఖ్యాకులికి ఒక తెరసాఫు అయ్యాక, వారి నెలా సంరక్షించాలో నిర్ణయిస్తూ ఒక ఒడంబడిక చేసుకోడం—చూసేసరికే డిక్సన్ గారికి గట్టి ఆశ కలిగింది. అంతా సుముఖంగా ఉందనుకున్నారు. ఒక శుభముహూర్తాన మగ్గురూ చేరి, నిస్సంకోచంగా నిర్భయంగా, నిర్మొహమాటంగా కాశ్మీరాన్ని గురించి మాట్లాడుకోడం మంచిదని చెప్పి, ఢిల్లీలో సమావేశానికి ఏర్పాట్లు చేశారు.

డిక్సన్ గారి కర్తవ్యం భద్రతామండలిలో వివరించబడింది. కాశ్మీరం భారతరిపబ్లిక్‌లో చేరుతుందో లేక పాకిస్తాన్ అధినివేశంలో చేరుతుందో ప్రజాభిప్రాయం తెలుసుకోడానికిగాను ప్లెబిసైట్ జరగాలి. ఈ ప్లెబిసైట్ జరపడానికి పెత్తనదారుగా రిటైరై ఉద్యోగం లేకుండా కూచున్న అమెరికన్ పూర్వనౌకాదళాధిపతి ఎడ్మిరల్ నిమిట్జ్ చాలాకాలంనించీ పెట్టేబేడా సర్దుకుని సిద్ధంగా ఉన్నాడు. ప్లెబిసైట్ నిష్పక్షపాతంగా నిరాటంకంగా, ఎవరి ఒత్తిడి, బలాత్కారం, దౌర్జన్యం లేకుండా సుఖంగా జరగాలంటే పాకిస్తాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతంనుంచి పాకిస్తాన్ సైన్యాలు తొలగిపోవాలనీ, షేక్ అబ్దుల్లా పాలనలో ఉన్న ప్రాంతంలోని భారత సైనికబలం తగ్గించబడాలనీ నిర్ణయమైంది. ఈ సైనికోపసంహరణ కార్యక్రమం ఎలా జరగాలీ అనే విషయంపైన సమాధానం కుదరలేదు.

కాశ్మీర్‌లో భారతసైన్యాలుండడం, ఉండకపోవడంతో పాకిస్తాన్ ప్రభుత్వానికి నిమిత్తం లేదనీ, అక్కడ ప్లెబిసైట్ సుఖంగా జరిగేదీ, లేనిదీ చూచే బాధ్యత ప్లెబిసైట్ నిర్వాహకుడిదే గాని పాకిస్తాన్‌కి ఎట్టి ప్రమేయం ఉండరాదనీ, భారత ప్రభుత్వవాదన. అలా కాకుండా భారత ప్రభుత్వం సైనికబలాన్ని తగ్గిస్తే తానూ తగ్గిస్తాననీ, వారొక అడుగు వెనక్కు వేస్తే తానూ ఒకడుగు వెనక్కు వేస్తాననీ, వారు ముందు కడుగు వేస్తే తానూ ముందు కడుగు వేస్తాననీ, వారితోపాటు తనకు వంతనీ పాకిస్తాన్ వాదన.

అయినా ఏదోరీతిని ప్లెబిసైట్‌కి ఏర్పాటు జరిగితేనే చాలు, పట్టింపులో పసేమిటని భావించి, పాకిస్తాన్‌కి ప్రమేయమివ్వడమే కాకుండా, మధ్యవర్తి ఉండగా పాకిస్తాన్‌తో చర్చించడానిక్కూడా భారత ప్రభుత్వం అంగీకరించింది.

సైనికోపసంహరణకుగాను ఉభయప్రభుత్వాల మధ్యనూ సమాధానం చేకూర్చడానికి మధ్యవర్తిగా సర్ ఓవెన్ డిక్సన్‌ను భద్రతామండలి పంపింది. అలా సమాధానం కుదరనిపక్షంలో, అనుకున్నప్రకారం సైనికోపసంహరణ సాధ్యంకానిపక్షంలో, మరో దారి ఏది కనిపించినా సూచించవచ్చునని కూడా డిక్సన్‌కు భద్రతామండలి చెప్పింది.


డిక్సన్ ఇక్కడికి వచ్చి అటూ ఇటూ చూసి, ఢిల్లీకి లియాఖత్ ఆలీఖాన్‌ని రప్పించి సమావేశం ఏర్పాటు చేశారు. అంతే కాదు. నెహ్రూ, లియాఖత్ ఆలీఖాన్‌ల సౌజన్యం (ఢిల్లీమైనారిటీవర్గాల సంరక్షణ ఒప్పందాన్ని బట్టి) గ్రహించినవారై, డిక్సన్ తప్పక తమ యత్నం సఫలమౌతుందనే పిచ్చినమ్మకంతో, మూడో మెట్టు ప్లెబిసైట్ నిర్వహించడానికి సిద్ధంగా ఉండమని లేక్‌సక్సెస్‌కి చెప్పినట్టున్నారు. పాపం వృద్ధుడు నిమిట్జ్ మళ్ళీ లేక్‌సక్సెస్ వచ్చి, కాశ్మీర్ కాగితాలు తిరగేస్తూ కూచున్నాడు.

కాని అనుకున్నంతసేపు పట్టలేదు—ఆశలు అంతరించడానికి.

ఢిల్లీలో నెహ్రూ, లియాఖత్ ఆలీఖాన్, డిక్సన్ గార్లు సమావేశమయ్యారు. ఇద్దరిమధ్య డిక్సన్ కూర్చున్నారు. ఇద్దరినీ మాట్లాడుకోమన్నారు. పరిష్కారమార్గం ఇద్దరికీ కనిపించింది కాదు. తమ పూర్వవాదాల్నే వల్లెవేశారు. ఇంక తమ వంతు పని చెయ్యడానికి సమకట్టారు డిక్సన్.

సైనికోపసంహరణపైన అంగీకారం కుదరలేదు. కాబట్టి ఆపరేషన్ చేద్దామన్నారు డిక్సన్. అంతేగాని ఇరువురి వాదాల్లో న్యాయం ఎటున్నదో, అన్యాయం ఎటున్నదో, లేక ఎవరి వాదం సమర్థనీయమో, పరిస్థితులు వాస్తవంగా

(39-వ పేజీ చూడుడు)



ఇదివరకు ఆఖరి పీరీడు "డ్రిల్లు"అని రాసుకునేవాళ్ళం. డ్రిల్లు చేసేవాడికీ యథాశక్తిగా యెగ్గొట్టేవాడికీకూడా టక్కున బోధపడేదా మాట. ఇప్పటి స్కూలుకుర్రాళ్ల టైంటేబిలు చూడండి. "పి. ఐ. "అని అఘోరిస్తారు. ఆ పొడి అక్షరాలకి పూర్తి మాట వాళ్లు రాసినా, ఉచ్చరించినా కూడా అక్షరచ్యుతక, మాత్రాచ్యుతకాదికళయ్యే రీతులు గోచరిస్తూనే ఉంటాయి. "ఎందుకిలా అర్భకులని క్షోభపెట్టేస్తున్నా'రని కోప్పడ్డని అడగండీ, ఇల్లాంటి పదాలతో ఆరంభిస్తేనేగాని కర్బనద్విఆమ్లజనితాల్లాంటివి ఎలా నోరు తిరుగుతాయి?' అంటారు వాళ్ళు. ప్రయిమరీవాడి పాఠం మొదలు ఫోర్తు యియరువాడి వ్యాసంవరకూ కర్బనద్విఆమ్లజనితవే. ఈ కోవాకి చెందిందే "బేసిక్కు"గూడాను. మొదట్లో అయితే ఒక్క విశేషణానికి అర్థం బోధపళ్ళేదు నాకు. తీరా తీగ వెతికేసరికి డొంక కదిలింది.

ఈ మధ్య మావూళ్ళో అనుకోకుండా గొప్ప కలకలం. మాటవరసకి కలకలం అన్నాను కాని, కోలాహలంవే అనుకోండి. తలవని తలంపుగా రాజావారి కాలేజీలో బి. ఇడి. క్లాసుగూడా పెట్టారు. ఏ రిస్ట్రిక్షను లేదన్నారు. ఊళ్ళో ఎక్కళ్ళేని తొడతొక్కిడీ, కాలేజీకి అంతులేని స్ట్రెంగ్తన్నూ—నూనూగు మీసాలవాళ్లు, సున్నటి గుళ్లవాళ్లు, కత్తిరింపు బుర్రలవాళ్ళు క్రాపింగులవాళ్లు, ఆడపిల్లలు, పిల్లలతల్లులు, ఓహ్హో! వాళ్లూ వీళ్లూ యేఁవిటి? పదెనిమిది వందల యాభైయ్యేడులో యూనివర్శిటీలు పుట్టింది లగాయతూ బి. ఏ. ప్యాసయి, బి. యిడి. అయితే బావుణ్ణని ఆరాటపడుతూ యింకా బతుకాశ వున్న ప్రతీవాడూ సీటుకి పెట్టేడు. ధర్మదాత ప్రిన్సిపాలు వాళ్ల ఉత్సాహం చూసి ఎవ్వరినీ కాదని అనలేకపోయాడు.

కాని యిదివరలోలాగ రాజమండ్రిలో తొమ్మిది నెలలూ దొలాగో కాలక్షేపంచేసి రావడం కనకనా మరి? "బేసిక్కం"టూ ఒకటి తగులడిందాయె. ఏకులు ఒడకడం దగ్గరనుంచి యెంగిళ్లు యెత్తుకోవడంవరకూ అంతా బేసిక్ ఎడ్యుకేషనే. శనివారం శనివారంవ్వా యిదో పక్షుపాతం. (పక్షానికో సారి పడుతుందికదూ?) వెంకయ్యగారయితే శనిపాతవే ననేవాడు. నాలుగో పది పైబడిందతనికి. ఆ కాస్త అద్దూ తీర్చేసుకుంటేనేగాని పుట్టగతుల్లేవుకదా అని జొరబడ్డాడు. కాలేజీలో ప్రవేశించిన వారానికి తన చదువూ సంగతీ యిల్లాలికి ఉత్తరం రాస్తూ, బేసిక్లాసువిషయం సరదాగా ముచ్చటించేడు. "ముప్పైఫయ్యేళ్లొయి, ఆ మూడు రోజులూ ఏహోటలు వాడి

శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

సామానో గడిచిపోయేయికాని, యిప్పుడు నెలకి రెండు రోజులు నేనే తగులడవలసి వచ్చిం"దంటూను. నిజానికి నవ్వుతాలకే రాశాడు వెంకయ్యగారు. కాని మూడో నాటికల్లా వచ్చి పడింది కార్డుముక్క; అదైనా వొచ్చి వొచ్చి కాలేజీలోనే రెక్కలు కట్టుకు వాలింది. చాదస్తపు ముండావాడు కాకపోతే కాస్సేపు పోయింతరవాత చూసుకోకూడదూ? అఁహాఁ! కళ్లజోడు తగిలించుకుని, పుస్తకం అడ్డుపెట్టుకుని పఠించేడు. పక్కనున్నవాడి కన్నూ దానిమీదే పడింది; "కుంపటిమీద కాఫీ నీళ్లయినా దింపుకోలేరు మీరు"అన్న ఒక్క ఆప్యాయపు మాటా నిఘాగా కంటబడింది. బస్. సాయంత్రానికల్లా, "వెంకయ్యగారి చేతిరి నలపాకం అంటే భీమపాకం"అని బోర్డెక్కి కూసింది పేరూ ప్రతిష్ఠాను!

2

మర్నాడు శనివారం. బి. ఇడి. వాళ్ల దర్నీ బేచీలుక్రింద విడదీసి, ఒక్కొక్క బేచీకి ఒక్కొక్కపని అప్పజెప్పారు. అదే ప్రారబ్ధంవో కాని వెంకయ్యగారి గాడీపాయ్య బేచీలో పడేసేరు బేసిక్ మాస్టరు చిలకలా ప్రోగ్రాం వల్లించేడు—ఫస్టుబేచీవాళ్ళ రాత్రిబండిలో బయలుదేరి వెళ్లి, సాలురులో తెల్లవారుఝాంబస్సు అందుకు కోరాపుట్టిదగ్గిర కేంపు చేరుకోవాలి. క్లిళ్ల వెళ్లి ఉదయాన్నే కాఫీ టిఫినులు సిద్ధ చేసేవేళకి మిగతా బేచివాళ్లూ వస్తారు అప్పుడు ఫలహారాలు ఆరగించి జయపూ స్టాఫ్ కారులో మూడుమైళ్ల దూరంలో ఉన్న కోదువాళ్ళ గ్రామానికి పోయి. వాళ్ల ఆచా వ్యవహారాలూ అవీ పరిశీలించి వివరాల రాసుకురావాలి. అదీ కార్యక్రమం.

తను గాడీపాయ్యగ్రూపులో పడ్డాడన్న విషయం తప్ప మిగతా పథకం అంతా భేషగ్గానే అవుపించింది వెంకయ్యగారికి. ఇష నెలాగ తప్పదు కనుక నడుం బిగించేడు కాని కరువుకు దాసర్లయితే పదలొస్తాయా? దానికి తోడు కూడాఉన్న వాళ్లు వొర్రికిష్కింధ! ఒకళ్లిద్దరు ఆడపిల్ల కూడా వున్నారేమో, ఆ బేచి వాళ్లగల్ల తుకి అంతులేకుండా పోయింది.

"ఆ కాఫీనీళ్ల జేయిశామీద ఓ సిబ్బి మూత పడెయ్యండి తాతగారూ" అంద గడుసుపిల్ల.

" ఎంత చదువుకుంటూన్న దానివయినా అంత చులకన కూడదమ్మా. ఏఁవీ? నల్లై యేళ్లకే తాత నయిపోయేనా నేను ముగ్గురు పిల్లల తండ్రిని; ముగ్గురూ మొగశ్లేను. మళ్ళీ మా ఆవిడ నేడో రేప అంటోంది కూడా గదా" అని విరుచుక

...డుం వెంకయ్యగారు. ఈ కేకలకి ...హం కడుక్కుంటూన్నవాడూ, తల దువ్వుకుంటూన్నవాడూ, స్నానానికనిచిన్న ...వంచా కట్టుకున్నవాడూ—వాడూ ...నూ యేవిటి?- పేచీయావత్తూ అక్కడే ...యిపోయి వెంకయ్యగారిని రేకెత్తిం ...రు. ఇంకా... వెంకయ్యగా ...క్కడ? ...తగారంటే తాతగారనే అనేసేరు నలుగు ...న్నా. "ఏదో అచ్చివాకులలనంకొద్దీ తాత ...రని ఆ అమ్మాయి అనేసింది గాని, మీ ...న్న పటుత్వం మా కేది, బాబూ, ఒక్క కాఫీ ...ప్రాణులం" ఓ కుర్రవాడు కొంచెం ...పోతాడు.

"ఆ మాటే నేనూ అంటూంటా." వెంక ...గారికి బుజాలు పొంగిపోయి ఉత్సాహ ...తో ఆరంభించేడు. "ఉదయాన్నే గోరు ...చ్చటివి ఓ గిన్నెడు నీళ్లలో ఒక్క ...మ్మకాయ పిండుకొని చిటికెడు ఉప్పు ...సించి పుచ్చుకోండి, ఎంత తిశాన్తంతిగా ...టుందోను! ఎందు కొచ్చిన కాఫీ ...?"

వెంటనే పక్కనుంచి ఓ కేక "నిమ్మ ...సం" అని

"మొదటిదానితో జతచెయ్యవోయ్ ...మ్మరసం తాతగారూ' అని" మరో కంఠ ...ని!

"అలాగ నిమ్మరసం అలవాటు చేస్తే మరి ...కెం అంటూ పట్టుగు సుమండీ తాత ...రూ" అంది ఆ కిరస్తానపు చిన్నది, ...డే చీదుకుని ముక్కు తుడుచుకుం ...న్న వెంకయ్యగారిని చూసి.

"సంతోషించేంతే, అమ్మాయి తెలివి ...కి. రాత్రి తెల్లవార్లూ నిద్దర లేక్కా, ...కొంచెంగాలి తగిలీ కాస్త ముక్కు ...డుతోంది కాని, నా కేం సంకటం అను ...న్నా వా యేమిటి?" అంటూ విడిచేసు ...న్నాడాయన.

"బాబూ యీ రెండు పాయలూ వొలిచి ...పెడుదురూ, ఉప్మాలో కావాలి" ...టూ మరోడు హాజరు. ఉల్లిపాయలు ...లవడంతో వెంకయ్యగారికి కన్నూ ...క్కూ ఏకంపైపోయి ముఖం జేవురించి, ...లధార కట్టేసింది.

అంతలో కాఫీజొయికామీద మూత ...ర్మంది నేలని. ఆయన ఉలిక్కిపడ్డాడు. "దింపవయ్యా, బాబూ. దింపు. గిన్నె ...పి గుండె తిగలెయ్య యీ పాటి" మట్టూ ...మురాలోంచి ప్రాధేయవచనాలు ప్రారంభం.

"ఏం నాయనా గుడ్డుగూటికి వచ్చేక అన్న పరిస్థితి యేర్పడిందా యేవిటి?" వెంకయ్యగారు రుసరుసలాడుతూ యీసడిం చేడు.

"అబ్బో నిమ్మపండు కవికూడా నరోయ్" అంది జనవాణి.

"కవినిమ్మపండు" క్రైస్తవవనిత బిరుదే పారేసింది.

"ఏ వల్లకాడో. మీ చేత నయింది కాదు గదా" అంటూ అక్కడున్న పాట్లాం కాగితం ముక్క పగ్గున చింపి, రెండు చేతుల్లోనూ నులిమి కాఫీడెయిశా దించబోయేసరికి... దీని మొహం తగలెయ్య! పొయ్యిలో కర్ర వొసిలి, గాడిలోంచి గుప్పున అవి రొచ్చి తనకి తెలియకుండానే చేతులు పట్టు వొదిలేసేయ్! పక్కనున్న అమ్మాయి పైట చెంగుతో ఆదుకోబట్టిగాని లేకపోతే పదిమంది కాళ్లూ బొబ్బలెక్కిపోయేవే.

"ఇవాళకి యీ బ్రెయినింగు చాల్న తాతగారూ మీకు. ఇంకా మీ రిక్కడే వుండిపోతే మేం అంతా తెనాలి రామలిం గడి పిల్లులం అయిపోతాం" అంటూ వంట సాలలోంచి సాగనంపేరు వెంకయ్యగారిని.

బ్రతుకు జీవుడా అని బయటపడ్డాడే కాని ఆయనకి కోపంవే వొచ్చింది. ఎలాగయినా ఏదో ఒక విషయంలో తన ఛామేజా నిల బెట్టేసుకోవా లనుకున్నాడు. ఔను మరి. తన వయస్సేవిటి? వాళ్ల యీ డేవిటి? కుక్కిన పేనులాగ వుండవలసిన గుంటలు గోలకెత్తేస్తూంటే కోపం రాదూ?

3

కాఫీ ఫలహారాలు అయి క్లాసు కదిలింది. బస్సు కిటకిటలాడింది. ఇహ నే వుందీ? బస్సులో ఆ మూడు మైళ్లూ పల్లె కోడువాళ్ల గ్రామజీవనం పరిశీలించి రావడవేను. దాంతో ఆటా పాటా చెల్లంగి! అమ్మయ్య అని నిట్టూర్చి తాపీ పడ్డాడు, వెంకయ్యగారు. కాని, యిల్లలకగానే పండుగ అయిందా మరి. ఇహ నాలుగు ఘర్లాంగు లుందనగా యింజనుకి గొంతుక పొడి ఆర్చుకుపోయి యిరి కదలనని భీష్మిం

(34-వ పేజీ చూడుడు)





"మురగప్పన్" అరవదేశీయుడు, తమిళ భాషాకోవిదుడు. అయినా తన అరవైయో సంవత్సరం ముగిసేవరకు తెనుగుదేశంలో అటవీశాఖయందు పై యుద్యోగిగా, అనగా 'ఫారెస్టర్'గా పని చేసి, తన వెయిటవంతనూ మన్యం సీమకే ధారపోసి, వన్యమృగాలమధ్య ధైర్యసాహసాల్తో కమాను జరిపిన ఘటికుడు, దృఢ కాయుడు.

అతని భార్య ఆంధ్రావనిలోనే తన యౌవనమునంతా, అతి రమ్యముగా, మిక్కిలి తోటతెల్లముగా, ఎక్కడకు భర్త వెడుతూంటే అక్కడకు అనుసరిస్తూ, ఎంతో వైభవంగా కాలక్షేపం చేసిన కళ్యాణ వంతురాలు. ఆమె పేరు "తులసీఅమ్మాళ్". భర్తకంటె తొందరగా ఆమె తెనుగుభాష నేర్చుకుంది. భర్తకంటె సుందరంగా ఆమె తెనుగు అలవాటు అలవరుచుకుంది. భర్త కంటె చనువుగా ఆమె తెనుగువారిలో మసలడం అభ్యసించింది. భర్త కస్తమసం తెనుగుదేశ మందలి తెలియరాని విపినాలలో సింహాలను పెద్దపుల్లను, చిరుతపుల్లను, సివంగులను వేటాడుతూ వాటియొక్క చర్మాలను ఒలిపించి జాగ్రత్త పరుచుకోవడం పరిపాటి అయితే; ఈమె తెనుగువారిమాట, మనసు, మానవస్వభావము అవగాహనం గావించుకుంటూ, అందరిలాగా తాను కూడా రంగు-రంగు సింగారాలు కావించుకుంటూ పేరంటానికి పిలుస్తూ వెడుతూ, ఒరుగుపొరుగువారిని పలకరిస్తూ, మాట పిలుస్తూ, మంచి ఆవిడ అని అనిపించుకోవడం జన్మసాఫల్యము.

శ్రీ కవికొండల వేంకటరావు

మురగప్పన్ 'రిటైర్'యై వెళ్ళిపోయేటప్పుడు ఆ దంపతులను అనుకోని ఆదరాభిమానాలు కానవరుస్తూ తెనుగువారు వీడ్కోలు విందు గావించారు. ఆ విందుసందర్భంలో "కట్టుకో నా మాట నా!" అని ఒక "మువ్వన్నె" పట్టుకోక నడుంకు చుట్టబెట్టుకున్నదై "వలిబుచ్చినా కద్దా!" అని సందేహిస్తూనే పయిటకొంగు వీపుమీద ౨౦ ఏళ్ళా ఎగర నిమ్మకుంటూ, ఉండుండిదాని తేట గుండా ఒక గుండ్రని గుండుదెబ్బ కన్నం కంటి చూపులా కానవచ్చేసింది. అప్పటికి ఆమెకు ఏ యాభైయేళ్ళో యుండవచ్చు. ఏమా అంటే తల పండిపోయింది. బుగ్గలు ఎండు ద్రాక్షలా స్రుక్కిపోయాయి. ఎదకప్పు మైదానంమీద అరబఱచిన మడతలుండుకా వుండిపోయింది. కాని పడుపట్టమీది ఆమె బట్ట—ఆ దేమో—ఆ పొద్దు అతి విజృంభించి చూపఱ చూపునదో చిత్రంగా చిత్తుచేసింది.

"ఏమమ్మా! ఇంత మంచిచీర కేగుండు దెబ్బ ఎల్లా తగిలిందమ్మా!" అని అడిగింది. ఒక త్రిలింగదేశపునంగనాచి, ఆ వీడ్కోలు విందుకు వచ్చిన నాటి ముచ్చటకంటులలోని

ఒక చమత్కారిణి. "అది నానుదా చేసింది" అని మురగప్పన్ ఒక పెద్ద గొడవ చెప్పేడు. ఆ గొడవే ఈ కథ:—

"నేను 26వ ఏట తెనుగుదేశంలో త్రిమ్మటి కాడనైనాను. మరి అయిదేండ్లకు ఇది నన్ను "జాయిన్" అయి నా "లైఫ్"లో వదలని "పార్టనర్" గా వుంటూ, కూడాకూడా వచ్చేది ఎక్కడకు పడితే అక్కడకు - అడవిలో ఒకానొక భాగంలోనికి మాత్రం నీవు రావస్తి కాదు" అని శాసించేవాణ్ణి-కారణం ఆ ప్రాంతాన్ని ఒక పెద్దపులి, భయంకరమైంది, త్రచ్చాడుతూవుంటేదని పుకారు. అప్పటికి నా తులసీతుల్యామ్మాళ్‌కు ఇరవై మూడుఏళ్లు. పిల్లాజెల్లా మాకు నేటికీ లేరు-నాడూ లేరు.- అయితే అప్పుడు కలుగుతారనే 'హోప్' 'రాంబా' వుండేది. చెప్పవద్దూ! "పెద్దపుల్లు అన్న మాటేమిటి? నాగుబాములు, అలమ్మండేలు, దంతావళాలు ఎక్కడపడితే అక్కడ ఆ కీకారణ్యంలో పగలనక రాత్రనక తిరుగాడుతూవుంటాయి. నీవువరాదు" అని బోధించేవాణ్ణి. మనిషి ఇప్పుడంటే ఇలా వుంది కాని అప్పుడు దాని యౌవనం ముప్పిరిగొన్నవి నరాలా నారాలా అన్నంత వాయ్యారంగా నడిచేది. అదికట్టని 'వోయిల్' లేదు. అది రాచుకోని ఆయిల్ లేదు. గళ్లదోనాడు, పువ్వుల్దోనాడు, చుక్కల్దోనాడు, మొక్కమామిడి పిందెలదోనాడు, గోధుందోనాడు, గోధూళి చిన్నెలదోనాడు మువ్వన్నె మెకము చారలదోనాడు ఇలా ఎన్నెన్నో కట్టి, గట్టి వోళ్ళకాకుండా కట్టు వన్నెకూడా చీరతోమమైకం అయిపోయేలా కుచ్చెళ్లు పోసుకు కూరిమి, పేరిమి కాపటిచేది.

"ఎన్నాళ్లకూ చంపలేకున్నారేం? ఈ పెద్దపులిని?" అని అడిగింది. ఓనాడు. "ఈనాటి రాత్రితో దానిపనిసరి" అన్నాను. 'అవితే మాటొగ్గారన్నమాటే మళ్లీ?" అని పునః ప్రశ్నించింది. ఒక మేకపిల్లను కట్టివేసి, ఒక చెట్టుమీద మంచెఅమర్చమన్నాను జవానులతో. నేటిరాత్రి పవర్ణమి వెన్నెల. ఆ వెలుగునే దాన్ని తప్పకుండా చంపితీరతాను అన్నాను. అంటూ తుపాకిలోకి ఒకే గుండు దూర్చాను. నాతో 'ఒకమాట ఒక బాణం' అన్నట్టు "ఓకేషాట్" అని ప్రగల్భం పోయాను. వెంటనే తులసీతుల్యామ్మాళ్, ఏంచేసిందీ—మూడు రంగుల గీతల రచీ ఒకటి రంయిని కట్టుకుని నున్నని పిక్కలు పైకికనపడేలా, కుచ్చెళ్లు వెనక్కి విఱిచుకొని, ఒక విల్లు బుజాన్ని వేసుకుని ఒకఅంబు చేతపట్టి "నేనూ వస్తాను!" అంది. "బాణం ఎందు"కన్నాను. "ఎందుకేమిటీ? కత్రలేకుంటే గొత్తెకూడా కరుస్తుంది. ఏదో పుల్ల చేతులోవుండాలి. మరిన్నీ నాకు మాత్రం శౌర్యం లేదనుకున్నారా? మీకు బాణం అంటే గుండుకాని, నాకు బాణం అంటే బాణమే! మాట అంటే మాటే! కాబట్టి వస్తాను అంటే వచ్చాను అన్న మాటే. కొడతాను అంటే కొట్టాను అన్న మాటే."అంది. "బలేగావుందే నీవ్యాపారం! ఆ పెద్దపులి ఉపద్రవమైన ఉగ్రరూపం దాల్చే మృగము. ఓడిపోగలవు దాని ఉదుటుకు. అది ఉఱికిందా అంటే ఉర్విసమస్తం దద్దరిల్లిపోయేని. అఱిచిందా అంటే ఆకాంతాలుప్రతిధ్వనించి బొంగురుపోయేని" అన్నాను. అంగీకరించలే, ఎన్ని చెప్పినా ఆ పొద్దు ఇంటివద్ద ఉండిపోవడానికి ఈ యిల్లాలు. రమ్మన్నాను! గత్యంతరం లేక. గమ్మున పయనమయింది నాతో-

కీకారణ్యం అడ్డపడి మేం మాటొగ్గిన మానుకడకు మలుసంజవేళకే వెళ్లి చెట్టెక్కిపోయి, చెట్టుమీద అమర్చిన మంచెపై సక్కి, నిక్కి కూర్చున్నాం! ఇద్దఱంకూడా, కింద కట్టివుంచిన మేకపిల్లను క్రీగంట కంటూ!

అపరేత్రికి పులివచ్చే చప్పుడయింది. తులసికి సంజ్ఞ చేశాను."వస్తూవుంది జాగ్రత్త! నీవు మాత్రం తెలివితక్కువగా దాన్ని బాణం విసరి రెచ్చగొట్టక! నేను చంపివేస్తాను. నీవు అలా చూస్తూవుండు. బాణానికి చావదు పులి. అందులోనూ అబలవేసే అంబు అసలే తగులదు." అని బోధించాను!

పులియొక్క ఘోరాకారం, వెన్నెల నీడలంట తన చారలు వెలడి కాకుండా వెల్లడి అయ్యే సొగసుతో బయలుపడి, మేకపిల్లను దరిసింది. మేక అరిచింది. వణికింది. కాని పులి ఆసన్నజంతువుని వెంటనే చంపక, గోళ్లు ముడుచుకుని మెత్తని పంజా దిండుతో నిమిరినిర్నిమిత్తమైన నెనరు ఎంతో కాపరిచింది. ఆ శార్దూలరాజుయొక్క ఆ పొందికకూ ఆ కాపరుస్తూవున్న పొత్తుకూ ఆశ్చర్యపోతూ తులసీతుల్యామ్మాళ్ తన రెండుకళ్లూ తిరిగిపోయేలా నేలంక వింతగా చూస్తూవుంది. ఇట్టే చపేటలా ఒక్కదెబ్బ మేకను కొట్టి గుటకాయిస్వాహా చేదామని పంజా యెత్తింది పులి. నా చెలి తన కాపాళంగా ఎక్కడలేని కోపంవచ్చి, పులి ఎత్తిన పంజాకు గురిచ్చుకునేలా తన చేతనున్న బాణంములికి విసిరింది. ఆ బాణం యొక్క

(15-వ పేజీ చూడుడు)

నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౪౨

రుయ్యమ్మ యింకను నిద్దురపోలేదు. ఆ పిల్లపై రుద్రమ్మ యాత్ర పోవుచు పెట్టిపోయిన భారము దుర్భర మైనది. రుద్రమ్మ యూహ యేమైనా గావచ్చును. గాని, యది రుయ్యమ్మకు భరింప సాధ్యము కాకున్నది. అందును అలనాటి యర్ధరాత్రమున తప్పెటల జాక జాంజామ్మను చప్పుడు వినుచు, దేవగిరిప్రభువు దండెత్తి వచ్చినచో కోట రక్షించు టెట్లు, అను భయము కలిగిన నాటనుండి ఆ పిల్లకు నిద్రాహారములే లేవు. అది యాలోచించి యుండు అన్ని పనులను చాలించి రాజమందిరముచుట్టును శిలా ప్రాకారము మాత్రము తొందర చేసి పూర్తి చేయునట్లు గావించినది. కాని యంతలో నేమగును? ప్రారంభించిన మహాశిలాప్రాకారము ఎన్నటికి పూర్తి యగును? ఏమైనను పట్టకోటను రక్షించుటకైనను చాలినంతమంది సైనికులు లేరే!

మొదలే నిద్దురపట్టని రుయ్యమకు, రుద్రమయొద్దనుండి గాలి వాన వచ్చినదాని వార్తలే రాకపోవుటతో, నీనాడు మనస్సు జ్వరబాధతోవలె తపించిపోవుచున్నది. అన్నిటికి తోడుగా నీనాడు తిక్కచమూపతియొద్దనుండియు గోనగన్నారెడ్డియొద్దనుండియు వార్తలు వచ్చినవి. ఇటు చోళసేనలు కాని, అటు కర్ణాటసేనలు గాని, దండెత్తివచ్చుచున్న వార్తలు నిజము కావు. ఆ రెండుదిక్కులను ఎట్టి యలజడియు లేదు. ఆ రెండు మహాసైన్యములును వృథాగా ఓరుగల్లునుండి తరలింపబడినవి. అయ్యో! ఎంత ప్రమాదము సంభవించినది? తనకు రకరకములైన వార్తలు వచ్చియుండెనే! అవి యన్నియు నబద్ధములేనా? అట్లైనచో దేవగిరిప్రభువు దేహళీసేనలను ఎదుర్కొనబోయిన వార్త నిజమగునా? రుయ్యమ్మకు ఆ మహాశివరాత్రినాడు కాళ్లాడలేదు. ఎవరితో నాలోచన చేయగలదు? నగరములో పెద్దల నామె పిలువనంపెను.

మహాదేవరాజు జైనవసతినుండి రాలేదట! పేచయ రాలేదట. అతని యల్లుడు నాగదేవనాయడును రాలేదట. ప్రోలరాజు రాలేదట. ప్రసాదాదిత్యనాయకుడును, రుద్రమనాయకుడును, కల్పనాయకుడును గూడ తిరిగిరాలేదట! వారెక్కడ నుండిరో కూడ వెంట వెళ్లిన పరిజనమునకే తెలియదట. వేమినాథస్వామిదర్శనమునకు లోనికి వెళ్లిన తర్వాత, వారిని చూచినవారెవరును కనపడలేదు. ఎవరికి వారు మేమెరుగ మన్న మేమెరుగ మనుచున్నారు. పలువురున్నతోద్యోగుల కథయు నిట్లే యున్నది. ఏమి యీ చిత్రము!

రుయ్యమ్మ ఈవార్తలు విని, పిచ్చి యెత్తినట్లే యైనది. ఎవరి నేమని యడుగును? అట్టి సమయమున తిక్కనసోమయాజులు తనకై వచ్చిరని పరిచారకుడు చెప్పినంతనే, సాక్షాత్తుగా పరమేశ్వరుడే తన్నుద్ధరించుట కారూపమున ప్రత్యక్షమైనట్లు దానికి తోచెను. వెంటనే వచ్చుచున్న సోమయాజుల కెదురు వచ్చి, యది పాదాభివందనము చేసినది.

'శీఘ్రమేవ కల్యాణప్రాప్తి రస్తు!'

మహాదేవుడు తన్నిట్లు ఆశీర్వదించుచున్నాడు! అంత యాందోళనములోకూడ నా చిన్నదాని ముఖము సిగ్గుతో జాజువారెను.

అంతట నది సోమయాజులను వచ్చిన పని యేమని ప్రశ్నింపలేదు. తన్ను రక్షించుటకు తన తండ్రి వచ్చినట్లే భావించి, వెంటనే దాపకుండ తన కష్టము లన్నియు సోమయాజులకా చిన్నది నివేదించుకొనెను. సోమయాజులు శ్రద్ధతో నాలకించి, నగరివాకిట నిలుచున్న మాచల్దేవిని, గోవిందశర్మను లోనికి రుయ్యమ్మయాజ్ఞతో రప్పింపజేసెను. గోవిందశర్మ తాను ద్యూతశాలలలో విన్న మాటలను తుదకు జరిగిన విషయమును నివేదించెను. మాచల్దేవి అజ్ఞాతయోగి వేషములు విసరించి పేచయనాయకాదులకై వారి పరిచారకులు పట్టణములో వెదకుచున్నది తెలిపెను. రుయ్యమ్మకు ఆ వార్తలింకొక విధముగా తెలిసియున్నందున, సందేహము లన్నియు జైనవసతిమీదికి ప్రసరించెను. ఈనాడు వారు ప్రతాపరుద్రకుమారునకుగూడ ఉత్సవమునకు రమ్మని ఎన్ని విధముల వినయవిధేయతలతో బలవంతపెట్టిరి? అందులో దురుద్దేశ ముండితీరవలెను. కామసాని యచంచలనిశ్చయము ప్రతాపరుద్రకుమారుల కెట్టి విపత్తు రాకుండ కాపాడినది! కాని యిందరు నాయకులకు ప్రమాద మేదో చేయ సాహసించినవారు. అంతటితో నాగుదురా? ఈ రాత్రి తెల్లవారు లోపలనే ఎన్ని ప్రమాదములు జరుగనున్నవో గదా!

సమస్తభారమును తనపై నుంచుకొని కాకతీయసామ్రాజ్యమును ఆకాలప్రళయమునుండి రక్షింపవలసినదని సోమయాజులను ప్రార్థించుచు రుయ్యమ్మ అతని కాళ్ల పక్షిపిల్లవలె పడెను.

సోమయాజులు ప్రీతితో దానిని లేవదీసెను.

"నేను మంత్రిత్వము వదలి చాలకాలమైనది. ఈ రాజ్యతంత్రము నాకు సుపరిచితము కాదు. వెంటనే అన్నమంత్రీశ్వరులను

నిర్బంధమునుండి విడిపించి యీ భార మంతయు నాతనిపై బెట్టుము! సర్వము శుభమగును !"

తిక్కనసోమయాజుల యాజ్ఞ రుయ్యమ్మ శిరసావహించి లేచెను. అది మరుమాటాడక తనకు పూర్వము శ్రీరుద్రదేవమహారాజు లిచ్చిన యనుజ్ఞాపత్ర మాధారము చేసికొని, వెంటనే అన్నమంత్రీశ్వరులను బంధమోచనము చేయుచు పత్రము వ్రాసి, మరియొక పత్రముపై శ్రీరుద్రదేవమహారాజులు తిరిగి వచ్చువరకు వారికి ప్రతినిధిగా నుండి వ్యవహరించుటకు తన కిచ్చిన యధికారము లన్నియు గూడ అన్నమంత్రీశ్వరులకే సంక్రమింపజేయుచు, ఆ పత్రముల రెంటికి ముద్రిక వేసి సోమయాజులకు చూపెను. సోమయాజులు అంగీకారసూచకముగా తల యూపెను.

మరుక్షణమున దూత వెళ్ళి ఒక్క గడియలోపల అన్నమంత్రీశ్వరులతో తిరిగి వచ్చెను.

అన్నమంత్రీశ్వరుడు మందహాసముతో నచ్చటికి వచ్చెను. అతడును ఆనాడు అనధ్యయనముగనుక మహారుద్రజపము చేసి, మహాశివరాత్రమంతయు జాగరణము చేయ నుంకించుచు, నెట్లు ప్రొద్దుపుచ్చుటా యని యాలోచించుచున్నంతలో, నాతని కీ పిలుపు వచ్చినది. అతడు వచ్చినంతనే సోమయాజులకు వందన మాచరించి యాతని యాశీర్వచన మందెను.

అన్నమంత్రిని చూచిననాటి రుయ్యమ్మనోట మాటరాకున్నది. అది ఎంత ప్రయత్నించినను ఏమియు చెప్పలేకున్నది. అది సోమయాజులు వెంటనే యుపలక్షించి సర్వము సూక్ష్మముగా అన్నమంత్రికి వివరించెను. అంతయు వినియు వినిపించుకొననట్లే యతడు ప్రశ్నించెను.

"కరణపాఠశాలలో విద్యార్థులు కరణవిద్యనవగతము చేసికొనిరా ?"

సోమ : "కరణవిద్య నేర్చిరిగాని, రణవిద్య నేర్వలేదని నేను పట్టా లీయ నిరాకరించితిని."

అన్నమంత్రి : "ఇప్పుడు రణవిద్య ఎంతవరకు నేర్చిరి ?"

గోవిందశర్మ యందుకొనెను.

"ఒక్కొక్క రొక్కొక్క యాయుధసాధన చేసి ఈనాడు తన్నిమిత్తమై మహారుద్రజపము చేయుచున్నారు."

అన్న : "ఎక్కడ ?"

గోవింద : "స్వయంభూదేవాలయములో, మంత్రీశ్వరా !"

అన్న : "నీవు వెంటనే పోయి, మరల నాయొద్దనుండి వార్త వచ్చువరకు, స్వయంభూదేవాలయముననే వారల నందరను కదల కుండవలసినదిగా నామాటగా వారితో చెప్పుము !"

"చిత్త" మనుచు గోవిందశర్మ కదలిపోయెను.

రుయ్యమ్మయు అన్నమంత్రీశ్వరులపై భారమంతయు బెట్టి నమస్కరించి, యభ్యంతరమందిరములోనికి మాచల్దేవితో కలసి వెడలిపోయెను.

అన్నమంత్రి సోమయాజులవంక తిరిగి 'ఈరాత్రి మీరు నాకు వరుసకు సారాయణుడువలె నండగా నుండవలె' నని యర్థించెను.

అన్నమంత్రి యొక్క నిమేషమాత్రము ధ్యానించెను. వెంటనే ఆతని మనస్సులో, తాను బంధములో పడకముందు క్రీడాశాలను కనిన, ప్రాకారనిర్మాణవివరము లన్నియు, మూర్తీభవించి కన్నుల యెదుట నున్నట్లే భాసించెను. కాని అందులో నెంతవరకు కార్యరూపము దాల్చినదో అతనికి తెలియదు !

వెంటనే యాతడు సోమయాజులను తోడుతీసికొని, భటులు కరదీపికలు వెంట గొనివచ్చుచుండ, రాజమందిరముచుట్టు కట్టబడిన శిలాప్రాకారము చుట్టివచ్చెను. అది పూర్వనిర్ణీతవిధమున చాలవరకు పూర్తియైనది. మరుక్షణమున నాతని తలలో మహావేగమున కొన్ని లెక్కలు పరివర్తితము లయ్యెను.

అంతట వారు శీఘ్రగమనమున స్వయంభూదేవాలయమునకు బోయిరి. అక్కడ కరణవిద్యార్థు లందరు, మహారుద్రజపము పూర్తికావించి, తమ శస్త్రములతో జాగరణము చేయ నుపక్రమించుచుండిరి.

అక్కడికి కావేళ సోమయాజులును అన్నమంత్రియును వచ్చుట చూడగా, వారికి నరనారాయణులే, ఆదిమానులే, ఆరూపమున ప్రత్యక్షమైనట్లు తోచి, లేచి సాష్టాంగదండప్రణామములాచరించిరి.

వెంటనే వారికి అన్నమంత్రీశ్వరుడు అజ్ఞలు ప్రవర్తింపజేసెన.

"మీరు మీమీ శస్త్రములకు నమస్కరించి గ్రహించి వరుసగా నిలువబడుడు !"

మరుమాట్లాడక ఆ బ్రాహ్మణు లట్లు చేసి నిలుచుండిరి.

"మీలో ధనుస్సాధన చేసినవారు కుడిప్రక్కను నిలుచుండుడు !"

వా రట్లే చేసిరి.

"మీలో ఖడ్గసాధన చేసినవారు ఇటు రండు!"

బ్రాహ్మణకరణము లట్లే చేసిర.

"శూలసాధన చేసినవారు అటు నిలుచుండుడు !"

వా రట్లే చేసిరి.

"పరశుసాధన చేసినవారు ఇక్కడ నుండుడు !"

అట్లే ఆతడు వేర్వేరు ఆయుధసాధనలు చేసినవారిని వేర్వేరుగా నిలుచుండజేసెను.

శస్త్రధారణ చేయవలసివచ్చిన యందరు బ్రాహ్మణులను జూచుచుండగా, సోమయాజుల కొకవంక దుఃఖమును, ఒకవంక ఆనందమును కలిగి కన్నులు ఆర్ద్రములయ్యెను.

అన్నమంత్రీశ్వరులు వారి నెల్లర నిట్లు సంబోధించెను.

"మీరందరు భృగువంశపావనుడగు పరశురాముల నొక్కమారు స్మరింపుడు! మీ శస్త్రసాధన కీ రాత్రియే పరీక్ష రానున్నది. ప్రశ్నలు వేయక చెప్పినరీతిగా నాజ్ఞలు పాలింపవలెను !"

దాని కంగీకారముగా నా బ్రాహ్మణులందరును ఓంకార మొనర్చిరి. ఆ ప్రణవనాదము భూనభోంతరాళముల నిండిపోయెను !

అన్నమంత్రీశ్వరు డంతట తాను ముందు వేసియున్న లెక్క ప్రకారము వివిధశస్త్రధరులగు నా నూతనభటులలో రెండువేల మందిని రాజమందిరముచుట్టు నున్న ప్రాకారముపై నిర్ణీతప్రదేశములలో కాపుంచెను. రెండువేలమందిని స్వయంభూదేవాలయమున, జాగరూకులై యవసరములకై పిలిచినప్పుడు వచ్చుటకు సిద్ధముగా నుండు మూలబలముగా పెట్టెను. మిగిలినవారిలో నొక్క పదిమంది వీరులతో గోవిందశర్మను పంపి, యాతడు జాడమాడిన ద్యూతశాలలలోనివారి నందరను నిర్దాక్షిణ్యముగా బంధించుటకును, తగుగు

తిరిగినవారిని ఖండించుటకును ఆజ్ఞాపించెను. మరియు ప్రధానచత్వరములలో కాపుగా నుండ నెక్కువందల వీరుల నాజ్ఞాపించి యాతడు పంపెను. అట్లు పంపిన ప్రతిదళమునకును నాయకులను, ఉపనాయకులను వెంటనే నిర్ణయము చేసెను.

ఇట్లాజ్ఞలు నిర్వర్తించి తనపై పెట్టుకున్న భారమునకై యొక్క గడియపాటు యోచించెను. అంతలో తాను పూనిన కార్యమునకు వీరశైవవీరుల సహాయము లేనిది సాధించుట కష్టమని యాతనికి స్ఫురించినది. అప్పటికే స్వయంభూదేవాలయమున నందరు బ్రాహ్మణులు శస్త్రధారు లగుట తిలకించిన శివభక్తులకును ఆవేశము పెరిగియున్నది వారి కేదో మహాశివకార్యము నిర్వర్తింపవలసిన యదను వచ్చిన దని పొడకట్టినది. వారందరును చేతి కందిన ఆయుధములు—కర్రలు, కట్టెలు, కత్తులు, బల్లెములు, గొడ్డళ్ళు, పలుగులు, పారలు—ధరించి యన్నమంత్రీశ్వరుల యాజ్ఞలకై నిరీక్షించుచుండిరి

అన్నమంత్రియు వారి నందరగూడ దళములుగా విభజించి నాయకులను, ఉపనాయకులను నిర్ణయించి కూడదీసెను. అంతలో నిద్దరు యువకులు అశ్వము లెక్కివచ్చి అన్నమంత్రీశ్వరున కొక కవచమును, శిరస్త్రాణమును, ఖడ్గాద్యాయుధములు నర్పించి యొక యశ్వరాజమును ఇచ్చి, లెమ్మ నాతనికి అంగరక్షకులుగా నుండ ననుజ్ఞ వేడిరి. అన్నమంత్రియు వల్లె యని కవచాదులు ధరించి సోమయాజులకు నమస్కరించి సెలవు పుచ్చుకొని అశ్వముపై నా నూతనసైన్యముతో బయలుదేరెను

తిక్కనసోమయాజులు స్వయంభూదేవాలయముననే ఉండిపోయిరి.

అన్నమంత్రీశ్వరుని సేనలు అరగడియ దాటకముందే పోయి మహాసంరంభముతో జైనవసదిని ముట్టడించెను. అచ్చట నన్న మహాసేన యొకటి వారిని క్రోధారభటితో నెదుర్కొనెను

మువ్వన్నె

(12 వ పేజీ తరువాయి)

సూదిపదును పులికి తీవ్రంగా సోకింది కాబోలు బొబ్బరించి అమాంతంగా ఎగసి, పైరొబ్బ చివరందుకొని ముందరి రెండు పంజాల క్రొవ్వాడి గోళ్లను దూసింపై "నూర్రి" పట్టు పట్టి, ఉయ్యాల వూగినట్టు వూగుతూ, పైని మమ్మల్ని చూచి, ఇరువుర్ని ఒకేసారి చుట్టబెట్టి తుదముట్టించేలా, తోక నెగరవేస్తూ పగపట్టిన పాతశత్రువులా విజృంభించింది.

పులివూపే వూపుకు మేం కూర్చున్న చెట్టుఅంతా, తల్లక్రిందులయినట్టయి, మేం పొంచున్న మంచె ఎక్కడుందో మాకే తెలిసిందికాదు. తులసీతుల్యామ్మాళ్ బెదరి బిగిసెడి, కిందకు జారిపడుతూ, ఏ రొబ్బాగ అయితే పులి కొసపుచ్చుకు వూగుతోందో ఆ రొబ్బ చంక తనచంక నానుకొని, తాను కట్టుకొన్న "మువ్వన్నె" చీర కొంగు వ్రేలాడి, పులితోకతో సరిసమానంగా లేచిపోయేలా లెబరమై వ్రేళ్ళియాడుతూ తను జాలిగొలిపింది.

ఎంత ఈమె వంకకు జరిగి ఈమెను 'పప్పడ్' లా నలిచేదామన్నా పులి మతి జరగలేకపోయింది ఆ గొబ్బ మెత్తందనంవల్ల ఆ పులియొక్క గోళ్లు ఎంతో లోతుకు దించుకు పోబోలు!

అయినా నా ప్రియురాలి కంత చేరిగ్గా పెద్దపులి నోరావలించి వుంటూవుంటే, నే సహించడ మేలా? "ఢం' మని పులి ముఖానికి గురిపెట్టి గుండు వదిలాను అదే వేళకు తులసీతుల్యామ్మాళ్ చెంగు పైకెగిరి అడ్డొచ్చింది. కాని అది సన్నని యొల్లె కావడంచేత గుండు దానిగుండా దూసెళ్లి ఆ పులి ముఖాన్ని తగిలి, పులిపులి యావత్తూ అంత దూరాన్ని పడిచచ్చేలా చేసింది అమాయకపు మేక పాపం! ఊ! "మే" అని కూక! ఎవడో గొల్లడింకా వచ్చి తనను కాపాడతాడని?

నేను వెంటనే క్రిందకు దిగి ముందు జాగ్రత్తగా జవరాలిని సంజట్లోకి దిగిచికొని భయంలేదని సముదాయించి, కొంగూ కుచ్చీ సరిదిద్ది, మేకపిల్ల నామె కందిచ్చి, పులివద్దకు వెళ్లి పరిశీలించాను. పరిశీలిస్తూ పిలిచాను "వచ్చి చూడు" అని. కాని దాని దగ్గఱకు మతివచ్చి చూడ్డానికే జడిసిపోయింది నా ప్రేయసి కళ్లు మూసేసుకుంది "మీరే దాన్ని పరీక్షించండి. నన్నీ మేకపిల్లతో ఇల్లా ఇంటికి క్షేమంగా పోనీయండి. పులిని చంపిన పాపంమీది మేకపిల్లను రక్షించిన పుణ్యం నాది!" అని అంటూ వచ్చినదారినే గూడు చేరుకుంది నాపెట్ట.

అయితే చీర విప్పుకు ఇంటివద్ద మడతపెట్టుకునేటప్పుడు చీర చెంగుని పెద్ద గుండుదెబ్బకన్నం ఆమెకు గోచరించింది. అప్పట్నుంచి ఆచీర మఱి కట్టక ఆ పెద్దపులి చర్మంప్రక్కనే నా యొక్క సాహసకార్యాలయొక్క అసంఖ్యాకచిహ్నాల్లో అదికూడా వొక్కటిగా వ్రేలాడగట్టింది నేడు మీకందఱకూ చూపాలనో, లేక ఆఖరి తూరి అటవీశాఖోద్యోగియొక్క ఛాయానాలో ఇంత కలదని వెల్లడించాలనో, ఇక్కడకు కట్టుకు వచ్చింది"

అని గుక్కతిరక్కుండా, శ్వాసగ్రుచ్చినట్టు. వెలిబుచ్చాడు ఒకానొక గాథ మురుగప్పన్! విన్నవారందఱూ ఆముసలి అవ్వను, ఆలోకగుండా మరోమాటు చూస్తూ విస్తుపోయారు మగడు వారి అందరి ఎదర ఆమెను ముద్దుపెట్టుకున్నవాడై, "ఇదే ఈ పైనుంచి నన్ను వెంటాడించే పెద్దపులి" అని అన్నాడు తులసీతుల్యామ్మాళ్ తన బోసినోటితో నవ్వుతూ తన భర్త అన్నదానికి మూరాడక వాసికెక్కింది

ఆంధ్రపత్రిక
30-8-1950

ఆంటన్ చెకోవ్

రష్యాదేశంలో 1917 విప్లవానికి పూర్వం ప్రపంచప్రసిద్ధి కెక్కిన సాహిత్యసృష్టి చేసిన అనేకమంది రచయితల్లో చెప్పుకోదగినవాడు ఆంటన్ చెకోవ్. పుష్కిన్, టాల్‌స్టాయ్, డాస్టావ్‌స్కీ, టర్జనీవ్, గొగోల్, గోర్కీ మొదలైన రచయితలు పుట్టినరష్యాలోనే చెకోవ్ కూడా జన్మించాడు. ఇతడు గోర్కీ, టాల్‌స్టాయ్‌లకి సమకాలికుడే కాక వారికిదగ్గర స్నేహితుడుకూడాను.

చెకోవ్ 1904లో తన 45-వ ఏట చనిపోయాడు. తండ్రిచిన్న దుకాణంవర్తకుడు. తాత బానిసరైతు. చెకోవ్ సాహిత్య ప్రతిభకు చిన్నతనంలో అనేకమైన అడ్డంకులు కలిగాయి. ఆకలిబాధలనుండి సంకుచిత మూఢవిశ్వాసాల సంకెళ్ల వరకూ అతడు ఎన్నో కష్టాలకు గురిఅయ్యాడు. అయినా అతడు వాటన్నిటినీ అధిగమించి ఉజ్జ్వల కళాశిఖరాల నందుకోగలిగాడు. టాల్‌స్టాయ్ వంటి ఉద్దండుడు బ్రతికున్నకాలంలోనే అతన్ని రష్యన్‌సారస్వతానికి చక్రవర్తి అని సమకాలికులన్నారు. చెకోవ్ కీర్తి, అతనికథలమీద, నవలలమీద, అతనికే ప్రత్యేకంగా చెందిన నాటకాలమీద, ఆధారపడివుంది. గోర్కీతోకలిసి అతడు మాస్కో ఆర్టుథియేటరులో నాటకాలు ప్రదర్శించేవాడు.

చెకోవ్ ఆశావాది. రష్యాభవిష్యత్తును అతడు తనరచనల్లో ఉత్తేజకరంగా ఊహించి ఆహ్వానించాడు. అతడు తనకాలపురాజకీయ జీవితంలో ప్రత్యక్షంగా పాల్గొనలేదు. కాని జార్‌చక్రవర్తి కారాగారాలను, నిరంకుశపీడనను అతడు వర్ణించటం చూస్తే, నిజమైన విప్లవవాది అని గ్రహించగలం. ఒకసారి 'అకాడమీ ఆఫ్ సైన్సెస్' సంస్థకు ఎన్నిక జరిగినప్పుడు గోర్కీ ఎన్నికను జార్ అక్రమంగా రద్దు చేశాడు. 'ఈరద్దును నిరసిస్తూ చెకోవ్ తాను ఎన్నుకోబడినప్పటికీ, సభ్యత్వాన్ని కాలదన్ని వదలినాడు.

చెకోవ్ 1905లో జరిగిన మొదటి విప్లవానికి ముందే చనిపోయాడు. కాని చనిపోయేవరకూ ఎంతో కుతూహలంతో, సంతోషంతో ప్రజాశక్తుల పురోగమనాన్ని గమనించాడు. అతడు వ్రాసిన ఆఖరుకథ "బ్రైడ్" లో అతని బలమైన విప్లవోత్సాహం ప్రతిధ్వనిస్తుంది.

చెకోవ్ రచనల్లో అపారమైన దేశప్రేమ కనిపిస్తుంది. అతని పాత్రలు ఆవేశంతో జార్ నిరంకుశత్వాన్ని ఖండించటం చదివితే మనసొత్తురు ఉడుకెక్కుతుంది. రష్యన్‌ప్రజల్లోని ఉత్తమగుణాలన్నీ అతని రచనల్లో స్థానం సంపాదించుకున్నాయి.

టాల్‌స్టాయి ఒకసారి చెకోవ్‌తో ఇలా గన్నాడట, "నువ్వు నిజమైన రష్యన్‌వి. నీలో రష్యన్ తనం పరిపూర్ణత చెందింది." ఇల్లాగని, ప్రేమగా నవ్వి టాల్‌స్టాయి చెకోవ్‌ను కౌగలించుకున్నాట్ట. ఈ సంగతిని తరవాత ఎప్పుడో గోర్కీ బయటపెట్టాడు.

చెకోవ్ వాస్తవికవాది. అతని కథల్లో రష్యన్ జీవితంలోని ప్రతి రంగమూ, ప్రతి తరగతీ, వృత్తి, రష్యాలోని ప్రతి రాష్ట్రమూ వర్ణితమయ్యాయి. ఆకాలంలోని జమీందార్లు, వర్తకులు, విజ్ఞానశాస్త్రజ్ఞులు, పేదరైతులు, కూలీలు—అందర్నీ పాత్రలుగా స్వీకరించాడు. ముఖ్యంగా మనం రోజూ చూసే మామూలు మనుషుల్నే ఎంతో అందంగా తీరిగి కథల్లో సృష్టించాడు.

1880—1890 సంవత్సరాలలో రష్యాలో అతిక్రూరమైన నిరంకుశత్వం తాండవం చేసింది. చెకోవ్ సునిశిత హృదయం చుట్టూ వున్న దుస్సహవాతావరణానికి మహాక్రోధంతో స్పందించింది. నిజమైన మానవత్వంతో కూడిన క్రొత్త జీవితంకోసం అతడు తహతహలాడిపోయాడు. తన కాలంలోని నిర్జీవసంఘధర్మాన్ని నిరసిస్తూ కథలు వ్రాశాడు. ఉజ్జ్వలమైన, విభిన్నమైన భవిష్యత్తును గూర్చి కలలు గంటూ కథలు వ్రాశాడు.

చెకోవ్ ఆభవిష్యత్తులోకి ఎలా చూడగలిగాడు? నీచం, అశుభ్రం. హేయమైన వర్తమానాన్ని అతడంత శక్తివంతంగా ద్వేషించగలగడమే దానికి కారణం. అతని రచనల్లో అతని ఉదాత్తమైన మనస్తత్వం, అతని నిగ్రహం, నిరాడంబరత ప్రతిఫలిస్తాయి. అందుచేతనే చెకోవ్‌కు సాహిత్య ప్రపంచంలోగల స్థానం అంత అననుగమ్యంగా కనిపిస్తుంది.

రాజుల్నీ, వారి సామంతుల్నీ, జలగలవంటి జమీందారుల్నీ, అభిమానవత్వానికి ఆశించే అహంభావపరుల్నీ, "ఎస్టేట్" "ప్రిన్సెస్" మొదలైన కథల్లో తూర్పారబట్టాడు. పెట్టుబడిదారీపరిపాలనం ప్రజలను అన్నివిధాలా నడుములు విరగ్గొట్టి, అథఃపతితుల్ని చేస్తుందని అతడు దృఢంగా నమ్మాడు. 'మై లైఫ్' అనే నవలలో ఒక మనిషి మరొక మనిషిని ముడిపదార్థంగా వాడుకోవటం, సాంఘిక అసమానత్వంలోని అన్యాయం చాల గొప్పగా చిత్రించాడు. విప్లవానికి ముందటి రష్యన్ గ్రామాల యథార్థపరిస్థితిని గ్రహించాలంటే, అతని "ముజిక్స్" "డిచ్" అనే కథలు చదవాలి. కాయకష్టం చేసే కర్షకులచీకటిజీవితాలని, అజ్ఞానాన్ని, భూస్వాముల అంతులేని దురాశని అతడు చిత్రించిన విధం చూస్తే అతడు సంఘపరిస్థితుల నెంత విశ్లేషణగా, లోతుగా అర్థంచేసుకోగలిగాడో, అతని కళానైపుణ్యం ఎంత నిశితమో బోధపడుతుంది.

చెకోవ్ కథల్లోను, నవలలు, నాటకాలలోను 'పండితులను' నిర్దయగా విమర్శిస్తాడు. అతని సానుభూతిఅంతా మామూలుమనుష్యుల మీద, పేరు లేని సామాన్యుల మీద కేంద్రీకృతమైంది. తను పాండిత్యానికి, తెలివితేటలకు తానే మురిసిపోయే

(33-వ పేజీ చూడుడు)

శ్రవ్యనాటిక :

భారతావతరణము

శ్రీ వి. డి. ప్రసాదరావు

[రాజరాజనరేంద్రుని రాచనగరు. అంతః పురానికీ రాజాస్థానానికీ కూడా అంటి ఉన్న పురాణవ్యాసంగమందిరంలో, మహారాణి అమ్మంగదేవి, అంతః పురస్త్రీలతో ఉచిత స్థానాలలో కూర్చుని ఉంటుంది. నారాయణభట్టు పురాణకాలక్షేపాని కుపక్రమించనుంటాడు.]

మహా : బాబుగారూ, ఈ తాంబూలం స్వీకరించి, నేటి పురాణపఠనం ఆరంభించండి.

నారా : నవ్వుతూ – అమ్మా, మీ దంపతులకు ఎంత బ్రాహ్మణభక్తి, ఎంత వినయమమ్మా. నిత్యం పురాణం చెప్పేవాడికి రోజూ, ఈ సువర్ణవస్త్రదానాలతో తాంబూలమేమిటి తల్లీ – అందులోనూ మీ కుటుంబంలోవాళ్లముగా ఉంటున్న నాకూ నన్నయ్యకూ ఈనిత్యదక్షిణ లెందుకమ్మా—

మహా : గురూ, ఇది మీకు దక్షిణకాదు. ఏదో మా సంతోషము. మాచేతనైన స్వల్పవిధిలో ప్రకటించుకోటం. మీరు కేవలం మాకు ఆదరణలోనే తండ్రులు కాదు. మాకు అందని పౌరాణిక విజ్ఞానాన్నంతను తేటతెలుగులో భిక్షగా అందిస్తున్నారు.

నారా : శుభమస్తు. తమ ఆజ్ఞాప్రకారమే కానిద్దాం. శిశుపాలవధ ఘట్టంలో కాదూ ఉన్నాం. ఆఁ. [పురాణం చదువుతున్న కంఠంతో].

నాయమర్హతి వార్ష్ణేయః
తిష్ఠత్స్విహమహాత్మసు
మహీపతిషు కౌరవ్య
రాజవత్ పార్థివార్హణామ్.

రాజసూయాధ్వరం ఒనర్చనున్న ధర్మరాజులుంగారు, శ్రీకృష్ణమూర్తిని పూజచేయటానికి భీష్ములవారి అనుజ్ఞమీద కదలబోతోంటే, అప్పుడు శిశుపాలుడు శ్రీకృష్ణులంటే ఉన్న పూర్వద్వేషంవల్ల ధర్మరాజుతో ఏమంటున్నాడంటే–ఓ ధర్మరాజా, గాంగేయుని దుర్వ్యవసాయం వల్ల, నికృష్టుడైన కృష్ణుణ్ణీ, వార్ష్ణేయుణ్ణీ, పూజిస్తావటయ్యా. అంతటి ఆదరం ఉంటే వేరే చాటుగా గౌరవించుకోవాలి. గాని ఈసభలోనా ఈఅకృత్యం. ఇందరు రాజులు, ఇందరు మహాత్ములూ, ఇందరు ఋషులూ, ఇందరు పెద్దలూ ఉండగా వాళ్లెవళ్లూ నీకు కనబడటం లేదటయ్యా. అంటూ ఒక్కొక్క విషయంలో ఎవరు పెద్దలో. ఏవిషయంలోనూ శ్రీకృష్ణుడు గౌరవార్హుడు ఎల్లాకాడో చెప్పుకొస్తున్నాడు.

[లోపల్నించి వందిమాగధులు– 'స్వస్తిశ్రీమతాం సకలభువన సంస్తూయమాన సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజాధిరాజ పరమేశ్వర, పరమ భట్టారకః పరమమాహేశ్వర, పరమ బ్రహ్మణ్య, శ్రీరాజరాజదేవ జైవిజయీభవ.]

కంచుకి : [ప్రవేశించి]–మహారాజులుంగారును నన్నయభట్టారకులుగారూ ఇటు వేంచేస్తున్నారు (అని వెళ్లిపోతాడు.)

మహా : అయ్యో పురాణకథనం కానీండి ఆపకుండా. స్త్రీలమంతా, ఈ తెరవెనకనే కూర్చుని వింటూంటాం.–(కొందరు స్త్రీలు సర్దుకుంటూ ప్రక్కకు కదిలి కూర్చున్న సవ్వడి.)

(రాజరాజనరేంద్రుడు, నన్నయభట్టు ప్రవేశిస్తారు.)

రాజ : బ్రాహ్మణోత్తములకు నమస్కారము.

నన్న: అన్నా, నారాయణభట్టూ నమస్కారము.

నారా రాజరాజులకు స్వస్తి. దీర్ఘాయురస్తు నన్నయ్యా.

నన్న : అన్నా, మహారాజులకు భారతశ్రవణం మీద ఉన్న అపేక్ష నీకు తెలుసుకదా. పురాణకాలక్షేపం చేద్దామా అని నన్నడిగారు. రసవత్తరంగా కథ వినాలంటే నువ్వు చెప్తూంటేనే వినాలని ఇటు బయలుదేరి వచ్చాము.

నారా : పరిహాస కంఠంతో – రాజరాజా, మా నన్నయ్యకు నామీద గౌరవం లేకపోయినా బాగుండు ననిపిస్తుంది. నాకొక్కొక్కప్పుడు.

రాజ : అదేమల్లా అంటున్నారు? నాకు నన్నయభట్టుగారి మీదిగల గౌరవానికీ, మీమీద వారికిగల గౌరవం కూడా ఒక కారణమే.

నన్న : మహారాజా, బాగా చెప్పారు.

నారా : కృతజ్ఞుడను. అదికాదు మహారాజా. మా నన్నయ్యకు ఎన్నాళ్లనుంచో మనవిచేస్తున్నాను. భారతం తక్కిన ద్రావిడ భాషలలో వెలుస్తూ ఉంది సర్వ ప్రజకు ప్రయోజనకరంకాగలిగేందుకు వ్యాసమహర్షి పంచమ వేదంగా దాన్ని ఉద్దేశించారు. ఆంధ్రావనిలో సర్వప్రజానీకానికి అందుబాటులో ఉండేటట్టు చేయటానికి నీవే తగుదువు. ఆపనికి పూనుకోవలసిందని .ఎన్నాళ్లనుంచో వేడుతున్నాను. నామాట చెవిని బెట్టడు.

రాజ : ఔను నన్నపార్యా. మా వంశ పూర్వపురుషులైన భారతవంశ్యుల చరిత్రలు వినాలని నా కెప్పుడూ అతి కుతూహలంగా ఉంటుంది. నాకు ప్రీతికరమైన విషయాలు ఐదింటిలోనూ, భారతశ్రవణం, బ్రాహ్మణ గౌరవం మరీ హితమైనవి. ఆ భారతం ఆంధ్రభాషలో రచించి మీరు నాకు వినిపించాలని అపేక్షగా ఉంది.

నన్న : రాజేంద్రా, నారాయణభట్టు సకల శాస్త్రకోవిదుడు. జన్మతః మహాకవి. భారతార్థం ఆమూలాగ్రంగా ఎరిగిన దిట్ట. ఆయన రచించగలడనే ఉద్దేశంతో ఆగాను. అలాంటివాడుండగా తగుదునని నేను పూను

కోవటం, కృష్ణద్వైపాయనులకే అపచారం చేసినవాడనౌతానేమో నని నా భయం.

నారా. మహారాజా, మా నన్నయ మర్యాదవచనాలను బట్టి మా తారతమ్యం నిర్ణయించ బూనుకోకండి. నాకన్న అతడే చాలా అర్హుడు మా నన్నయ్య కున్న నిత్యసత్యవచోప్రౌఢి, జన్మసిద్ధ కవితా ప్రతిభ, అతని వాగనుశాసనత్వం, మీ కెరుగనివా? ఆబాల్య సిద్ధంగా అతనికి నామీద గౌరవం ఉంది. కాని భారత ఆంధ్రీకరణం విషయంలో అతని విధ్యుక్తధర్మానికి కూడా ఆ గౌరవం అడ్డు తగలటం నేను సహించను.

రాజ (నవ్వుతూ) మీ రిద్దరూ - ఒకరంతె వారు మరొకరు. మీలో తారతమ్యం మేమేమని ఏర్పరిచేది? పోనీ భారత యుద్ధంలో నరనారాయణుల లాగా, ఇద్దరూ కలిసే భారతాంధ్రీకరణం ఆరంభించండి మమ్మలను కృతార్థులను చేయండి.

(తెరలోనుంచి మహారాణి కంఠము)- మా అభీష్టాన్ని దేవరవారే వెలిబుచ్చినందుకు కృతార్థులము. నరనారాయణుల లాగా ఇద్దరూ ఆంధ్రభారతం రచించి, ఆంధ్రభాషనూ, ఆంధ్రలోకాన్నీ పునీతం చెయ్యవలెనని మా కోరిక. సంస్కృత మెరుగని మా బోంట్లకు కూడా వ్యాసముని ప్రోక్తమయిన జీవిత ధర్మాలను తేలికగా తెలిసేటట్టు చేయండి

రాజా నన్నయా, ఇక మాట్లాడకు నీకీ పని తప్పదు. ఇది వేరేమీ పనికాదు నీ స్వధర్మనిర్వహణం.

నన్న [వినయంగా]—ఇందరు ఆజ్ఞాపిస్తూంటే కాదంటానా! భారత సారము ఆ మూలాగ్రంగా తెలిసినవారు మీ రందరూ. మిమ్మల్ని ఎట్లా మెప్పించగలను? సరే మా నారాయణ సహాయం చేస్తానంటే ప్రయత్నించి చూస్తాను.

[లోపలినుంచి మహారాణి కంఠము]— ఇప్పటికన్న శుభముహూర్తం లేదు. మఠాధిపాచార్యులైన నన్నయభట్టుగారు ఇప్పుడే భారతాంధ్రీకరణ ప్రారంభించాలని రాణివాసమంతా వేడుకొంటోంది. చేటీ, ఈ స్వర్ణవస్త్రాలంకారాలను ఈ తాంబూలాన్ని మహారాజువారి వద్దకు చేర్చు

[దేవాలయం నుంచి గంట వినబడుతుంది.]

రాజ. ఘంటానినాదం శుభ ముహూర్తాన్నే సూచిస్తూంది. దౌవారికా! పండిత లోకాన్నీ, రాజసభాసదులను ఇక్కడకు పిల్చుకురా

[సందడిగా సభాసదులంతా ప్రవేశిస్తారు.]


వాగనుశాసనా- నన్నపార్యా! ఇదుగో ఆంధ్రభారతావతరణకుగాను తాంబూలం స్వీకరించండి

[గంట మోగుతుంది. సభాసదులంతా కరతాళధ్వనులతో, ఆశీర్వాదవచనాలు పలుకుతారు. నన్నయభట్టును మహారాజును ఆశీర్వదిస్తూంటారు.]

నన్న: [కంఠం సవరించుకొని గంభీరంగా శ్లోకం చదువుతాడు]


శ్రీవాణీ గిరిజా శ్చిరాయదధతో
వక్షో ముఖాంగేషుయే
లోకానాం స్థితిమావహ న్త్యవిరతాం
స్త్రీపుంస యోగోద్భవామ్
తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా
సంపూజితా వస్సురై
ర్భూయాసుః పురుషోత్తమాంబుజభవ
శ్రీకంధరా శ్శ్రేయసే.

[సభికులు ఓహోహో అంటూ, నారాయణభట్టు, రాజరాజు, ధన్యోస్మి ధన్యోస్మి అంటూ కరతాళధ్వనులు చేస్తారు.]




మద్రాసు సౌహార్దయవార కార్యక్రమం (ఆగస్టు 15-21) సర్కిల్ అధికారులు ఆయా తంతితపాలా కార్యాలయాలకు వెళ్లి క్రింది ఉద్యోగులకూ ప్రజలకూ సాయపడ్డారు పోష్టుమాస్టర్ జనరల్ కన్నింగ్‌హాంగారు, ఒక ఖాతాకు అంటించవలసిన పోస్టేజిని లెక్కకట్టడంలో ఒక గుమాస్తాకు సాయం చేశారు.


అస్సాం భూకంపం




భూకంపంవల్ల దెబ్బతిన్న ప్రాంతం

డుమ్ డుమా రోడ్డుమీద ఒకవంతెనకు ఇటూఅటూ భూభాగం యావత్తూ 8 అడుగుల లోతుకు గొయ్యిగా దించుకు పోయింది







శిథిలమైపోయిన డుమ్.డుమా రైల్వేబ్రిడ్జి





డుమ్‌డుమా ప్రాంతంలో శిథిలమై పోయిన కాంక్రీటింగ్ రోడ్డు; రోడ్డు యావత్తు బీటలువిచ్చి నిలువులోతు అఖాతాలు యేర్పడినై.






డిబ్రూఘర్ ప్రాంతంలో విచ్చిపోయిన బ్రహ్మపుత్రానది చెలియలికట్టలు.



ధ్వంసమైన డుమ్ డుమా రోడ్డువంతెన

అస్సాంలో భూకంపం


స్సాంరాష్ట్రానికి భూకంపంవల్ల నష్టం కొన్ని కోట్ల
లుంటుందని అంచనా వేసినారు ఇప్పటికింకా ప్రాణ
లు తెలియడంలేదు. డిబ్రూఘర్ ప్రాంతానికి సంబం
చిత్రాలనుబట్టి రాష్ట్రం ఏవిధంగా దెబ్బతిన్నదీ
చ్చు.




డిబ్రూఘర్‌లో శిథిలమైన ఒక భవనం.



బివిచ్చి శిథిలమై దించుకుపోయిన 'అస్సాం గ్రాండ్ ట్రంక్ రోడ్డు' ఈ రోడ్డులోని కొన్ని భాగాలు నీటిలో మునిగిపోయాయి.



సరఫరా సౌకర్యాలు భగ్నమై అందుబాటులో లేకుండాపోయిన డమ్ డుమా ప్రాంతాలకు ఏనుగులద్వారా ఆహారపదార్థాల [illegible].



శిథిలమైన స్కేటింగ్ రోడ్డు



డిబ్రూఘర్ నగరంలో శిథిలమైన భవనాలు

చిత్రసమీక్ష:


అస్పృశ్యతానివారణకు చలనచిత్రకళ దోహదం

శ్రీ పోగుల కోటీశ్వరరావు

కళ కళకోసమే అన్న ప్రాచీన సాంప్రదాయసూక్తిని అనుసరించి కళాకారులందరు మడిగట్టుకుని ఆధ్యాత్మిక చింతలో పడి ముక్కుమూసుకు కూచున్న పక్షంలో సాంఘిక పరిణామాలు కాలానుగుణ్యంగా జరగకపోగా సమాజం పౌరాణిక యుగంలోనే మూలుగుతూవుండేదంటే ఆశ్చర్యం లేదు. కళావేత్తలలో కొంతమంది అయినప్పటికీ తమకలం పోట్లతోను తమ కుంచెల వాడి పుంజాలతోనూ, శిల్పనైపుణ్యంతోను, సంగీతనాదంతోను సంఘానికి మేలుకొల్పు పాడుతూ విప్లవాత్మక చైతన్యం కలుగజేసేందుకు నిర్విరామంగా సాగించిన కృషి ఫలితంగా ప్రజల్లో సంస్కరణాభిలాష ఉదయించింది. తదనుగుణంగా స్వేచ్ఛాపథంలో విహరించటానికి అవకాశం ఏర్పడింది. మూఢాచారాలు, మూర్ఖపు తత్వాలు, మానవుడికీ మానవుడికీ మధ్య నిర్మించిన ఇనుప తెరలు తొలగించబడి సంఘం పురోగమించగలుగుతోంది.

సమాజంలో ఒక భాగాన్ని కల్పితంగా వేరుచేసి 'ఊంచ్' అని 'నీచ్' అని నామకరణం చేసే ఆచారం ఎంత నికృష్టమైనప్పటికీ, కొన్ని దేశాల్లో నిలకడ సంపాదించుకుని పైశాచికనృత్యం చేస్తున్నది. 'జ్యూ'లకు, క్రైస్తవులకు తారతమ్యం, నీగ్రోకు, శ్వేతజాతికి మధ్య విభేదం, సవర్ణ హిందువులకు,హరిజనునికి వ్యత్యాసం,—మచ్చుకు ఇవి పైన పేర్కొన్న ఆచారరూపాంతరాలు. ఇట్టి విమూఢతత్వాన్ని ఎదుర్కొని, దానిపరిణామాలను రూపుమాపేందుకు ప్రతి దేశంలోని చలనచిత్రజగత్తు ఇతోధికంగా కృషిసల్పినమాట వాస్తవం. ఆంధ్రసీమలో అల్లుకొనివున్న అంటరానితనాన్ని, విశాల భారతదేశంలో వ్యాపించివున్న అస్పృశ్యతను నిర్మూలించేందుకు సినిమాలోకం నెరపినసమరాన్ని పరిశీలించుదాం.

మహత్తరమైన ఈ భావవిప్లవానికి నాంది ప్రస్తావన జరిపించే గౌరవం సమస్యాచిత్ర నిర్మాణంలో సిద్ధహస్తుడైన వి. శాంతారాం పొందగలిగారు. "ధర్మాత్మ" అనుపేర ఒక మహారాష్ట్ర మహాత్ముని అమరగాథను వెండితెరమీద కెక్కించి హరిజనులను ఉద్ధరించవలసినదని ఒక వినూత్న సందేశాన్ని అందజేశారు. శాంతారాం వెలిగించిన కాగడాను చేతబట్టుకుని నడచినచిత్రం "అచ్ఛుత్ కన్యా."



శ్రీ రాజరాజేశ్వరీ ఫిలింకంపెనీవారి 'సౌదామని'లో సి. ఎస్. ఆర్. ఆంజనేయులు

అటుతర్వాత ఉత్తరాదిచిత్రనిర్మాతలు కొంతకాలంవరకు ఈకాగడావెలుగుబాటను అనుసరించకపోవుట చింతింపవలసినవిషయమని అంగీకరించకతప్పదు. అయితే ఇందుకు ప్రత్యామ్నాయంగా వారు మరొక జ్యోతిని ప్రకాశింపజేశారు. అది హిందూ, ముస్లిం ఐక్యతాప్రచారం. దానిని ఉజ్వలంగా నెరవేర్చినందుకు ఆ యా చిత్రనిర్మాతలు ఎంతైనా అభినందనీయులు.

తిరిగి 1945 వ సంవత్సరంనాటికి హరిజనసమస్యను ప్రతిఫలింపజేసిన హిందీ చిత్రాలు రెండు తయారైనవి. ప్రభాత్ వారి "హం ఏక్ హై" చిత్రంలో కేవలం ఒక హరిజనబాలికను సవర్ణజమీందారిణిచేత పోషింపజేయటంతో నిర్మాతలు తృప్తిచెందారు. కాని, న్యూథియేటర్సు వారి "ఊంచ్-నీచ్" చిత్రం ఆమూలాగ్రంగా ప్రతిబింబింపజేసింది. సమాజం చూపే నిరాదరణ ఫలితంగా హరిజనవనిత అనుభవించిన హృదయవేదన ఈ చిత్రానికి కథావస్తువు. క్రూరమైన ఆచారాన్ని ఎదిరించి పోరాడే శక్తిలేక అసహాయురాలైన స్త్రీ ఎదురీత వేయలేక నిస్పృహచెంది, తన నూరేళ్ళజీవితాన్ని ముక్కుపచ్చలారని వయస్సులోనే ముగింపజేసుకుంటుంది.

న్యూథియేటర్సువారు ఇంతకుపూర్వం నిర్మించిన "డాక్టరు" చిత్రంలో ఈ సమస్య ఛాయ గోచరించుతుంది.

హిందీచిత్రజగత్తుకు ఎంతమాత్రం తీసికట్టు గాకుండా తెలుగుసినిమాలోకం మరి రెండు అడుగులు ముందుకు వేసిందని మనం సగర్వంగా చెప్పుకోవచ్చు.

కీర్తిశేషులు గూడవల్లి రామబ్రహ్మంగారి దర్శకత్వాన సారథీఫిలిమ్సు సమర్పించిన "మాలపిల్ల" ఈ సందర్భంలో పేర్కొనవలసిన మొట్టమొదటి చిత్రం. శాస్త్రిగారి దౌర్జన్యానికి గురిఅయినట్టు చూపించిన హరిజనులను చౌదరయ్యగారు సమాయత్తం చేయడంలో మరో రూపంగా వర్ణవిభేదము తిరిగి తలయెత్తినప్పటికీ, మొత్తంమీద "మాలలుమాత్రం మనుజులుకారా" అన్న చైతన్యాన్ని తీసుకురావడానికి ఈచిత్రం తోడ్పడిందన్నది యదార్థం. కాగా, గాంధీమహాత్ముని దీవనబలంతో దీక్షను



ఏ.వి ఎం. వారి 'జీవితం'లో, అమాయికంగా పురుష వంచనకు లోనైన యువతి పాత్రను చక్కగా నిర్వహించిన ఎస్. వరలక్ష్మి.

బూని హరిజనులు పురోగమించేందుకు ఈ చిత్రం ఒక మహత్తరమైన ప్రచారకసాధనమైనదని చెప్పక తప్పదు అంటరానితనము అన్నది "మధ్యలో తెచ్చిపెట్టిన మహా నాటకం" అన్న చౌదరయ్యగారి గంభీర వాక్కు ప్రేక్షకులను ఉత్తేజపరిచింది.

రోహిణివారి "గృహలక్ష్మి" చిత్రంలో కూడా హరిజనసమస్య ప్రవేశపెట్టబడినది "అందరు మానవు లొకటే యైనా మాకీ కర్మము తప్ప దిదేలా" అని హరిజనుల దీనాలాపం మన హృదయాలను కరిగించివేసింది "దీనబంధు" చిత్రం హరిజనబంధువు. "మాల మాల యని దూరము చేయకురా" అన్న విజ్ఞాపన మరువలేము. "భక్తిమాల", "జీవన్ముక్తి" ఈ రెండు చిత్రాలు పుక్కిటి పురాణగాథల్తో అస్పృశ్యతానివారణను ప్రచారంచేసినవి

కొంతకాలానికి మళ్ళీ సారథివారు మరొక చిత్రాన్ని బహూకరించారు— "పల్నాటియుద్ధం." పూజ్య బాపూజీని మూర్తీభవింపజేసిన బ్రహ్మన్న నాయుడు చేత హరిజనుడైన కన్నమదాసుకు సర్వసైన్యాధిపతిపట్టం కట్టించటం ఈ చిత్రంలో ఒక ఉజ్వల సన్నివేశం వర్ణవిభేదములేని పంక్తిభోజనాలు కన్నులపండువుగా చూపించారు.

ప్రఖ్యాతకథకులు, దర్శకులు టి గోపీచంద్ ఈ సమస్యను కేంద్రీకరింపజేసిన ఉన్నవ లక్ష్మీనారాయణగారి ఉత్తమ నవల "మాలపల్లి"ని సెల్యులాయిడ్ మీద చూపించనున్నారని వింటున్నాం. మరొక ఉత్తమ సాంఘిక చిత్రం తయారుకాగలదని ఆశించుదాం

మరొక్క మాట ఇటీవల ఒక సినిమా పత్రికలో 'ప్రశ్నలు-జవాబులు' శీర్షికలో ఒకానొకపాఠకుడు 'ఇంతవరకు హరిజనులకు సినిమారంగంలో సరియైనస్థాన మివ్వలేదేమ' ని ప్రశ్నించాడు అందుకు సంపాదకులు కొంతమంది ఉన్నారని సమాధాన మిచ్చారు. అయితే మనచిత్రరంగంలో ఒక హరిజననటిగాని, నటుడుగాని లేకపోవడం నిజంగా లోపమనే చెప్పాలి

మొన్నీమధ్య బొంబాయిలో విడుదలయిన 'పింకీ' అను హాలీవుడ్ చిత్రంలో నాయిక ఒక నీగ్రో. ఆ పాత్రను శ్వేతజాతి నటి జీనీక్రెయిన్ అభినయించింది. అందుకు అమెరికాలోవున్న నీగ్రోలు చాలామంది ఆందోళనచేశారని తెలుస్తున్నది అదే రకంగా మనదేశంలోని హరిజనులు ఆందోళనచేసినపక్షంలో తప్పేమీ లేదు 'మాలపిల్ల' చిత్రంలో నాయికగా ఒక హరిజనవనితను ఎన్నుకున్నట్లైతే ఎంతో ముచ్చటగా వుండేది. "మాలపల్లి" లోనైనా సరే ముఖ్యభూమికలు హరిజనులచేత నటింపజేయించితే మన చిత్రజగతి మరొక అడుగు ముందుకు పురోగమించినదని సంతోషించవచ్చు



తుఫాను

[షేక్స్పియర్ నాటికలోని కథ]

★

ఇటలీ దేశంలో 'మిలాన్' అనే నగరం ఉంది. పూర్వం ఆ నగరాన్ని 'ప్రాస్పరో' అనే రాజు పరిపాలించేవాడు. అతడు సంతతవిద్యాసక్తుడు. క్రమంగా పరిపాలనా భారాన్ని తన తమ్ముడైన ఆంటోనియోకు అప్పగించాడు. ఆంటోనియో తన సోదరుని పేరిట రాజ్యతంత్రాన్ని నిర్వహిస్తూఉండేవాడు.

తన తమ్ముడు తనవలె సత్యతత్పరుడని విశ్వసించాడు ప్రాస్పరో. కాని అత డట్టివాడు కాడు. ఎట్లాగైనా రాజ్యాన్ని తన సోదరునివద్దనుండి సంగ్రహించాలని పన్నాగాలు పన్నాడు. సమీపంలో గల నేపుల్సురాజు సహాయాన్ని కోరి, అందుకై యథోచితసత్కారం చేస్తానన్నాడు ఆంటోనియో.

ఒకనాటి అర్ధరాత్రిఆంటోనియో 'మిలాన్' నగరద్వారాలు తెరిచివేశాడు. నేపుల్సురాజు, సైన్యసమేతుడై పురం ప్రవేశించి ఆక్రమించుకున్నాడు.

నేపుల్సురాజు 'ప్రాస్పరో'ను, అతని మూడేండ్ల ముద్దుకూతురు 'మిరాండా'ను బంధించి, శిథిలం కావటానికి సిద్ధంగా నున్న ఒక పాత ఓడమీద ఎక్కించి, ఎక్కడికో పంపివేశాడు. తన సోదరునకు ఆంటోనియో గుక్కెడు నీళ్లుగాని ఒక పూట ఆహారంగాని ఓడలో ఉంచలేదు. వాళ్లా పాతపడవలో సముద్రంలో మునిగిపోయికాని, లేక ఆకలిదప్పులతో అలమటించికాని చనిపోవటమే అతని అపేక్ష.

కాని అంతఃపురంలో ఉన్న

శ్రీ బొడ్డుపల్లి పురుషోత్తం

ధర్మాత్ముడైన ఒక వృద్ధుడు ప్రాస్పరో మీద గల అభిమానం కొద్దీ, రహస్యంగా అవసరమైన ఆహారము, నీరు, వస్త్రములు సమకూర్చాడు. అంతే కాదు. తన ప్రభువు నిరంతరపఠనాసక్తుడని తెలిసినందువల్ల యెన్నో గ్రంథాలు కూడ ఓడలో ఒక మూలయేర్పాటు చేశాడు.

ఓడ సముద్రయానం ప్రారంభించింది. సముద్రకెరటాలు, వాయువు, తుపానులు ఎటు తీసుకుపోతే ఓడ అచటికి పయనిస్తున్నది. తన బిడ్డను ప్రాణప్రదంగా కాపాడుకుంటూ ఓడలో గడిపాడు ప్రాస్పరో.

మిరాండా ముక్కుపచ్చలారని పసికూన. తాను, తన తండ్రి, ఎట్టి అపాయంలో చిక్కుపడిఉన్నారో ఆ అమాయకహృదయానికి తెలియదు. తండ్రిఒడిలో కూర్చుని కెరటాలు చూసి కేరింతలు కొడుతూ ఆడుకుంటోంది. కల్లోలితసముద్రంలో ఆ ఓడ మందగమనంతో ఎట్టి అపాయం లేకుండ, తండ్రీబిడ్డలను తెల్లవారేటప్పటికి ఒక చిన్న ద్వీపానికి చేర్చింది.

ఆ ద్వీపంలో చాలా ఫలవృక్షాలున్నాయి. అందులో ఒక పెద్ద ఫలవృక్షంనుండి భీకరధ్వానాలు వినిపిస్తున్నాయి. ఆ ధ్వనులకు భయపడి తోడేళ్లు, ఎలుగుబంట్లు కూడ తోకలు ముడుచుకొని పరుగిడుతున్నాయి.

ప్రాస్పరో మంచి ఉపాయం కలవాడే గాక, మంత్రవేత్తకూడా. అతడు తన మంత్రశక్తితో ఆవృక్షాన్ని ఛేదించాడు. అందులోనుండి సౌందర్యవతియైన 'ఏరియల్' అనే దేవకన్య వచ్చింది.

'ఏరియల్' ప్రాస్పరోకి వినయంగా నమస్కరించి, ఒక రాక్షసి, తన్ను, తన అనుచరులను ఆ చెట్టు తొఱ్ఱలో ఎట్లు బంధించినదీ, తరువాత రాక్షసి ఎట్లు మరణించినదీ విశదపరచింది. తరువాత ప్రాస్పరో, ఏరియల్ సహచరులను కూడ విముక్త మొనర్చాడు. వాళ్ళందరూ కృతజ్ఞతతో ప్రాస్పరో సేవచేస్తున్నారు. వీళ్లుగాక ఆ ద్వీపంలో వీళ్ళను బంధించిన రాక్షసి కుమారుడు 'కాలిబాన్' అనే వాడున్నాడు. అతడు అసహ్యమైన అడవిమనిషి. పశుప్రాయుడు.

అతన్ని సంస్కరిద్దామని ప్రాస్పరో ఎంతో ప్రయత్నించాడు. మురికి గుడ్డలు విడిపించి శుభ్రవస్త్రాలు ధరింపజేశాడు. అతనికి సూర్య చంద్రాదుల పేర్లు నేర్పించాడు. అతనిచేత కందమూలాలు తిని పించాడు. కాని, 'కాలిబాన్' ప్రవ ర్తనలో ఏమాత్రం మార్పు రాలేదు. ప్రాస్పరోకి అతనిమీద అసహ్యం కలిగింది. ఏమీ ప్రయోజనం లేదని తెలిసికొని ప్రాస్పరో అతన్ని వంట యింటిలో సేవకునిగా నియోగించాడు.

ఈ ఏకాంతద్వీపంలో మిరాండా దినదినప్రవర్ధమాన మైంది. తండ్రే ఆమెకు కావలసిన విద్య గఱపుతున్నాడు. ఏరియల్ తప్ప ఆమెతో ముచ్చటించేవాళ్లే లేరు. 'కాలిబాన్'ను చూస్తేనే ఆమె కెంతో అసహ్యం, భయంకూడా.

ఇట్లుండగా, ఒకనాడు సముద్రంలో ఒక తుఫాను చెలరేగింది. ఆకాశం కారుమేఘాలతో నిండిపోయింది. ప్రళయకాలపర్జన్యనినాదాలు మారుమ్రోగినాయి. మెరుపులు కన్నులు మిరుమిట్లు గొలుపుతున్నాయి.

ఇంత తుఫాను తెచ్చిపెట్టింది, ప్రాస్పరో తాంత్రికశక్తి. క్రూరాత్ముడైన తన సోదరుడు ఆంటోనియో, అతని మిత్రుడు నేపుల్సురాజు, నేపుల్సుయువరాజైన 'ఫెర్డినాండు' తన ఓడలో అన్నపానాదు లమర్చిన వృద్ధఉద్యోగి, ఇతరపరివారము సముద్రయానం చేస్తున్నట్లు ప్రాస్పరో తన దివ్యదృష్టివల్లగ్రహించాడు.

భీకరమైన తుఫానువాత పడింది వీళ్లు ప్రయాణం చేసే ఓడ. ప్రయాణీకులు తమకు మరణం తప్పదని గ్రహించారు. అంతలో ప్రాస్పరో, ఏరియల్‌ను రావించి, భీకరధ్వానాలచే ప్రయాణీకులను భయపెట్టవలసింది దని ఆజ్ఞాపించాడు. ఏరియల్ తాను అదృశ్యంగా ఉండి, ప్రయాణీకులను అనేకయాతనలు పెట్టింది. చివరకు ఓడకునిప్పు ముట్టుకుంది. ఇంక తడవు చేసి ప్రయోజనం లేదని, ప్రయాణీకులు రాజబృందంతోసహా, కల్లోలంగా ఉన్న సముద్రంలోకి దూకారు. ప్రాస్పరో తాంత్రికశక్తివల్ల, ఏరియల్ నిపుణమైన నిర్వహణక్రింద, వారందరూ వేరువేరు చోట్ల ఆ ద్వీపం చేరుకున్నారు భద్రంగా. ఓడకూడా నెమ్మదిగా ఒడ్డు చేరింది.

ఫెర్డినాండు యువరాజు ద్వీపంలో ఒక ప్రాంతం చేరాడు. తన తండ్రి, మిత్రులు మునిగిపోయినారనే ఇతను భావించాడు. వాళ్లందరూ యువరాజు జాడ తెలియక విలపిస్తున్నారు.

ఈ సమయంలో ఏరియల్ అదృశ్యమైన యువతీరూపం ధరించి తన మధురకంఠంతో యువరాజుకు సమీపంగా గీతాలాపన చేయ నారంభించింది

ఆ మధుర మంజుల గీతాలాపనకాశ్చర్యపడి, ఆ ధ్వని ననుసరిద్దామని యువరాజు కొంత దూరం నడిచాడు. నడిచి,ఒక శిలావేదిక కనిపించగా దానిపైన కూర్చుని,తన తండ్రి మరణానికి దుఃఖిస్తున్న సమయంలో, ప్రాస్పరో మిరాండాలు ఆ దారిన వచ్చారు

మిరాండా, ,తన తండ్రిని తప్ప, అన్యమానవుని చూచి యెరగదు సుందరుడైన ఈ యువరాజును చూచి అత డొక దేవతాపురుషుడని భ్రమించింది యువరాజుకూడ మిరాండాసౌందర్యానికి ఆశ్చర్యచకితుడై, ఆమె దేవదూత అనే భావిం

బాలగేయం:

పాపాయి పాట

శ్రీ నండూరి రామమోహనరావు

అందాల పాపాయి
అవతరించాడండి;
అమ్మలక్కల్లార!
అందరూ రారండి.

* * *

బోసినోటిని విప్పి
ముసిముసిగ నవ్వాడు;
నవ్వులే వెన్నెలై
నాట్యాలు చేశాయి.

* * *

మల్లె మొగ్గల వంటి
బుల్లి గుప్పిళ్ళలో
దాచుకున్నాడేదో
దోచుకోకండెవరు.

* * *

చంద్రలోకపు దారి
జారివచ్చాడేమొ?
నలుదిక్కులూ చూసి
తెల తెల్ల బోతాడు.

* * *

"పెరిగి పెద్దవ్వాలి,
పేరు పొందా" లంటు
అందరూపాపణ్ణి
ఆశీర్వదించండి.

* * *

అందాల పాపాయి
అవతరించాడండి.

* * *

చూడు. ప్రథమ దర్శనంలోనే ఆమెను ప్రేమించాడు. మరికొంత సేపటికి ఆమె దేవకన్య కాదని గ్రహించి, తన ప్రేమను ప్రకటించాడు ఫెర్డినాండ్.

ఈ యిరువురుయువతీయువకులూ ప్రేమించుకోవాలనే ప్రాస్పరో కోరిక. కాని అది షూఢ్యచ్ఛికమో లేక హృదయగతమైనదో గ్రహించటానికి, అతడు ఫెర్డినాండును పరీక్షించ డానికి నమకట్టాడు. తన అధీనంలోనుండి ఆ ద్వీపాన్ని కాజేయటానికి పంపబడిన గూఢచారి అని ఫెర్డినాండ్‌ను నిందించాడు. మొరటుగా ప్రాస్పరో యిట్లా అన్నాడు. "ఇలారా! నీ మెడకు, కాలికి ముడివేసి ఎండిపోయిన ఆకు అలంతో మేపుతాను. సముద్రం నిండా ఉన్నాయి నీళ్లు త్రాగటానికి"

ఈ మాటలకు యువరాజుకి చాలా కోపం వచ్చింది. వెంటనే ఒరలోని కత్తి దూసి పోరాటానికి సిద్ధపడ్డాడు. కాని ప్రాస్పరో మాంత్రికశక్తివల్ల కత్తి ఒరలోనుంచి రాలేదు. యువరాజు ఇది గ్రహించాడు. మాంత్రికునితో పోరాడ్డం వ్యర్థమని తలచి మిరాండాసౌందర్యవదనారవిందాన్ని చూస్తూ ఉండడానికి ఖైదీగానైనా-సరే ఉండడానికి సంకల్పించాడు.

తన తండ్రిప్రవర్తనకు అసభ్యప్రలాపానికీ మిరాండాసిగ్గు చెందింది. కాని ఆయనమాటలలో ఉన్న కాఠిన్యం హృదయంలో లేదనీ, ఆమాటలకు బాధపడవద్దనీ ఫెర్డినాండ్‌ను ఓదార్చింది మిరాండా. తరువాత ప్రాస్పరో, మిరాండాల వెంట వారినివాసానికి వెళ్లాడు ఫెర్డినాండు.

ప్రాస్పరో యువరాజుచేత ఎన్నో మోటుపనులు చేయించాడు. అతడు సంతోషంతో అన్నీ నిర్వర్తించాడు అతనికి కావలసినది ప్రియురాలిదర్శనం. అది నిత్యం లభ్యమౌతోంది. అందువల్ల చాకిరీ ఎంత కష్టంగా ఉన్నా లక్ష్యపెట్టలేదు.

ఇట్లా ఉండగా, నేపుల్సురాజు పుత్రమరణాని కెంతోవిచారమగ్నుడైనాడు. ఎందరు చెప్పనావినడు. ఏరియల్ వీళ్ళను మరింత బాధలు పెట్టింది. ఆకలితో బాధపడుతున్న వాళ్ళకి పంచభక్ష్యపరమాన్నాలు సిద్ధంచేసేది. పెద్ద ఆశతో వాళ్లు తినటానికి రాగానే ఒక పెద్ద గ్రద్దవలె వచ్చి తన్నుకుపోయేది. ఇట్లాంటి దుర్భరవేదనలకు గురిచేసి, ఇదంతా వాళ్లు ప్రాస్పరోకి చేసిన ద్రోహానికి ప్రతిఫల మని అవ్యక్తరూపంలో తెలియచెప్పింది. వాళ్లు తమ క్రూరకృత్యానికి పశ్చాత్తప్తులైనారు.

కొన్నాళ్ళకి ప్రాస్పరో తన తాంత్రికవేషంతో వాళ్ళకుప్రత్యక్షమైనాడు. వాళ్ళందరు అతని కాళ్లమైన పడి తిరిగి అతని రాజ్యాన్ని అతనికే ఇవ్వగలమనిచెప్పి ప్రాధేయపడ్డారు. ప్రాస్పరో అందు కంగీకరించాడు.

తరువాత ఆ పరివారాన్నంతా వెంటబెట్టుకుని,ప్రాస్పరో తనప్రాసాదానికి వచ్చాడు. నేపుల్సురాజును పిల్చి, తెర తొలగించి చూడమన్నాడు. లోపల తన కుమారుడు ఫెర్డినాండ్ మిరాండాతో చదరంగమాడటం రాజు చూచాడు. అతనికి ప్రాణాలు లేచివచ్చాయి తన కుమారుని ఆలింగనం చేసుకొని, మిరాండాను, తన ద్రోహానికి



పశ్చిమ గోదావరిజిల్లాబోర్డు హైస్కూళ్లన్నిటిలోను స్కూలుఫైనలు పబ్లిక్ పరీక్షలో 479 మార్కులువచ్చి, జిల్లాబోర్డ్ రోలింగుకప్పు గెలిచిన 'చిరంజీవి రామ్మూర్తి సుబ్రహ్మణ్యం, తణుకు హైస్కూలు విద్యార్థి.

క్షమించమని కోరాడు.

ఇంతలో ఏరియల్ ప్రయాణానికి సన్నాహం చేసింది. ఓడ సిద్ధంగా ఉంది. అందరూ తమ రాజ్యానికి పయన మైనారు. ప్రాస్పరో తన తాంత్రికవిద్యల నన్నిటిని విసర్జించాడు.

పడవ మిలాన్‌నగరం చేరింది. ఏరియల్ బా[illegible]త తీరిపోయింది. ఏరియల్ స్వాతంత్ర్యస్వేచ్ఛావాయువులు పీలుస్తూ, తుమ్మెదలలో తుమ్మెదయై ఆనందవిహారం చేస్తున్నది. ఫెర్డినాండ్, మిరాండాల వివాహం అతివైభవంగా జరిగింది. ఇటు తండ్రిరాజ్యానికీ, అటు మామ రాజ్యానికి ఫెర్డినాండ్ రాజైనాడు.

బాలానందం :

రత్నాల రాణి

పూర్వం రష్యా దేశంలో ఊరల్ పర్వతాల మధ్య ఒక గామంలో డానిలా అనే గొల్ల పిల్లవాడు ఉండేవాడు. అతడు ప్రతిరోజూ తన యజమాని పశువులమందను తోలుకొని అడవికి వెళ్లి, సాయంత్రానికి తిరిగివచ్చి యజమానికి అప్పగిస్తూ వుండేవాడు. పశువులు అడవిలో మేయుచుండగా డానిలా ఏ చెట్టుకొమ్మమీదనో కూర్చుని పిల్లనగ్రోవి వాయించే వాడు.

అతని పిల్లనగ్రోవి పాటకు పరవశమై అడవిలోని పక్షులూ, చిన్న చిన్న జంతువులూ అన్నీ చుట్టూ మూగి ఆ పాటను వినేవి. వీటితో పాటు, ఎక్కడో దూరంగా, మనుష్యు లెవరికీ కనిపించని ఒక పర్వతగుహలో నివసించే రత్నాల రాణి కూడా బల్లివేషంలో వచ్చి డానిలా పాటను వినేది. రత్నాల రాణి డానిలాను అతని చిన్నతనం నుంచే ఎంతో ప్రేమించింది. కాని డానిలా ఎప్పుడూ ఆమెను చూడ లేదు.

ఒకరోజున డానిలా పిల్లనగ్రోవి వాయిస్తూ తన్నుతాను మరచిపోయాడు. ఈలోగా అతడు కాసే ఒక ఆవును తోడేళ్లు వచ్చి చంపి ఎత్తుకుపోయాయి. డానిలా అజాగ్రత్తగా వుండి ఆవును పోగొట్టినందుకు యజమాని కోపంతో అతని చావగొట్టించాడు. డానిలాను ఆ ఊళ్లోనే వున్న ప్రోకోపిచ్ అనే ఒక శిల్పికి అప్పగించి, అతనికి బుద్ధి గరపమన్నాడు యజమాని. ప్రోకోపిచ్ రాళ్లను చెక్కి అందమైన వస్తువులుగా తయారు చెయ్యగలిగిన నేర్పుగల వాడు. అతనివద్దనే డానిలా పెరిగి పెద్దవాడయ్యాడు. ప్రోకోపిచ్ వద్ద రాళ్లతో చక్కని వస్తువులు తయారు చెయ్యటం నేర్చుకున్నాడు. అతని నేర్పును ప్రోకోపిచ్ మాత్రమే కాక ఊళ్లో అంతా మెచ్చుకుని చాల గొప్పవాడవుతాడన్నారు.

ఆ వూళ్లోనే కాత్యా అనే

శ్రీ నండూరి రామమోహనరావు

ఒక గొల్లపిల్ల వున్నది. కాత్యా, డానిలా రోజూ అడవిలో కలుసుకుంటూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. పిల్లనగ్రోవిమీద డానిలా ఎన్నో పాటలు కాత్యాకు నేర్పాడు. ఒకరోజున కాత్యా అడవిలో అందమైన ఒక పువ్వు కోసి డానిలాకిచ్చింది. అంత చక్కని పువ్వును డానిలా ఎన్నడూ చూడలేదు. కాని అంత అందము సాయంత్రానికల్లా మాయమైపోతుంది; పువ్వు వాడి, వడిలి, నల్లబడిపోతుంది; ఇంక ఆ అందము మళ్లీ రాదు; అని ఆలోచించి దిగులుపడ్డాడు డానిలా.

ఆ అందాన్ని ఎలాగైనా శాశ్వతంగా వుండేటట్లు చెయ్యాలి. అందుకని ఆ పువ్వుని ఇంటికి తీసుకువెళ్లి సరిగ్గా ఆ పువ్వుమాదిరిగానే ఒక రాతిపువ్వును చెక్కడం మొదలెట్టాడు. ఆ రాతిపువ్వును పూర్తిచేసిగాని కాత్యాను చూడగూడదనీ, ఆ పువ్వు నామెకు బహుమతిగా ఇవ్వాలనీ అతని సంకల్పం. దాన్ని పూర్తిచెయ్యటానికి ఆరునెలలు పట్టింది. కాత్యా పాపం ఇంకా వస్తాడు, ఇంకా వస్తాడు అని రోజూ అడవిలో కూర్చుని, ఎదురు చూసి, విచారంతో వెళ్లిపోయేది.

చివరికి రాతిపువ్వు తయారైంది. దూరానికి ఆ పువ్వు నిజమైన పువ్వులాగానే కనిపించింది. ఊళ్లో అందరూ ఆ పువ్వుని చూసి డానిలా నేర్పును ఎంతో పొగిడారు. కాత్యా కూడా వచ్చి చూసి దానిని మెచ్చుకున్నది. కాని డానిలా కది నచ్చలేదు. తను ఎంత రాత్రింబగళ్లు కష్టపడి పనిచేసినా దానికి ప్రాణం తేలేకపోయాడు. రాతిపువ్వు ఎంత అందంగా వుంటే నేమి, ప్రాణం లేకపోతే ఒట్టి రాయేగదా! అనుకుని మళ్లీ దిగులుపడ్డాడు.

కాత్యాతండ్రి కాత్యా, డానిలాల ప్రేమను అంగీకరించి, వారిద్దరికీ పెళ్లి చేశాడు. పెళ్లి ఎంతో వైభవంగా, ఎన్నో వేడుకలతో జరిగింది.

ఇద్దరూ ఈడూ, జోడైన వారని అంతా సంతోషించారు. తను చిన్నప్పటినుంచి ప్రేమించిన వానిని పెళ్లి చేసుకున్నాను గదా అని కాత్యా ఎంతో సంబరపడింది.

కాని డానిలా మనస్సులో దిగులు ఎవరికి తెలుసు? ప్రాణం గల శిలాపుష్పాన్ని సంపాదించాలని అతని కొరకేఆవేదన. అది ఎక్కడ దొరుకుతుంది? డానిలా

పెళ్లివేడుకలనుంచి తప్పించుకుని, మెల్లిగా వచ్చి ఇంటిబయట ఒంటరిగా కూర్చున్నాడు. చుట్టూ చీకటిగా వున్నది.

ఆ చీకట్లో మెల్లగా వెలుగు కానవచ్చింది. చెట్లు,తీగలూ, పువ్వులూ ఇదివర కెప్పుడూ చూడని వింత రంగులతో మెరిసిపోతున్నాయి. డానిలా ఇదంతా చూసి ఆశ్చర్యపోయాడు, కలా, నిజమా, అని. కల



కాదు, నిజమే నంటూ చెట్లమధ్య రత్నాల రాణి ఒయ్యారంగా ప్రత్యక్షమైంది. డానిలాను రత్నాలరాణి చాలాకాలం నుంచి ఎరుగును. అతనిని ప్రేమించింది కూడాను. డానిలా కామె క్రొత్త. ఇదివర కెప్పుడూ ఆమెను చూడలేదు

"ఎవరు నువ్వు?" అని అడిగాడు "దూరంగా ఎవ్వరూ ఎరగని పర్వతగుహలో నివసించే రత్నాలరాణిని" అన్న దామె.

"ఎందు కిలా వచ్చావు?" అన్నాడు డానిలా.

"నీ సంగతి నాకంతా తెలుసు నువ్వు ప్రాణంగల శిలాపుష్పంకోసం వెదుకుతున్నావుకదూ. నా గుహలో అలాంటి పువ్వున్నది. నాతో రా, దాన్ని నీ కిస్తాను." అన్న దామె.

డానిలా తన భార్యనీ, బంధువులనీ, గ్రామాన్నీ వదిలిపెట్టి రత్నాలరాణి వెంబడి పోయాడు. ఆమె అతన్ని ఎన్నో అడవులు, కొండలు, నదులు దాటించి తాను నివసించే పర్వతగుహకు తీసుకుపోయింది. ఆ కొండఅంతా రాగికొండే. అందులో ఎక్కడ చూసినా రత్నాలు, వజ్రాలు, వైడూర్యాలు ధగధగ మెరిసిపోతున్నాయి. డానిలా కళ్లు చెదరిపోయాయి ఆ గుహావైభవం చూసి.

గుహాలోపలిదాకా డానిలాను తీసుకు వెళ్లింది రత్నాలరాణి. అక్కడ డానిలా ఎన్నో రోజులు కష్టపడి ఒక రాతిస్తంభంలో ఒక పెద్ద పువ్వును చెక్కాడు. తన నేర్పునంతా చూపి ఎంతో అందంగా ఆ పువ్వును తయారుచేశాడు. తన నేర్పుకు తానే ఆశ్చర్యపోయాడు డానిలా. కాని అంతకంటే ఆశ్చర్యంగా, కొంతసేపటి కల్లా ఆ పువ్వు నిజమైన పువ్వుగా మారిపోయింది. ఘుమ్మనివాసన, రంగు రంగుల కాంతులు ఆపువ్వు విరజిమ్మింది. ఇదంతా రత్నాలరాణి ప్రభావమే.

రత్నాలరాణి ఎలాగైనా డానిలాను పెళ్లిచేసుకోవాలనే అతన్ని తన గుహకి తీసుకొచ్చింది. పువ్వు పూర్తి కాగానే డానిలా తన యింటికి వెళ్లిపోతా నన్నాడు. అప్పటి కతనికి తన కాత్యా జ్ఞాపకం వచ్చింది. కాని రత్నాలరాణి అతన్ని యింటికి పోనివ్వలేదు. "నిన్ను ప్రేమించాను నన్ను పెళ్లిచేసుకోవా?" అని అడిగింది.

"నేను ఇదివరకే కాత్యాని పెళ్లి చేసుకున్నాను." అన్నాడు డానిలా.

దాంతో రత్నాలరాణికి కోపం వచ్చి అతడిని ఆ గుహనుంచి కదలకుండా బంధించివేసింది.

అక్కడ డానిలా ఊళ్లో కనిపించకపోయేసరికి కాత్యా నిద్రాహారాలు మాని, ఏడుస్తూ వెదకటానికి బయల్దేరి కొండలు, నద

కష్టాలు పడుతూ వెదికింది. ఆమె డానిలా ఉన్న చోటు కనుక్కుంటే డానిలా తనకు దక్కుడని, రత్నాల రాణి కాత్యామార్గంలో ఎన్నో అడ్డాలు, అఖాతాలు, పాములు, మంటలు కల్పించింది. అన్నిటినీ కాత్యా తన పతిభక్తిచేత దాటుకుంటూ డానిలా ఉన్న గుహను చేరుకుంది.

'డానిలా! డానిలా!" అని కాత్యా వేసే కేకలు విని డానిలా, "కాత్యా, కాత్యా!" అని మళ్లీ కేకలు వేశాడు.

రత్నాలరాణి వాళ్లిద్దరి ప్రేమనీ చూసింది. ఇంత గొప్ప ప్రేమ గలవాళ్లని తను విడదీయడం మహాపాప మనుకుంది. అప్పుడు డానిలాను ఖైదునుంచి విడిపించింది. డానిలా పరుగుపరుగున పోయి కాత్యాను కౌగలించుకున్నాడు.

తను చేసిన పనికి రత్నాల రాణి పశ్చాత్తాపం పొందింది. భార్యాభర్తల నిద్దరినీ కలిపి వాళ్లని వాళ్ల ఊరివరకూ సాగనంపి వచ్చింది. వాళ్లకి తాను జ్ఞాపకం ఉండేందుకు, చాల విలువగల రత్నాలు, మణులు, ఒక దంతపు పెట్టెలో పెట్టి బహుమతిగా యిచ్చింది. కాని డానిలాపై తన ప్రేమను పోగొట్టుకోలేకపోయింది. అతనికి బదులుగా, అతడు తన గుహాలో చెక్కిన పువ్వును చూసుకుంటూ కాలం గడిపింది. డానిలా కాలం గడిచినకొద్దీ శిల్పకళలో సంపాదించి గొప్పవా అతని కథని వాళ్ల పూళ్లో గొడ్లకాపరిపిల్లలు పశువుల మందను అడవికి తోలుకువెళ్లి చెట్ల కింద కూర్చున్నప్పుడల్లా ఇప్పటికీ చెప్పుకుంటూనే ఉంటారు.

[ఒక రష్యన్ కథ]

కోళ్ళ కాపరి

శ్రీ కె. రాధాకృష్ణయ్య

పూర్వం ఒకానొకప్పుడు ఒక పట్నాన్ని ఒక రాజేలుతున్నాడు. ఆయనకు లేక లేక ఒక్క కూతురు కలిగింది. ఆమె పుట్టిన కొద్ది కాలంలోనే రాజు చనిపోయాడు. రాణి ఆ అమ్మాయిని అతి గారాబంతో పెంచింది. యువరాణికి యుక్తవయస్సు రాగానే ఒక రోజున రాణి ఆమెను చక్కగా సింగారించి, వ్రేలికి ఉంగరం పెడుతూ, "అమ్మాయి! నేను పెద్దదానినయ్యాను. నీకు యుక్తవయస్సు వచ్చింది. నిన్ను ఒక అయ్య చేతిలో పెట్టాలి. ఈ దేశంలోనే ఒక పట్నంలో ఒక రాజున్నాడు. అతడు మనకు ముఖ్యస్నేహితుడు. ఆయన కుమారుడు ప్రతిభాశాలి. బలవంతుడు. అందగాడు. ఆ రాజుగారి దగ్గరకు నీవు 'ఫాలదా' అనే మన గుఱ్ఱముమీద శీఘ్రంగా వెళ్ళి, ఫలాని రాణి కుమార్తెనని చెప్పినట్లయితే, నిన్ను ఆదరించి, తన కుమారుడికి నిన్నిచ్చి వివాహం చేస్తాడు. కనుక నీకు ఒక సేవకురాలిని తోడు బంపుతాను. నీవు వుంగరాన్ని జాగ్రత్తగా వుంచుకొని పోయిరా అమ్మా. నాకు పూర్వపు ఓపిక, బలం పోయినవి. నీవు ఆ రాజకుమారుని వివాహమాడి, మీరిద్దరు ఆ రాజ్యమును మన రాజ్యమును పరిపాలించండి. నీవు తిరిగి వచ్చే వరకు నేను జీవించివుండగలనో లేనో తెలియదు. జాగ్రత్తగా పోయిరా అమ్మా" అని, చెప్పి కొంతధనమిచ్చి, వెంట ఒక చెలికత్తె నిచ్చి, సాగనంపింది.

యువరాణి, 'ఫాలదా' అనే గుఱ్ఱముమీద, సేవకురాలు మరియొక గుఱ్ఱముమీద పోతున్నారు. సేవకురాలు యువరాణికంటే వయస్సులో పెద్దది. కొంచెము అందగత్తె నని చెప్పవచ్చు. రాణి నెలాగైనా మోసపుచ్చి, రాణి చెప్పిన రాజకుమారుని తాను వివాహ మాడాలని నిశ్చయించుకుంది. ఒక నదిదగ్గర నీరు తాగుతుండగా, యువరా ఉంగరం నదిలో పడిపోయింది. సేవకురాలు రాకుమారితో "నీవు నీదస్తులు ఆభరణాలు, నీ గుఱ్ఱము నాకిచ్చి, నాదుస్తులు నీవు ధరించి, నా గుఱ్ఱము నీవు తీసుకో. రాజకుమారుని నేను వివాహమాడతాను. నీవు అట్లా యివ్వనట్లయితే, నిన్నిక్కడే చంపేస్తాను" అని బెదిరించింది. ప్రాణం మీద ప్రీతిచేత తన దుస్తులు గుఱ్ఱము, సేవకురాలికిచ్చి, ఆమె దుస్తులు ధరించి ఆమె గుఱ్ఱము ఎక్కింది రాకుమారి. సేవకురాలు రాణిగుఱ్ఱమైన 'ఫాలదా' మీద యెక్కి, అతివేగంతో రాజుగారి మేడ చేరుకుంది. రాణికూతురునని చెప్పింది. ఆ వృద్ధరాజు ఆమెను ఆదరించాడు. తర్వాత కొంతసేపటికి సేవకురాలి దుస్తులలో ఉన్న యువరాణి గాజుగారి మేడవద్దకు వచ్చింది. "అనాథయైన ఒక స్త్రీని రక్షించేవారెవరూ ఈ పట్టణంలో లేరా" అని దీనంగా అంటూ, రాజుగారి మేడ ప్రక్కగా ఆమె వెళుతున్న సమయంలో, వృద్ధ రాజు ఆమెను పిలిపించాడు. ఆమె అందానికి ఆశ్చర్యపడ్డాడు రాజు. "అమ్మాయీ. నీ కేమి కావాలి" అన్నాడు. "ఏదైన చిన్న పని యిప్పించండి చేస్తాను" అన్నది. సుకుమారిలాగుందనుకొని రాజు, "నీవు మా కోళ్లను కాపలా కాస్తూ ఉండు" అని చెప్పాడు.

మాయ రాజకుమారి ఈమె కూడా అక్కడకు వచ్చినట్లు తెలుసుకుంది. తాను ఎక్కివచ్చిన గుఱ్ఱము 'ఫాలదా' యువరాణిది. ఆ గుఱ్ఱం మనిషిలాగ మాటాడగలదు. తన గుట్టు యెక్కడ బయట పెడుతుందోనని, ఆ గుఱ్ఱాన్ని చంపివేయమని మాయ రాకుమారి సేవకులకు ఆజ్ఞ ఇచ్చింది. సేవకులు గుఱ్ఱాన్ని తీసుకుపోయి మాలవానికిచ్చి చంపెయ్యమన్నారు. రాజుగారి కోళ్లు వుండే చోటుకు పోతున్న రాజకుమారికి ఈ సంగతి తెలిసింది. మాలవాని దగ్గరకు పోయి, "గుఱ్ఱాన్ని చంపినతర్వాత, దాని తలనాకియ్యి, మంచి గుఱ్ఱ మది.

జ్ఞాపక చిహ్నంగా వుంచుకుంటా"ను అని అడిగింది. మాలవాడు గుఱ్ఱాన్ని చంపి, తలను ఆమెకు యిచ్చాడు. ఆమె కోళ్లు వుండే యింటివాకిటి ముందర ఒక మేకుకు ఆ తలను తగిలించింది.

ఆమెతోపాటు ఒక కుఱ్ఱవాడు కూడ కోళ్లను కాస్తుండేవాడు. ఇలా వుండగా ఒక రోజున మాయరాణి రాజకుమారిని రహస్యంగా పిలిపించి తన గుట్టు బయల్పరచినట్లయితే బ్రతకనివ్వనని హెచ్చరించింది.

రోజూ రాజకుమారి తనతో వుండే కుఱ్ఱవానితో ఉదయం కోళ్ళను తీసుకొని, సమీపాన వుండే నది గట్టుకు పోయేది. సాయంకాలం నదిలో స్నానం చేసి, కోళ్లతో ఇంటికి వస్తుండేది. ఆమె రోజూ ఉదయం కోళ్ల కాపలాకి పోయే ముందు, తర్వాత సాయంకాలం, ఆమె స్నానం చేసేటప్పుడు, విచిత్రసంఘటనలు జరుగుతుండేవి. ఆమె ఉదయం నదిగట్టుకు పోయేముందు, గుమ్మందగ్గర మేకుకు తగిలించివున్న గుఱ్ఱపు తలతో, "ఫాలదా! ఫాలదా! ఇప్పు డెక్కడున్నావు?" అనిఅడిగేది. "మీ అమ్మ యిప్పుడు నీస్థితి చూడగలిగినట్లయితే ఎంత విచారించేదో" అని గుఱ్ఱపుతల చెప్పేది.

ఆమె సాయంకాలం నదిలో స్నానంచేసేటప్పుడు తనతోకూడా వుండే కుఱ్ఱవాడు సమీపంలో వుండేవాడు. ఆమె "తలపాగ, తలపాగ యెగిరిపో" అనేది. ఆ కుఱ్ఱవాని తలపైన వుండే తలపాగ పైకెగిరి పోయేది. అతడు ఆశ్చర్యంతో తలపాగా కోసం కొంతదూరం పరిగెత్తి వెళ్లి పట్టుకుని తీసుకొని నదిగట్టుకు వచ్చేసరికి, రాజకుమారి స్నానం పూర్తిచేసి ఇంటికి వెళ్ళడానికి సిద్ధంగా వుండేది. కుఱ్ఱవాడు, ఆమె కలిసి కోళ్ళను తీసుకుని ఇంటికి పోయేవారు ప్రొద్దుకుంకేసమయానికి. ఇలా రోజూ జరుగుతుంటే ఆ కుఱ్ఱవానికి ఆశ్చర్యంగా ఉంది.,



ఒకరోజున అతడు రాజుగారివద్దకు వెళ్ళి విషయమంతా చెప్పాడు. వృద్ధరాజు మొదట నమ్మలేదు. తర్వాత ఒకరోజు ఉదయమే సంగతేమిటో తెలుసుకుందామని, వృద్ధరాజు కోళ్లుండే చోటికి వచ్చాడు. చచ్చిపోయిన గుఱ్ఱపు తల గుమ్మం దగ్గర ఉన్నది. చూశాడు. రాజకుమారి బయటికి వచ్చి "ఫాలదా! ఫాలదా! ఎక్కడున్నావు" అని అడిగింది. "మీ అమ్మ యిప్పుడు నీస్థితి చూడగలిగినట్లయితే ఎంతగా విచారించేదో" అన్నది గుఱ్ఱపుతల.

రాజుకు ఇది ఆశ్చర్యం కలిగించింది. ఆ అమ్మాయిదగ్గరకు వచ్చి "ఏమిటమ్మా ఇది. చచ్చి పోయిన గుఱ్ఱపు తల ఎలా మాటాడగలుగుతోంది! అసలు సంగతేమిటి? నీ వెవరు?" అని తరచితరచి అడిగాడు రాజు. రాజకుమారికళ్లు నీళ్లతో నిండిపోయాయి. తన కథనంతా చెప్పుకుంది. రాజు చాల విచారపడ్డాడు. ఆమెను అంతఃపురానికి పిల్చుకొనిపోయి, రాణీవేషంలో ఉన్న సేవకురాలిని "నీ వెవరు నిజం చెప్పు" అని గద్దించాడు. యువరాణి వెలవెలపోయింది. ఆమెను ఖైదులో వుంచి మరుచటిరోజు ఉదయం సభ చేసి, రాజు సంగతంతా చెప్పి, తర్వాత తన కుమారునికి నిజమైనరాకుమారినిచ్చి వివాహంచేశాడు. సేవకురాలికి ఉరిశిక్ష విధించాడు. కాని యువరాణి "ఇహనైనా బుద్ధిమార్చుకొని బ్రతుకుతుందేమో ఆమెను విడిచిపెట్టండి. ఈ సంతోష సమయంలో ఆమెను దుఃఖపెట్టడమెందుకు?" అన్నది. రాజు ఆమె ఔదార్యానికి మెచ్చుకొని, సేవకురాలిని విడిచిపెట్టాడు. సేవకురాలు యువరాణికాళ్ళమీద పడి క్షమాపణ వేడుకొని ఆమెవద్దనే సేవ చేస్తూఉంది. యువరాజు యువరాణి వృద్ధరాణీగారి పట్టణానికి వెళ్లాడు. వృద్ధరాణి మంచం పట్టింది. ఆమె కూతుర్నీ, అల్లుని చూచి సంతోషించి "మీరుసుఖంగా ఆ రాజ్యము ఈరాజ్యమూ పరిపాలించండి" అని చెప్పి ప్రాణాలు విడిచింది. యువరాణీ,యువరాజు, రెండు రాజ్యాలూ పరిపాలిస్తూ సుఖంగా వున్నారు.

ఆంటన్ చెకోవ్

(16 వ పేజీ తరువాయి)

మేధావంతులను, ధనికతరగతిలోని సోమరులను, తక్కువతరగతి ప్రజలను వేళాకోళంగా, అణచివేసే భూస్వాములను, సాంఘిక సమస్యలకేసి ఒక్కసారైనా చూడని రష్యన్‌రచయితలను అతడు తన రచనల్లో అతినూత్నమైన దెబ్బలు తీశాడు. అయోనిచ్, గూస్ బెర్రీ, గ్రామర్ టీచర్ అనే అతని ఉత్తమకథల్లో సంకుచితవాదులమీద ఎంత తీవ్రవిమర్శ చేశాడో కనిపిస్తుంది.

ఒక వినూత్న జీవితం ఉదయిస్తున్నదనీ, సంకుచితవిశ్వాసాలు, విధానాలు దాని ముందు నశిస్తాయనీ, నిజమైన మానవత్వం, సౌందర్యం ఉద్భవిస్తాయనీ చెకోవ్ గ్రహించాడు. రష్యాభవిష్యత్తులో అతనికి అచంచలవిశ్వాసం ఉంది.

“ఒక్కొక్క రోజు గడుస్తుంటే మన విజయం దగ్గిరపడుతున్నట్లు అనిపిస్తున్నది. ఆ విజయం చూసేదాకా జీవించాలని, ఆ విజయంలో నేనుకూడా పాల్గొనాలని, నా ఆశ.” అని ఒక కథలో ఒక పాత్రచే అనిపిస్తాడు.

“సమయం వచ్చింది. ఒక మహాశక్తి నేలమీదకు దిగివస్తోంది. శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన తుపానొకటి ముంచుకు వస్తోంది. త్వరలో అది మన సమాజంమీదుగా వీచి మన అలసతని, నిర్లక్ష్యాన్ని మన నిరుత్సాహాన్ని, అన్నిటినీ తుడిచిపెట్టివేస్తుంది... 25, 30 ఏళ్లతరువాత ఈ దేశంలో ప్రతిమనిషి కష్టపడి పని చేస్తాడు, ప్రతిమనిషి...” అని మరొక కథలో అనిపిస్తాడు.

చెకోవ్ సోవియెట్‌ప్రజలకి చాల యిష్టుడు. లెనిన్ స్టాలిన్‌లు చెకోవ్ రష్యన్ ప్రతిభకు ప్రతినిధి అన్నారు. అతని రచనలు ఈరోజుకీ ఎన్నో ప్రతులు అమ్ముడుపోతూనేవున్నాయి. ఇప్పటికీ అతని నాటకాలు విరివిగా ప్రదర్శితమౌతూ ప్రజలకానందం చేకూరుస్తూనే వున్నాయి. అతని జీవితంమీద, రచనలమీద, ఇంకా పరిశోధనలు జరుగుతూనేవున్నాయి.

ఆంటన్‌చెకోవ్ సాహిత్య ప్రభావం పశ్చిమయూరప్‌లో కూడా ఒక్క సాహిత్యంలోనే కాక మిగతారంగాల్లోకూడా గాఢంగా పడింది. బెర్నార్డ్‌షా తన “హార్ట్ బ్రేక్ హౌస్” అనే నాటకం చెకోవ్ ఆవేశంలోపడి వ్రాసిందే నన్నాడు...

చెకోవ్ సాంఘిక దృక్పథం

“మీరు భయపడకండి. మంచిరోజులు వస్తాయి. కొత్త జీవితం ఉదయిస్తుంది. సత్యం జయిస్తుంది” అని ఒక కథలో చెకోవ్ అన్నాడు.

ఆరోజుల్లో కుళ్లిపోయిన సంఘధర్మాని మీద చెకోవ్ తన కథలను కత్తులుగా విసిరాడు. ‘గూస్ బెర్రీ’ అనే కథలో ఇట్లా అంటాడు.

“తృప్తిగా ఆవులిస్తూ హాయిగా నిద్రపోయే ప్రతిమనిషియింటి తలుపుల్ని సమ్మెటతో కొట్టి, అతన్ని లేపి, ప్రపంచంలో దుర్భరజీవితాలతో కృశించి క్రుంగిపోయే జనులున్నారనీ, ఆ మనిషి తనకుతానెంత సుఖంగా వున్నా జీవితం అతన్ని ఎప్పుడో గుప్పిలిలో బిగించివేస్తుందనీ, ఏదో వ్యాధి, దారిద్ర్యం, ఏదో దుఃఖం అతన్ని ముట్టడించివేస్తుందనీ, ఇప్పుడు అతనికి మల్లేనే అప్పుడు ప్రపంచం అతనికేసి కన్నెత్తి చూడదనీ, ఎవరన్నా జ్ఞాపకం చేస్తే ఎంత బాగుండును!”

చెకోవ్ అల్లాంటి తృప్తజీవులకు, అలసులకు, స్వార్థసౌఖ్యలాలసులకు, సమ్మెట మనిషిలాగా ప్రవర్తించాడు. సంఘపీడితులైన శ్రామికుల దుర్భరజీవితాలను, వారి బానిసత్వాన్ని పదేపదే తన కథల్లో చిత్రించాడు. మన కర్మ అనుకుని కుమిలిపోయే వారిలో ఉద్రేకాన్ని రెచ్చగొట్టాడు. జార్ పరిపాలనమీద విద్వేషం పురికొల్పాడు.

దుర్మార్గాన్ని ప్రతిఘటించవద్దని, నైతిక ఔన్నత్యానికి ప్రయత్నించాలనీ, టాల్‌స్టాయి బోధించిన సిద్ధాంతాలను చెకోవ్ తీవ్రంగా ఖండించాడు. గూస్‌బెర్రీకథలో ఒక పాత్ర ఇలాగంటాడు. “మనిషికి ఆరడుగుల నేలకంటే ఎక్కువ అక్కర్లేదని కొందరంటారు. కాని, ఆరడుగులనేల కావలసింది మనిషికి కాదు, శవానికి.” (టాల్‌స్టాయి మనిషికి ఆరడుగులనేల చాలని ఒక కథ వ్రాశాడు.)

నగరాలనుంచీ, సంఘర్షణనుంచీ, జీవితపు హాయిత్వాన్నుంచీ పారిపోవడం కాదు మన ఆదర్శం. అది స్వార్థపరత, అలసత. మనిషికి కావలసింది ఆరడుగుల నేల కాదు. ఒక పల్లెటూరు కాదు. భూగోళమంతా “ప్రకృతి యావత్తూ, తన మేధాశక్తిని, ఆత్మ గొప్పతనాన్ని ఇముడ్చుకొనే విశ్వమంతా అతనికి కావాలి.” అని ఆ కథలో అంటాడు.

శ్రమవల్ల, ప్రకృతితో పోరాడి జయించటంవల్ల మనిషి పురోగమిస్తాడని చెకోవ్ తన కథల్లో వ్రాశాడు. జీవితాన్ని మార్చివెయ్యాలంటాడు చెకోవ్. అతడు విప్లవవాది కాకపోయినా సంఘంలో పూర్తిగా మార్పులు తెస్తేనే గాని భవిష్యత్తు ఉజ్వలం కాజాలదని నమ్మాడు. “మైలైఫ్” అనే నవలలో ఒక పాత్ర ఇలాగంటాడు. “పోరాటానికి మనం కొత్త మార్గాలు, బలమైన, సాహసోపేతమైన, శీఘ్రమైన మార్గాలు వెతుక్కోవాలి. నువ్వు నిజంగా ప్రయోజనకారి కావాలంటే నీ చవకబారు సరిహద్దుల్ని దాటి బయటికి రా. ప్రజల్లో తీక్షణావేశాన్ని పురికొల్పు.”

చెర్రీఆర్చర్డ్ అనే గొప్పనాటకంలో జీవితాన్ని కొత్తగా నిర్మించాలన్న చెకోవ్ ఆవేదం కనిపిస్తుంది. “పదండి ముందుకు. దూరంగా, ఉజ్వలంగా ప్రకాశించే నక్షత్రంకేసి పోదాం పదండి... రష్యాయావత్తూ మన ఉద్యానవనం” అంటాడు ఒక పాత్ర.

రష్యాదేశపు ప్రకృతిసౌందర్యాన్ని, విశాల మైదానాల్ని, అంతు లేని స్టెప్పీ బయిళ్ళని, పర్వతాలని చెకోవ్ తరుచు తన కథల్లో మనోహరంగా వర్ణిస్తాడు.

మనిషిప్రవర్తనకు సత్యం అన్నిటికంటే ఉన్నతాదర్శమని చెకోవ్ విశ్వసిస్తాడు. “మై లైఫ్” లో ఒకపాత్ర “తీగలను చీడ తినివేస్తుంది. ఇనుమును తుప్పు తినేస్తుంది. ఆత్మని అసత్యం తినేస్తుంది” అంటాడు.

చెకోవ్‌కు విశాలమైన సాంఘికదృక్పథం వుంది. మనిషిని మనిషిగా గౌరవించే జీవితం, శ్రమని గౌరవిస్తూ, నిరంకుశత్వాన్ని, బానిసవిధేయతని నిరసించే జీవితం, కొత్తరకంజీవితం ఎప్పుడు వస్తుందా అని చెకోవ్ కలలు కన్నాడు. అందుచేతే అతని కళ సోవియెట్‌యుగానికి సన్నిహిత

(34-వ పేజీ చూడుడు)

బేసిక్

(10-వ పేజీ తరువాయి)

చుక్కాచుంది. బానెట్టు యెత్తి యింజనులో బుర్ర పాతేసుకున్నాడు. డ్రైవరు రోగిమంచము వొదిలివేసి డాక్టరు మట్టు మూగినట్టు జనం యావత్తూ డ్రైవర్ని చుట్టేసేసేరు.

అరమైలు దూరంలో యెక్కడో నుయ్యి వున్న జ్ఞాపకంట. అక్కడికి వెళ్ళి గంగ తెచ్చి మళ్లీ ప్రాణప్రతిష్ఠాపన చెయ్యాలంటే యెలాగ లేదన్నా గంటపైగా పడుతుంది. ఈలోగా టయిము వేస్టు!

బేసిక్ యిన్‌స్ట్రక్టరుకీ యేమీ పాలుపోయింది కాదు. దిగాలుపడి చూస్తూ వుంటే వెంకయ్యగారి మొహం కంటపడింది. వయసుచెల్లినవాడుగదా అని ఏదో ధోరణి ఆరంభించేడు. అంతకన్నా అదను మరి దొరక దనుకున్నాడు వెంకయ్యగారు. ఉదయాన్నుంచీ కాల్చుకు తింటూన్న ఆ కుక్రకుంకలు దారీ తెన్నూ తెలీకుండా పడి వుంటే, తనూ అని ముందుకి వచ్చి మొనగాడై నిలవాలి. అసలు తను అలా అవడానికే భగవంతుడు యీ అవకాశం కల్పించాడేమో!

"గట్టి చిక్కు వచ్చిపడింది. ఏమిటండీ సాధనం?" అని బేసిక్కుమాస్టరు ఓ ముక్క అన్నాడో లేదో—

"ఓస్ యింత మాత్రానికే నటండీ. బస్సు బాగుపడేసరికి ఎలాగా పది దాటిపోతుంది. ఈలోగా మనం పని ముగించుకోవచ్చును."

"వాళ్లు లేకుండా పని యెలా ముగించేస్తారండీ? డ్రైవరుకీ కండక్టరుకీ తప్ప మనకా కోదుభాష రాదాయె."

"మనవి చేస్తున్నాను కాదూ. వాళ్లు నీళ్ళూ నిప్పులూ తెచ్చి అవస్థపడే లోపల మనం కాలినడకని ప్రయాణం సాగిద్దాం. కాలిబాటలమ్మటే అడ్డుగా వెళితే సరి. మనం అలాగ వెళ్లి వాళ్ళ గుడిసెలూ గుడారాలూ అవీ చూసి నోట్సు రాసుకునే లోపల వాళ్లూ వస్తారు."

ఏ ముహూర్తాన అన్నాడో ఆ మాట. ఉత్తరక్షణంలో కవినిమ్మపండు ఘనమైన లీడరయి వూరుకున్నాడు. అతను ముందు నడుస్తుంటే—అమ్మవారి సంబరంలో పులివేషం వెనకాల జనంలాగ—మిగతా జనాభా అంతా అడుగుల్లో అడుగు వేసుకుంటూ కాలిబాటమ్మటే వొస్తున్నారు. సగర్వంగా వెనక నున్న పరివారాన్ని చూసి మురిసిపోతూ, మీసాలు సవిరించుకుంటూ అడుగు జభరుగానే పడనిచ్చేడు వెంకయ్యగారు.

నడుస్తున్నకొద్దీ పల్లె దూరమైపోతూన్నట్టే అనిపించింది. "రోడ్డుకి అట్టే దూరం లేదనుకున్నాం కదుటండీ?" బేసిక్ మాస్టరు పృచ్ఛించేడు.

"పల్లెటూరిలో పుట్టి నాటుదార్లలో తిరుగాడినవాణ్ణి నేనున్నానుగా. మరేం భయం లేదు, అడుగు పడనివ్వండి"అంటూ విసవిస సాగిపోతూనే వున్నాడు లీడరుగారు.

ఆషాఢమాసం. మబ్బు విడిచిన యెండ బుర్ర మాడ్చేస్తోంది. రాసుకున్న స్నో కాస్త కరిగిపోగా చెక్కిళ్లు జేవురించి, నుదుటనుంచి జారిన కుంకుమబొట్టుతో ఏకమైపోయి రౌద్రలక్ష్మి తాండవించింది విద్యార్థినుల వదనకమలాలమీద. తలలో తురిమిన పూవులతోపాటు ఆ ముఖకమలాలు వాడిపోయినాయి. ఇహ మొగకుర్రవాళ్ల చేరుమాళ్లయితే పంట్లాంజేబుల్లోంచి మొహాలమీదికీ, మొహాలమీన్నుంచి పంట్లాంజేబుల్లోకీ—క్రికెటుఆటలో పరుగుల్లాగ—పరుగులెడుతూనే ఉన్నాయి. ఉదయాన్నే ఉప్మా ఒకటి సేవించేరేమో అందరికీ గొంతుకలు యెండిపోయేయి. మరి కొంతసేపటికి కాస్సేపు విశ్రమిస్తేనేగాని యింక నడవలేం అంటూ గోల బయలుదేరింది. ఆదిలో కాస్త బెట్టుచేసినా ఆ అవస్థలో వెంకయ్యగారికీ కష్టమే ననిపించింది.

"సరే ఈ చింతతోపులో కూర్చుందాం రండి" అంటూ విశ్రమించేడు. సుంద్రంగా సున్నా చుట్టినట్టుకూచున్నారు పదిమందినీ. ఎక్కడా పిట్టమనిషి సంచలనం లేదు. పక్కనున్న కొండవాళ్లలో ఎండ మిలమిలా మెరిసిపోతోంది. చుట్టుపక్కల అంతా దివ్వు దివ్వుమంటూ వాళ్ల ఒంటరితనం ద్విగుణీకరిస్తోంది.

"ఈపాళంగా కోదువాళ్లు మనల్ని చుట్టేసి మహామ్మాయి చేస్తాం అంటే యేమిటి సాధనం?" అంటూ ఓ చొప్పదంటు ప్రశ్న వేసేడు ఓ కొంటె విద్యార్థి.

"మీ తెలివి తేటలు తెల్లారినట్టే ఉన్నాయి. ఇదేం కాఫీలు కాచుకుని తాగడం అనుకున్నారా యేమిటి? ఇంకా అరమైలు పోతేనేగాని లేదు కోదుపల్లె" పెద్ద ఆరిందాలాగ అన్నాడు వెంకయ్యగారు.

"నల్లగా జీడిగింజలాంటి కుర్రాడొకడు యిందాకా ఆ చెట్టుమీద కదిలినట్టయిందండీ"అంది కిరస్తానప్పిల్ల. అందరూ నడుములు వొంచి మెడలు పైకెత్తి ఆ చెట్టుకేసి చూసేరు.

"ఏడీ? వుంటే అవుపడ్డూ?" వెంకయ్య గర్జించేడు. కాని ఆయన మాట యింకా పూర్తిగాకముందే ఓ పది పన్నెండేళ్ల కోదుకుంటడు మానిపక్కనుంచి పరుగెత్తి పక్కనున్న డొంకలో అదృశ్యం అయిపోయేడు. అది నలుగురుకంటా పడింది. మళ్లీ చుట్టుపక్కల చీమ చిటుక్కుమన లేదు. ఏదో భీతావహం అనిపించింది నలుగురికిన్నీ. దానికి తోడు ఎండకి వొళ్లు చిటపటలాడుతోంది. దాహం, చెమటా, చికాకున్నూ గుండెల్లో చెప్పరాని భయాన్నే వేసింది.

"ఎందుకయినా మంచిదీ; కాస్త కాళ్లు కదిలిస్తూ వుంటేనే నయం"అన్నాడొక స్టూడెంటు.

"చాల్లేవోయ్. కాకపోయినా క్రూరమృగాల పాలయిపోయినట్టు అలా భయపడి పోతారేమిటి?" వెంకయ్యగారు మేకపోతు గాంభీర్యం కనపరిచేరు.

అంతట్లో ఎక్కణ్ణుంచో వచ్చి ఓ బెడ్డముక్క వాళ్ల మధ్యన పడింది.

"ఎవ్వడ్రావాడూ......" అంటూ నిల

(33-వ పేజీ తరువాయి)

మైంది. ఆరోజుల్లోని రష్యన్ సమాజంలో సంపూర్ణమైన మార్పు రావాలని ఎంత తీవ్రంగా ఆవేదన పడకపోతే చెకోవ్ ఈమాటలు వ్రాస్తాడు!

"ఈ నూత్న, పరిశుభ్రజీవితం త్వరలో వస్తే ఎంత బాగుండును! అప్పుడు మానిషి భవిష్యత్తులోకి ధైర్యంగా, నమ్మకంగా చూడగలుగుతాడు. నిటారుగా నుంచుని, తను చేసింది సరియైనదే నని, తన మార్గంలో అడ్డాలు లేవని ఆత్మవిశ్వాసంతో, గర్వంగా చూస్తాడు. ఈ జీవితం ఉదయించటానికి అట్టే కాలం పట్టదు"

['సోవియట్ లాండ్'నుంచి ఉద్ధృతం.]

చున్నాడు మన లీడరు.

అతనలా నిలబడ్డాడో లేదో, దీపస్తంభపు కీసీడల్లాగ చుట్టూ ఓ పాతిక ముప్ఫైమంది అర్థం కాని గోలచేసుకుంటూ తయారు. వెంకయ్యగారికి ముచ్చెమటలూ పోసేసేయి. కోదువాళ్లే. మెడలనిండా గవ్వలపేరులూ, పొత్తికడుపుమీదనుంచి మోకాళ్లదిక్కుండా యెఱ్ఱచారల కంబళీ గుడ్డలూ, గుండెలమీద కళ్ల క్రిందనూ ఎఱ్ఱచందనపు రేఖలూ, మోచేతులకీ దండలకీ యినప కడియాలూ తలలో పిగిలి పిట్ట ఈకలూ నెమలియీకలూ— అన్నింటికన్నా హడలెత్తించేస్తూ చేతుల్లో యీ బెల్లూపీళ్లున్నూ. యమకింకరుల్లాగ తయారయినారు. అందరూ కూచుంటే నిలబడ్డ మనిషి వెంకయ్యగారే అవడంచేత అతనే మొనగాడని నిర్ధారణచేసుకున్నారు గాబోలు ఆ కొండవెధవలు; అవాళంగా యీ బెల్లె అట్నుంచి యిటు తిప్పి వెంకయ్యగారి డొక్కలో గదిమేడు ఓ ఘాతం. వెంకయ్యగారికి పంచ ప్రాణాలూ నిలువునా యెగిరిపోయి నోటమాట లేకుండానే ఒక్క గెంతు వేసేడు. స్టూడెంట్సుయితే వున్న వాళ్లు వున్నట్టుగానే స్తంభించిపోయేరు.

“ఏం దారి భగవంతుడా!” నూతిలోంచి వచ్చినట్టుగా వచ్చింది వెంకయ్యగారి నోటంట మాట. అది ఆ కోదువాళ్లకి విక్రుతంగా వినిపించింది గాబోలు, గొల్లున నవ్వేరు. గవ్వల్లా ముప్పైయ్యారు పళ్లూ పైకి కనబడేటట్టు తలో మాట అన్నారు. ఏ మాటా ఎవ్వరికీ బోధపళ్లేదు. అంతలో ఓ కోదువాడు వెంకయ్యగారి పువ్వొత్తి పిలక అలా మునివేళ్లతో పట్టుకుని సాపుచేసి నిలబెడుతూ బుర్ర-చిటుక్కుమనిపించేడు. చుట్టుముట్టిన కోతివెధవలు మళ్లీ విరగబడి నవ్వేరు పదుల్లు బద్దలు గొట్టినట్టు. ఇంకో నిమిషానికి మరోడు ఎడమచెయ్యి ముందుకు చాచి చూపుడువేలు ఒక్కటే ముందుకు నిగిడ్చి గద్దగోరులాంటి వాడి కొనగోటితో ఆయన ముక్కుమీద యిలా అనేసరికి, పాపం లీడరుగారి కళ్లద్దాలు నేలని ప్రాకులాడేయి.

మరో పది నిమిషాలు పోయేసరికి ఓ కోదువాడు అంకె వేసి యేదో చెప్పేడు. చుట్టూవున్న కోదువాళ్లంతా ఒక్కసారిగా యీ బెల్లెత్తి యుద్ధంలో సిపాయిల్లాగ సిద్ధంగా నిలుచున్నారు. ఏం చేసిపోతారోనని కంపం ముంచుకొచ్చింది, కిక్కురుమనకుండా కూచున్న ముఠా అందరికీన్నీ. అంకె వేసిన కోదునాయకుడు రెప్పవెయ్యకుండా అటువేపు వింటున్నాడు. నిజవే. పాంచెవులు వాళ్లకి; కుక్కలాంటి పసిన్నీ. బాహా అయిదు నిమిషాలు పోతేనేగాని దూరాన్నుంచి కాపుచప్పుడు వినరాలేదు మనవాళ్లకి. మరో పావుగంటకి డ్రైవరూ కండక్టరూ రొజుకుంటూ వచ్చేరు. చుట్టుముట్టిన కోదువాళ్లని చూసి వాళ్ళకి గుండెలు అవిసిపోయేయి. ఎట్టకేలకి ధైర్యం తెచ్చుకుని, “కొంపముంచేరు బాబూ పెదపల్లెకి వెళతాం అంటే అందమ్మటల్లా తిరిగి తిరిగి మా ప్రాణాలుతోడుకుపోయేయి” అని ఏదో చెప్పబోయేడు డ్రైవరు. కాని, అతన్ని చెప్పనిస్తేనా? కోదునాయకుడు మళ్లీ అంకె వేసేడు. అక్కణ్ణుంచి డ్రైవరూ, కండక్టరూ కోదువాడూ ఒకటే గోల!— ఒకర్ని ఒకరు తోసుకొంటూ ఊగించేసుకుంటున్నూ.

ఆ డ్రైవర్ని చూసేసరికి వెంకయ్యగారికి కొంచెం ధైర్యం పొడచూపింది. “ఏవిటోయ్ ఆ గోల. నీ చేతిలోవున్న హేండిలుతో ఆ గాడిదవెధవ బుర్ర చితగ్గొట్టలేవూ?” అన్నాడాయన, అంతవరకూ లోలోపలే అణిగివున్న ధైర్యసాహసాలు ఒక్కసారి ప్రకటిస్తూను.

“బాబ్బాబు అటువంటి పనేవీ చెయ్యకండి, మీ పుణ్యం వుంటేను! ఏదైనా కాస్తంత అటూ యిటూ అయిందంటే యీ యీ బెల్లెన్నీ మీ వీపులమీదనే ఉంటాయి” అన్నాడు డ్రైవరు. అసలు తమ వీపులు ఉండవలసిన చోట ఉన్నాయా అని కాబోలు విద్యార్థులంతా రెండోకంటి వాడికి తెలియకుండా ఎవరి వీపులు వారు తడుముకున్నారు. డ్రైవరూ కండక్టరూ కోదువాడూ మళ్లీ తెలియరాని భాషలో గోలపెట్టడం ఆరంభించేరు.

“ఏవిటయ్యా వాడి అవస్థ? ఎప్పటికి తెవల్చవేం?” వెంకయ్యగారు మళ్లీ లీడరయిపోయేడు.

“ఊరుకో పంతులూ. నీతోనే వచ్చింది మాకీ అవస” కండక్టరు విసుక్కున్నాడు.

“ఈ డిక్కుమాలిన్ని రోజుల్లో పిన్నా పెద్దా అన్న మాట లేకుండా ఏకవచనప్రయోగం, యిదో పోయేకాలం,” వెంకయ్యగారి ధైర్యసాహసాలకి పౌరుషం కూడా తోడయింది.

“అలాగే. మేం రావడం మరోగంట ఆలస్యం అయితే మీకందరికీ పోయేకాలవే దాపరించి వుణ్ణు,” డ్రైవరు తీక్షణంగా జవాబిచ్చేడు. “ఊఁ తలకో రూపాయి చొప్పున యిస్తేనే గాని కదలనియ్యం అంటున్నారు, తియ్యండి మనీపర్సులు!”

ఇక గత్యంతరం లేకపోయింది. ఆడవాళ్లు పైటకొంగుముళ్లు విప్పేరు. కొందరు స్టూడెంట్సు మనీపర్సులు తెరిచేరు. మరికొందరు కోటులోపలి జేబుల్లోకి చేతులు పోనిచ్చేరు. వెంకయ్యగారు బొడ్డు కొంగున ముడి విప్పేడు. ఎలాగయితేనేం సొమ్ము పోగడింది. ఇహ నా రూపాయిలు వాడి చేతులో పొయ్యడం, మనవాళ్లు దారితియ్యడవే తరవాయి. కాని భరవసా యేవిటి? తీరా సొమ్ము చేజిక్కించుకుని వాడు మళ్ళీ అంత సొమ్మూ కక్కమంటే?......

పాపం, డ్రైవరే ఓ యేర్పాటు చేసేడు— కండక్టరుతోడుగా వీళ్లంతా చింతతోపు దాటి బస్సు చేరుకోడానికీ; అక్కడికి చేరుకున్నాక, కారుహారన్ మోగించగానే డ్రైవరు కోదువాడిమొహాన ఆసొమ్ముపారేసి రావడానికిన్నీ.

ఆ క్షణంలోనే వెంకయ్యగారి బుర్ర కూడా అతి తీక్ష్ణంగా పనిచేసింది. ఏవో! సొమ్ము కాస్తా చేత పడ్డాక, మళ్ళీ అంతా యిస్తేనేగాని డ్రైవర్ని వొదలం అంటే? ఎందుకయినా మనిషికి మనిషి ఉంటేనే మంచిదీ. తను ఒక్కడూ వెనక్కి ఉండిపోయేడు!!

పదినిమిషాలయినా కారుహారన్ మోగలేదు. ఏవాఁ అనుకొంటూ ఉంటే కండక్టరు తిరిగి ప్రత్యక్షం. తీరా బస్సుదగ్గరకి వెళ్లి జనాభా లెఖ్ఖ చూసుకునేసరికి పరమానందయ్యశిష్యుడు పంతులు ఒఖ్ఖడు మిస్సింగు!

“ఏం పంతులూ, మమ్మల్ని యిలా కొల్చుకుతిండానికి వెట్టుకున్నావ్, యివాళా?” అంటూ వొచ్చేడు కండక్టరు.

“కొల్చుకు తిండఁవేవిటేఁనీ పిండాకూడు! మనిషికి మనిషి ఆసరాగా నిలుస్తేను!” అని వెంకయ్యగారు తనక్కడెందుకు ఉండిపోయేడో విప్పిచెప్పేడు.

కండక్టరుకి నవ్వు కోపఁవూ ఒఖ్ఖసారిగా వొచ్చేయి—

“పంతులూ, చదివిచదివి నీబుర్ర చెడిపోయింది. వీళ్లు అసలే కోతివెధవలు. ఏవిఁటి చేస్తారో తెలుసునా? అమట్టుగా

(36-వ పేజీ చూడుడు)

మనదేశం

(4-వ పేజీ తరువాయి)

క్రమం ఇంకా ప్రారంభం కాలేదు.

ధాన్య సేకరణ*

చెన్నరాష్ట్ర ఆహారశాఖా మంత్రి రోష్ విక్టోరియాగారు ధాన్యం సేకరించడానికై స్వయంగా ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో సంచారంచేశారు. ఇప్పటికి మొత్తం 70 వేల బస్తాల ధాన్యానికి వాగ్దానాలు పోగుచేశారు. వారే ఊరెళ్ళినా ధాన్యవంతులైనవారు ధాన్యం ఇవ్వడానికి వాగ్దానాలివ్వడం, మిగతా అందరూ బియ్యానికి ఇబ్బందిగా ఉంది కాబట్టి ముందు అక్కడ అవసరాలు తీర్చినతరవాతనే సేకరించబడిన ధాన్యాన్ని ఇతర జిల్లాలకు తరలించాలని విన్నపంచేసుకోవడం జరిగింది. సర్కారు జిల్లాల్లో ప్రజలు బియ్యం కొరవవల్ల బాధపడుతున్నారంటే మంత్రులు నమ్మడంలేదు. పత్రికల వార్తలన్నీ అబద్ధాలనుకుంటారు.

నిజానికి సర్కార్ జిల్లాల్లో కొరవ లేకపోవచ్చును. కాని వ్యాపారులు, మిల్లర్లు తల్చుకుంటే కరువు తెచ్చిపెట్టడానికి పరిస్థితి అనుకూలంగా ఉందని మాత్రం చెప్పాలి. ఉభయ గోదావరి జిల్లాల్లో మంత్రిగారికి వాగ్దానమివ్వబడిన ధాన్యం దాళవా పంటలో వచ్చినదని గత కొన్ని వారాల సేకరణ ప్రమాణాన్ని బట్టి చూస్తేనే తెలుస్తుంది. ఈ దాళవా పంటని ఇప్పుడే కడిగేసి తీసుకుపోతే, దేశంలో ముందు ముందు క్లిష్ట పరిస్థితి ఏర్పడవచ్చును. పెద్దపంటలో ధాన్యంపైన ఎక్కువ ధరలు, ఎక్కువ లాభాలు గుంజుకోవాలనుకునే వ్యాపారులు, మిల్లర్లు ఇప్పుడీ రీతిగా మంత్రిగారికి ముఖప్రీతి నిమిత్తం వాగ్దానాలు, ధాన్యమూ కూడా ఇచ్చినట్లయితే, ఇహమూ, పరమూ కూడా లభిస్తాయి. ఇప్పుడు మంచి మాటా, ముందు ఎక్కువ లాభాలు.

సర్కారు జిల్లాల్లో కనీసావసరమైన ధాన్యంమటుకుంచి, మిగతా ధాన్యాన్ని కరువు జిల్లాలకి పంపాలనుకుంటే తప్పులేదు కాని, తీరా పంపిన తరవాత ఈ కనీసావసర ధాన్యాన్ని కేవలం వ్యాపారులకీ, మిల్లర్లకీ విడిచిపెట్టి, సర్కార్ జిల్లాల ప్రజలకి అమ్మాలంటేనే చిక్కొస్తుంది. సరిగ్గా వాడకానికి సరిపోయే ధాన్యాన్ని మాత్రమే అట్టేపెట్టినట్లయితే, దీనిపైనే ఎక్కువ లాభాలు గుంజడానికి వ్యాపారులు, మిల్లర్లు ప్రయత్నించక మానరు. వారలా చేస్తే,అది మరి వ్యాపారధర్మమే-నష్టాలు వస్తే ప్రభుత్వాలు ఆదుకోవు కాబట్టి, వొచ్చినప్పుడే చిక్కినంత లాభం గుంజేసుకోవడం వ్యాపారధర్మంగానే పరిగణించబడుతోంది. "మీరు ప్రజలకోసం త్యాగం చెయ్యాలి" అని వ్యాపారులకి చెప్పి ఏం లాభం? వ్యాపారులే నష్టాలొస్తే ప్రజలు త్యాగంచేస్తారా?

అసలీ కారణంవల్లనే సర్కార్ జిల్లాల్లో ఈనాడు అక్కడక్కడ కరువులొస్తున్నాయి. గతసంవత్సరం ఇల్లాగే ఊడ్చేశారు ధాన్యాన్ని. ఈ సంవత్సరం తుపాన్లు కొట్టెయ్యగా, సేకరించేవారు సేకరించగా, మిగిలిన ధాన్యం స్థానికంగా ప్రజలకి సరిపోయేదే. సరిగ్గా సరిపోతుంది కాబట్టే ఈ స్థితి వచ్చింది. కాబట్టి సర్కార్ జిల్లాల్లో కరువుందంటే ప్రభుత్వం నమ్మకూడనిదేమీ లేదు—వ్యాపారుల నీతిపట్ల మరీ దృఢవిశ్వాసం ఉంటే తప్ప.

ఈ పరిస్థితిలో స్థానికావసరాల్ని గమనించకుండా ధాన్యాన్ని తరలించినట్లయితే వచ్చే పంటలో ధాన్యం తప్పకుండా మరుగున పడిపోయేమాట తథ్యం. పేదల ఇళ్లు చొరబడి,స్వంతానికి నిలవచేసుకున్న బస్తా, అరా చొప్పున బియ్యాన్ని, ధాన్యాన్నీ ఉద్యోగులు సేకరిస్తున్నారే కాని, మిల్లుల్లోనూ, మంత్రుల ఆశ్రయం కల పెద్దల గిడ్డంగుల్లోనూ మూలుగుతున్న ధాన్యపు రాసులవంక చూడనైనా చూట్టంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ కశం కొన్ని మాత్రమంటేగాని ప్రభుత్వంపట్ల ప్రజలకు,పైకిముఖప్రీతి కనపర్చినా చాటుగా దుర్వ్యాపారానికి దిగే వ్యాపారులకుకూడా విశ్వాసం కలగడం, ధాన్యం పోగవడం అసంభవం.

ఉత్పత్తిదారుల్ని, మిల్లర్లని కూడగట్టుకుంటే చాలని భావించి ప్రభుత్వం ప్రజల్ని ఈ వ్యాపారుల పాలిట విడిచిపెట్టినట్లయితే ఆహారసమస్య అదనపు జిల్లాల్లో కూడా విషమిస్తుందే కాని బాగుపడదు.

దేశమంతటా, అంటే కొరవ రాష్ట్రాల్లోనూ, మిగులు రాష్ట్రాల్లోనూ కూడా ధాన్యసేకరణ మరింత దీక్షతో నిర్వహించడానికి, ఢిల్లీలో ముఖ్య మంత్రుల సమావేశం నిర్ణయించింది. ఏడు సూత్రాల ప్రణాళికను నిర్ణయించింది.

కాని ఆహారసమస్యా పరిష్కారం ధాన్యసేకరణదక్షతపైనే కేవలం ఆధారపడి ఉందా, లేక ధాన్యవ్యాపారాన్ని నిర్ణీత పంథాలో నడిపించడంలో ఉందా?—అనే విషయాన్ని ఇంకా ప్రభుత్వాలాలోచించలేదు.

[సీతారామ్]

(35-వ పేజీ తరువాయి)

డ్రైవర్ని బందీచేసి, వాణ్ణి విడిపించడానికి మళ్ళీ అంత సొమ్మూ నిన్ను తీసుకురమ్మంటారు. నువ్వు బస్సుదగ్గిరికి వచ్చి ఎలాగో సొమ్ము జతపరచి పట్టికెళతావనుకో. అప్పుడు వాళ్లు నిన్ను పట్టుకుని డ్రైవర్ని పీకేస్తారు. మరంత సొమ్ము పట్టుకొస్తేనే గాని నిన్ను వొదలం అంటారు. అలాగ నిన్ను కావని అతన్ని, అతన్ని కాదని నిన్నూ పట్టుకుని సొమ్ముకోసం పీడించుకు తింటూంటే—మా కింక పనేవీ లేదనుకున్నావా యేవిటి? నడువ్, యీపాటి? మహా చెడ్డ చదివేవ్ !!" అంటూ ఒక్కగసురు గసిరి, వెంకయ్యగార్ని నెట్టుకుంటూ పోయేడు కండక్టరు.

×

బస్సు మళ్ళీ కదిలి యింటిముఖం పట్టిందో లేదో, వెంకయ్యగారి బుర్రలో మళ్లీ మెరుపుతీగె!

"ఆ కోదువెధవల హంగామాకి హడలిపోయి తుప్పల్లా కూలబడిపోయే. గాని, అలా వాళ్లని చూస్తూనే నోట్సు ఓ రెండు ముక్కలు రాసుకున్నా తీరిపోను!" అంటూ విసుక్కున్నాడాయన.

"వరి మీరు అట్టే శ్రమపడిపోనక్కర్లేదు తాతగారూ; వొచ్చేవారం పత్రిక చూడండి. మన జేసికొక్కుసుమొచ్చటంతా అందులో వుంటుంది; తు—చ తప్పకుండా రాసికొంపుతాను" అంది కిరస్తానీపిల్ల.

సప్రాణం—బస్సు గొల్లున నవ్వింది!

భాషల పుట్టుపూర్వోత్తరాలు

౧. మాటలేని దశ

శ్రీ ఎన్. ఆర్. చందూర్

భాషలు ఎన్ని ఉన్నాయి. తెలుగు, తమిళ్, కన్నడం, హిందీ, యింగ్లీషూ కాక కొన్ని వందల భాషలు ఉన్నాయి. ప్రపంచంలో మొత్తం 3400 భాషలు ఉన్నాయట. మాట్లాడే ప్రతిదీ భాష అవుతుంది గాని ప్రతిభాషకీ లిపి ఉండదు.

అక్షరాలు ఉండి, రాయడానికీ చదువుకోడానికీ వీలుగావుండే దాన్ని లిపివున్న భాష అంటారు. తెలుగు, తమిళ్, కన్నడం, హిందీ, యింగ్లీషూ—యిలాంటివాటన్నిటికీ లిపి ఉంది. లిపిలేనివి ఏమిటంటారా? మన్యప్రాంతాలనించి వచ్చే కోయవాళ్ల మాటలు ఎప్పుడైనా విన్నారూ?

పట్టుతేనె, సారపప్పు అమ్మడానికి వొస్తూవుంటారు వాళ్లు; వాళ్ల ఆడవాళ్లు సోదె చెబుతారు. వాళ్లది మాటాడే భాషేగాని రాయడానికి వీలుకానిది—లిపి అంటూ ఒకటి లేదు వాళ్ళకి. ప్రపంచంలో 3400 భాష లున్నాయని అంచనా వేశారని చెప్పానా—అందులో లిపి ఉన్నవి రెండువందలు ఉంటాయేమో!

భాషల పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకునేందుకు ముందు, భాషలు రెండు రకాలని మనం గ్రహించాలి. లిపి ఉన్నవి—లిపి లేనివి. లిపిలేని భాషకి లిపిని ఏర్పాటు చెయ్యకపోతే, కాలక్రమేణా ఆ భాష జీర్ణించిపోతుంది. గంజాంజిల్లాలోని సవరలు మాట్లాడుకునే భాషకి లిపి వుండేది కాదు వెనక—ఈమధ్యనే దానికో లిపిని తయారుచేశారు.

లిపిలేని భాషలు మాట్లాడేగుంపుల సంస్కృతి వారితో అంతరించిపోతుంది. తమ అనుభవాలు వారు లిఖితపూర్వకంగా పదిలపరచలేరుకనక వారి విజ్ఞానం నిరుపయోగమై నశించిపోతుంది. ఇండియాలో ఆటవికజాతులు మాటాడే భాషలకి లిపి లేనేలేదు. అంచేత—మనం తెలుసుకోవల్సిందేమిటంటే—జీవం ఉన్న ప్రతి భాషకీ లిపి అంటూ ఒకటి ఉంటుందని.

భాషకి లిపిని ఆదిమానవుడు ఎందుకు కనిపెట్టాడో చెప్పుకోండి! తను తెలుసుకున్న సంగతులు తనతో అఖరవకుండా, తరవాతతరాలవారికి కూడా ఉపయోగపడేందుకు చిత్రాలతో కూడిన లిపిని ఏర్పాటుచేశాడు మానవుడు. శబ్దాలు మాటలుగా మారేందుకు వేల సంవత్సరాలు పట్టివుంటే, మాటలు బొమ్మల భాషలోకి దిగేందుకు అంతకి రెంట్టింపై ఉంటుంది.

మీలో చాలామంది మానవుడు కోతి నుంచి పరిణామం పొందాడని విని వుంటారు. కోతిలోనుంచి మనిషి పుట్టడమేమిటి—కోతులకి తోకలుంటాయి. మనిషికి తోక లేదు—అని సంశయించివుంటారు కూడాను మీరు. మనిషికి తోక లేనిమాట నిజమే—కోతులకి తోకలుంటాయి. 'కోతి నుంచి పరిణామం పొందిన మానవరూపుకు ప్రైమేట్'—అది ఒక దశలోనో వందేళ్ళలోనో జరిగిన పనికాదు. వేలకి వేలసంవత్సరాలు పట్టివుంటుంది. జీవశాస్త్రరీత్యా కోతికీ మనిషికీ అస్థిపంజరాల్లో భేదమేమీ లేదు; దవడలదగ్గిరా, మెదడు బరువులోనూ కొద్ది తేడా లున్నాయి.

కోతి నాలుగుకాళ్ళమీదా నడుస్తుంది—ముందుకాళ్లు పైకెత్తి నుంచుంటుంది. ముందుకాళ్లతోబాటు వెన్నూతలా ఎత్తడం కోతికి చేతనయింది. నాలుగుకాళ్ళ మీదగాని నుంచోలేని జంతువుచూపుకీ, రెండుకాళ్ళమీద నుంచుని తలపైకెత్తి నాలుగువైపులకీ చూడగలిగిన కోతిచూపుకీ తేడా ఏర్పడింది. ఈ దృష్టివైశాల్యంవల్లా, దృష్టిబలంవల్లా కోతి మెదడుకి తీక్ష్ణతా, నేర్పుతో బతకగలిగే సమర్థతా ఏర్పడ్డాయి.

ఆదిమానవుడి పూర్వీకుణ్ణి 'ప్రైమేట్' అంటారు—అనగా కోతిని పోలినవాడు. అతను ముంజేతులు రెండుకాళ్ళమీదా ఆన్చి, నిటారుగా నుంచోలేకపోయినా, వాలిన నడుంతో నడిచేవాడు. ఇది ఎందుకు చెప్పొచ్చానంటే—ఆదిమానవుడికి కోతులకిమల్లే కిచకిచలాడటం తెలుసుగాని మాటలనేవి తెలీదు.

ఏనుగ గాంభీర్యంగల జంతువైతే, కోతి వొట్టి కొంటెది. మనమేం చేస్తే తనూ అది చెయ్యబోతుంది. "కోతీ, నా ముక్కు దురద" అంటే మీదపడి రక్కుతుంది. వినని కుర్రాణ్ణి 'కోతిలా అల్లరిచెయ్యకు'—అంటాం. కుక్క వాసనబట్టి పసిగడుతుంది. కాని, కోతి మనం చేసే ప్రతిపనీ అనుకరించబోతుంది.

మాటలేని దశలో మానవులు కోతుల్ని పోలివుండేవారు. చెట్టుతొర్రల్లోనో, కొండగుహల్లోనో చీకటికి భయపడుతూ పచ్చిమాంసం తింటూ కాలంగడిపేవారు! ఆకలీ, ప్రాణభయం—ఈ రెండే తెలుసు వారికి. ఆకలి తీర్చుకుంటూ, ప్రాణభయం నించి కాపాడుకుంటూ వుండేవారు. ప్రాణభయంనుంచి తమనీ తమ గుంపునీ కాపాడుకుంటూవుండే ప్రయత్నంలో రోదనలూ, ఆక్రందనలూ, శబ్దాలూ వెలువడ్డాయి. ఆవు 'అంబా' అనే అరుస్తుంది. కుక్క 'భోంయ్' మనే మొరుగుతుంది—ఒకొక్కప్పుడు ఏడుస్తుంది కూడాను. కుక్క కోతికియికిలింపూ, సకిలింపూ, కిచకిచా అరుపులూ చాలా తెలుసు. భావానుయుక్తమైన శబ్దాలు మిగతాజంతువుల కంటె కోతికి ఎక్కువ తెలుసు.

ఆదిమానవుడు ప్రాణభయానికి ఎలా దద్దరిల్లేవాడో, అల్లే ఎక్కువ పచ్చిమాంసం లభించినప్పుడు సంతోషం తన పక్కవాళ్ళకి తెలియజెప్పేందుకు కిచకిచలాడేవాడు. మాటలేని దశలో మానవుడు ఎలావున్నాడో తెలుసుకునేందుకు నెలలపిల్లని జాగ్రత్తగా పరిశీలిస్తే సరి! పాప పుట్టగానే క్యావు మంటుంది; అలా ఏడవకపోవం

దోపంకిసక మంత్రసాని ముందు పిల్లని పడిపిస్తుంది వాలుగో పెలని ఉయ్యాల్లో తొట్టెలో కట్టిన రంగుబొమ్మల వంక కళ్లార్పకుండా చూస్తూ మునిముసినవ్వులు నవ్వకుంటుంది. ఏడుస్తున్నప్పుడు యిల్లు పడగొడతుంది గాని పాప, నవ్వుతున్నప్పుడు యింకా శబ్దం తెప్పించలేదు. తర్వాత ఆనవాళ్లు తెలుస్తాయి. కొత్తవాళ్ల వంక భయంభయంగా చూస్తుంది ఆ తైన మనం మాటలు నేర్పుతాం—పాప మాటలు నేర్చుకొంటుంది, బళ్లో వేస్తాం—పుస్తకాలు చదువుతుంది.

కాని, ఆదిమానవుడికి యిన్ని అవకాశాలెక్కడవి? కడుపు నింపుకోడం, చావకుండా బతకడం—ఈ రెండే అతని జీవిత లక్ష్యాలు. విశాలమైన దృష్టితోబాటు ఆదిమానవుడి చేతులు కూడా శక్తివంతమైనాయి కళ్లతో చూడటం, చెవులతో వినడం, చేతులతో చెయ్యగలగడం—ఈ మూడింటి ప్రేరణవల్ల మెదడుకి బుగ్గిలం కలిగింది అన్ని జంతువులూ వింటాయి; అన్ని జంతువులూ చూస్తాయి కాని, ఆదిమానవుడు తన కాళ్లమీద నిటారుగా నుంచోగలగడంవల్ల ఎక్కువ ప్రదేశాన్ని చూడగలిగాడు. ఆ దూరపుచూపు అలవాటుకావడం వల్ల కళ్లతోబాటు చెవులుకూడా గ్రహణశక్తిని పెంపొందించుకున్నాయి ఈ రెండిటికీ తోడు చేతులు. చేతుల సాయంతో ఆదిమానవుడు కోసుగా రాళ్లని చెక్కి తను చెట్టుచాటున నక్కి, దూరాన వున్న జంతువు మీదికి సూటిగా విసిరి, దాన్ని చంపేవాడు. మిగతా జంతువులు కలియబడి పోట్లాడుకునేవి. కాని 'ప్రైమేట్' రాతిఆయుధాలు తయారుచేసి, వాటిని వుపయోగించి, తనకి కావల్సింది సంపాయించుకునేవాడు—కావల్సింది అనగా పచ్చిమాంసం. ఆదిమానవుణ్ణి Tool - Making animal అన్నారు. ఆయుధాలూ పరికరాలూ చెయ్యడం నేర్చుకునే అతను యింతవాడయాడు

మొదట్నుంచీ మనుషులు గుంపులుగుంపులుగా ఉంటూండేవారు గుంపులో ఉండటంవల్ల ప్రాణభయం తక్కువ. అంతేగా ఆదిమానవుడి లక్ష్యాలు! ప్రాణాన్ని రక్షించుకోడం—కడుపు నింపుకోడం.


ఇలాంటి స్థితిలో మనిషి మెదడులో ఒకమార్పు వచ్చింది. చూసే కన్నూ, వినే చెవీ చేసే చేతులూ వాటిపను లవి చేస్తూవుండగా Neo Palium—అనగా జ్ఞానస్పర్శేంద్రియాల కూడలిస్థానం—కూడా మనిషి అవసరాలకి అనుగుణంగా పెరిగింది. జ్ఞాపకాలన్నీ యిక్కడ ఆకారంలేకుండా జీవిస్తూవుంటాయి. నిన్నటిపాఠం యివ్వాళదాకా జ్ఞాపకంవుండటానికి కారణం మనం పెంచుకున్న జ్ఞాపకశక్తే మనిషి జ్ఞాపకాలు స్ఫురణకి తెచ్చుకుని కర్తవ్యాన్ని నిర్ణయించుకుంటాడు.

ప్రిహిస్టారిక్ కాలంలో జీవించిన మనుషులకి జ్ఞాపకాలు లేవనుకోకండి. ఈ జ్ఞాపకాలు తమ పిల్లలకి చెప్పేందుకే మాటల కోసం వెతుక్కున్నారు జ్ఞాపకశక్తికి కేంద్రస్థానంకూడా మిగతా అవయవాలతోబాటు పెరగడంవల్ల మనిషిబుద్ధి ఆశ్రయించాడు.

మాటలేని దశలో మానవులింకా పచ్చిమాంసమే తింటూవుండేవారు.

[ఇంకా వుంది]

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)



జాతీయ సప్తాహ సందర్భములో వరంగల్లో ఏర్పాటుచేయబడిన ఆటల పోటీలలో గెలుపొందిన పి. ఆర్. టీం. వారికి శ్రీ కాళోజి రామేశ్వరరావుగారి ద్వారా బహూకరణం ఇవ్వబడింది.

నేటిప్రపంచం

(8-వ పేజీ తరువాయి)

ఎలా ఉన్నాయో పరిశీలించలేదు. అసలు సమాధానం కుదరకపోవడానికి మూలహేతువు లేవో, సమాధానం ఎందుకు పొసగకుండా వచ్చిందో, రోగహేతు వేదో పరీక్షించలేదు. ఔషధాలకి లొంగలేదు కాబట్టి ఆపరేషన్‌కి దిగాలన్నారంతే.

అసలు భద్రతామండలి వ్యవహారమే ఆ రీతిగా ఉంది. రోగహేతువు కనిపెట్టకుండా బీరువాలో ఉన్న మందులన్నీ ప్రయోగించి చూడ్డం ప్రారంభించారు-ఇప్పటి మన జ్వర చికిత్సలాగే. ఒక్కొక్క ఔషధం వాడుతూంటే కొత్తకొత్త రోగలక్షణా లుత్పన్నమైనట్టుగానే, కాశ్మీరంలో కొత్త కొత్త సమస్య లుత్పన్నమాతూ వచ్చాయి. ఇంక ఏదీ లాభంలేదనుకున్న తరవాత, (పూర్వ వైద్యుల లంఘనం మాదిరిగానే) దేశదేశాలా బ్రిటిష్, అమెరికన్ ప్రవీణులు ప్రయోగిస్తూ వచ్చిన దేశవిభజ నొక్కటే మిగిలిన చికిత్సా మార్గ మనుకున్నారు. తమవంతు ఈ ఔషధాన్ని చూపారు డిక్సన్. అయితే ఈ విషయమై సావధానంగా ఆలోచించాలన్నారు నెహ్రూ, లియాఖత్ అలీ.


డిక్సన్ సూచించిన మార్గ మేమిటంటే: నిశ్చితంగా భారతదేశంలో చేరడాని కొప్పుకుంటారనే నిర్వివాద ప్రాంతమైన జమ్మూను భారతదేశానికీ, పశ్చిమకాశ్మీర్‌ని పాకిస్తాన్‌కీ ఏ ప్లెబిసైట్ లేకుండానే ఒప్పగించేసి, మిగిలిన ఉత్తర పర్వతమయ ప్రాంతంలోనూ, కాశ్మీర్ లోయలోనూ మాత్రం ప్లెబిసైట్ జరపాలి. ఈ ప్లెబిసైట్ జరిపేటప్పుడు భారతసైన్యాలు కాశ్మీర్ లోయ విడిచిపెట్టి, జమ్మూ వెళ్లి ఉంటాయి. పాకిస్తాన్ సైన్యాలు పశ్చిమకాశ్మీరంలో ఉంటాయి. మధ్యకాశ్మీర్ లోయ ప్రాంతాన్నీ, ఉత్తరపర్వతప్రాంతాన్నీ (అంటే లడఖ్ లోయ సహా) పరిపాలనను ఒక్క ఆరుమాసాలు ఐక్యరాజ్యసమితి కొప్పగించి, అప్పుడు ప్లెబిసైట్ జరపాలి.

అంటే క్రియలో వీరు సూచించిన దేమిటంటే కాశ్మీర్ లోయలోని శ్రీనగర్‌లో ఉన్న షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని గద్దెదించేయ్యాలి. హిందూసంఖ్యాధిక్యంగల ప్రాంతాన్ని భారతదేశానికీ, పాకిస్తాన్ ఆక్రమణలో కల ముస్లింసంఖ్యాధిక్యం కల ప్రాంతాన్ని పాకిస్తాన్‌కీ ముందుగానే పంపకం పెట్టాలి. ముస్లింజనసంఖ్యాధిక్యం ఉన్నప్పటికీ, షేక్ అబ్దుల్లా ప్రతిభవల్ల, ప్రతిష్ఠవల్ల మతరహిత రాజ్యాంగవ్యవస్థయైన భారతరిపబ్లిక్ వైపుకే మొగ్గుకున్న కాశ్మీర్ లోయప్రజల్ని, షేక్ అబ్దుల్లా పాలన తొలగించి, ఐక్యరాజ్యసమితిపాలన కొప్పగించి, ప్లెబిసైట్ జరపాలి.

భవిష్యద్రాజ్యాంగనిర్ణయం కాని, రాజకీయాందోళనగాని మతభేదాలపై ఆధారపడరాదనే వాదాన్ని, భారతకాంగ్రెస్ ప్రభుత్వం విడిచిపెట్టి, మతభేదరహిత రాజ్యాంగవ్యవహారాసక్తుడైన షేక్ అబ్దుల్లానీ, అతని ప్రభుత్వాన్నీ భ్రష్టుల్ని చెయ్యాలన్నమాట — సరిహద్దురాష్ట్రంలో ఖాన్ సహోదరుల్ని కాంగ్రెస్ విడిచిపెట్టినట్టు, లేదా భాంతముస్లింలీగ్ పాకిస్తాన్ వొదిలేసినట్టు.

మాటల్లో డిక్సన్ ఇలా చెప్పకపోయినా అంతర్యం ఇదే. అంతర్యం ఇదేనని బహుశా వారికి తెలిసివుండదు. అందువల్లనే, అంటే మన వ్యవహారాల లక్షణాలు తెలియకపోవడ వల్లనే, పరదేశీయులు మన సమస్యల్ని పరిష్కరించగల ప్రవీణు లనుకోవడం, తీరా పరిష్కరించలేక నెపాన్ని భారతదేశంపై పడెయ్యడం జరుగుతూవచ్చింది.

డిక్సన్ గారి ఆదేశాన్ని పాకిస్తాన్ రుచించలేదు. సైన్యోపసంహరణ విషయంలో నెహ్రూ, లియాఖత్ అలీఖాన్



15 ఆగస్టున అజాంషాహీ మిల్లు లేబర్ కాలనీలో మిల్లు కార్మిక యూనియన్ కార్యదర్శి శ్రీ ఆశపాల సత్యనారాయణగారు జాతీయ పతాకారోహణ మొనర్చిరి.

ఇద్దరూ తమ పూర్వవాదాల్నే మళ్లీ వల్లించినా, నింద అంతా నెహ్రూపైనే రుద్దారు. డిక్సన్ మొత్తానికి డిక్సన్‌గారి అపరేషన్ కూడా సమకూడిందికాదు. ఇంక తమ చేత గాదని చెప్పేసి, లేక్‌సక్సెస్ దిక్కుగా వెళ్లిపోయారు.

వెడుతూ వెడుతూ, ఉభయప్రభుత్వాలూ స్వయంగానే సామరస్యానికి కృషిచెయ్యడం మంచిదని, అది అసాధ్యం కాదని చెప్పి వెళ్లారు. ఇది ఇంతతో పోలేదు. డిక్సన్‌గారికి మిలిటరీ సలహాదారుగా వచ్చిన అమెరికన్ సైనికోద్యోగి జనరల్ హాడ్డెన్ (కొరియా విభజనకర్త అయిన జనరల్ హాడ్డెన్ కాదు ఈయన, కాని అంకటివాడే) కాశ్మీర్ విభజనప్లాన్ బలేగా ఉందనీ, భద్రతామండలి ఈ ప్లానుమీదే పట్టుదలతో పనిచేస్తే మంచిఫలితాలొస్తాయనీ అన్నాడు. బ్రిటిష్, అమెరికన్ పత్రికలు కూడా అలాగే అంటున్నాయి. ఆ మంచి ఫలితాలేవో ఎక్కడెక్కడ దేశాల్ని విభజించినా బ్రిటన్‌కీ, అమెరికాకీ తప్ప ముక్కలైన దేశాలకి. వీసమైనా అంటలేదు. చిట్టచివర ఇద్దరూ పలికిన రెండు ముక్కలూ పట్టు కొని పరిష్కరించెయ్యాలని భద్రతామండలి పట్టుబట్టినా, సత్యం లంటటి ఘటిసులే కాబట్టి ఆశ్చర్యపడ నవసరంలేదు.

డిక్సన్ మధ్యవర్తిత్వం విఫలం కావడానికి తప్పంతా పూర్తిగా భారతదేశం నెత్తిపైనే ఉందని లియాఖత్ అలీఖాన్ గారు కరాచీలో పెద్ద స్టేట్‌మెంట్ ఇచ్చారు. అసలు కాశ్మీర్‌లో దురాక్రమణ జరిపినది భారతదేశం అన్నారు. సంస్థానం విభజన కొప్పుకోడమే భారతదేశం దుర్జనత్వం కన పరుస్తోం దన్నారు. కాని, వాస్తవానికి పాకిస్తాన్ మరోలా అనుకోకపోతే విభజన విషయమై ఆలోచించవచ్చుననిమాత్రమే నెహ్రూ అన్నారు. పాకిస్తాన్ మరోలా అనుకోడమే కాదు, నెహ్రూ ఒప్పేసు కున్నట్టు ప్రచారం చేస్తోంది.

పండిట్ నెహ్రూ అంతకంటె పెద్ద స్టేట్‌మెంట్ ఇచ్చారు. అసలు 'పాకిస్తాన్ దురాక్రమణ ప్రారంభించింది, వాళ్ళ నట కాయించండి' అని ముందు భద్రతామండలికి ఫిర్యాదుచేసినది భారత ప్రభుత్వం. కాశ్మీరంలో పాకిస్తాన్ రెచ్చగొట్టిన మత కలహాలు ఆగిపోయి, పాకిస్తాన్ దురాక్రమణపరులు, పఠాన్ దోపిడీమూకలు వెళ్లగొట్టబడిన తరవాత, శాంతి ఏర్పడి




యుద్ధంలో పట్టుబడిన ఉత్తరకొరియా యుద్ధఖైదీవద్ద కూపీతీస్తున్న అమెరికా—దక్షిణకొరియా సంయుక్తసైనిక వార్తాశాఖ అధికారులు.

నప్పుడు, ప్లెబిసైట్ పెట్టి కాశ్మీర్ ఏ దేశంతో చేరుతుందో నిర్ణయించగలరని చెప్పినది భారతప్రభుత్వమే. ఇవన్నీ దాచేసి, దురాక్రమణ చేస్తే చేశారన్నట్టు పాకిస్తాన్‌కి అలుసిచ్చి, ప్లెబిసైట్ ఎలా జరపడం అని మథనపడ్డం మొదలెట్టింది భద్రతామండలి. (భద్రతామండలి అనడానికి బదులు ఆంగ్లో-అమెరికన్ రాజ్యకూటం అంటే బాగుంటుంది. వారి నిర్ణయమే భద్రతామండలి నిర్ణయం కాబట్టి.)

ఇప్పటికైనా మించిపోయింది లేదు. దురాక్రమణ జరుగుతోందని భారతదేశం చెప్తే, ఆనాడు ఆమాట వారి చెవిని పడనే లేదు. ఇప్పుడు భారతదేశమే దురాక్రమణ జరిపిందని పాకిస్తాన్ అంటోంది కాబట్టి, దురాక్రమణ నేరం ఎవరిపై నుందో నిర్ణయించడం మంచిదన్నారు పండిట్ నెహ్రూ, అసలు ఆ దురాక్రమణ సంగతేదో తేల్తేకాని కాశ్మీర్ సమస్య పరిష్కారం అసంభవం కాబట్టి, ఇప్పటికైనా భద్రతామండలి రోగ హేతువుని పరీక్షించి తెలుసుకోవడం అవసరం. కాని ధోరణి చూస్తే, అది తప్ప ఇంకేపనైనా సరే భద్రతామండలి (ఆంగ్లో-అమెరికన్‌వర్గం) చెయ్యడానికి సిద్ధమే నని తోస్తుంది. ఇందువల్ల పరిష్కారం అసంభవం కాగా, భరతఖండంలో పరిస్థితులు విషమించే ప్రమాదంకూడా కద్దు.

అయితే కొరియాసమస్యలో ఎవరు కూచోవాలి అనే తర్జనభర్జనల్లోపడి భద్రతామండలి కొట్టుకుంటోంటే, మధ్య వచ్చే కాశ్మీరసమస్య చర్చలరూపం ఎలా ఉంటుందో చెప్పడం అసంభవం. కొరియాకి పరాన్నసీ, పంజాబీల్ని పంపిస్తానని ఒకసారి, పంపించనని ఒకసారి పాకిస్తాన్ పుకార్లు పుట్టించడం చూస్తే దీన్ని కాశ్మీర్ సమస్యతోబాటుగా ముడిపెట్టి, ఆంగ్లో-అమెరికన్‌వర్గంతో బేరాలకి ఎర చూపడం లేదుకదా అనే అనుమానం కూడా కలుగుతోంది. [సూర్యనారాయణ]


కొరియా యుద్ధం



కొరియాలో పోరాడుతున్న సేనల సహాయార్థం దూరప్రాచ్య రంగానికి వెళ్లిన అమెరికన్ విమాన వాహక నౌక



కమ్యూనిస్టులమీద 105 మి మీ హోవిడ్జర్‌లను ప్రయోగించుతున్న అమెరికన్ ఫిరంగిదళం



కొరియాలోని ప్రధానమైన ఓడరేవు పూసాన్ నగరం అమెరికన్ బలాలకు రవాణా కేంద్రం

Regd No M 4479

Edited Printed & Published by S Sambhu Prasad at the Andhra Patrika Press 7 Thambu Chetty St Madras